


రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ॥160/- పేజీలు:195
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




తెలంగాణ
రాజకీయ
వైతాళికుడు
రావి నారాయణరెడ్డి
06


సంపుటి 28, సంచిక: 78 | ఆదివారం | 7-09-2025 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00


# వెళ్లొస్తా...



# వైభవంగా గణేశ్ నిమజ్జనోత్సవం



ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనానికి వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- కన్నుల పండువగా సాగిన శోభాయాత్ర
- భాగ్యనగరానికి ఆధ్యాత్మిక శోభ
- జనసంద్రమైన హుస్సేన్ సాగర్
- గణపతిబప్పా మోరియా నినాదాలతో దద్దరిల్లిన ట్యాంక్‌బండ్ పరిసరాలు
- ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మంత్రి పొన్నం ప్రభాకర్, జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి ఏరియల్ సర్వే
- రూ.35 లక్షలు పలికిన బాలాపూర్ గణేశ్ లడ్డు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆధ్యాత్మిక శోభతో కన్నుల పండువగా గణపతి నిమజ్జనోత్సవం ముగిసింది. హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. అనంత చైతన్యంతో మహా గణేశ్ నిమజ్జన శోభాయాత్ర హైదరాబాద్ వీధులన్ని భక్తి, ఉత్సాహం, ఆధ్యాత్మిక ఉల్లాసంతో మార్మోగాయి. వీధులన్ని గణనాథుడి నినాదాలతో మారుమ్రోగుతుండగా నిమజ్జనం మహాసంకల్పయాత్రగా మారింది. హైదరాబాద్ నగరం ఆధ్యాత్మిక కాంతుల తారకమైంది. ముఖ్యంగా హుస్సేన్‌సాగర్ చుట్టూ లక్షలాది మంది భక్తులు, గణపతి విగ్రహాలతో సందడి నెలకొంది. భక్తులతో హుస్సేన్‌సాగర్ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. శోభాయాత్ర మార్గాలు 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో మారుమోగాయి. ఎంజె మార్కెట్, సికింద్రాబాద్, అబిడ్స్, లిబర్టీ, నారాయణగూడ, హిమాయత్ నగర్, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ఇందిరా పార్కు, లోయర్ ట్యాంక్‌బండ్, ఖైరతాబాద్, నెక్లెస్ రోడ్, మినిస్టర్ రోడ్ మీదుగా ట్యాంక్ బండ్ వరకు గణేశ్ శోభాయాత్రలు తరువాయి 12లో

## మహా గణపతికి ఘన వీడ్కోలు

దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ వినాయకుని నిమజ్జన కార్యక్రమం ఆద్యంతం భక్తజనుల సందడి మధ్య ఘనంగా ముగిసింది. ఈ అద్భుతమైన ఘట్టాన్ని వేలాది మంది భక్తులు ప్రత్యక్షంగా వీక్షించి 'జై జై గణేశా.. బై బై గణేశా' అంటూ నినాదాలు చేశారు. మహా గణపతి శోభాయాత్ర ఘనంగా కొనసాగింది. శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా ఈసారి గణనాథుడు భక్తుల నీరాజనాలందుకున్నాడు. లక్షలాదిమంది భక్తుల మధ్య మహా గణపతి ట్యాంక్‌బాండ్‌లో నిజమజ్జనమయ్యాడు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన బడా గణేశ్ శోభాయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు ట్యాంక్‌బాండ్‌కు చేరుకుంది. ఖైరతాబాద్ నుంచి మొదలైన శోభాయాత్ర టెలిఫోన్ భవన్, సచివాలయం మీదుగా సాగి మధ్యాహ్నం 1:45 గంటలకు హుస్సేన్ సాగర్‌లోని ఎన్‌టిఆర్ మార్గ్ వద్ద ఉన్న 'బాహుబలి క్రేన్4' వద్దకు చేరుకుంది. సుమారు 70 అడుగుల భారీ క్రేన్ సాయంతో ఖైరతాబాద్ గణపతిని నెమ్మదిగా ఎత్తి, భక్తుల నినాదాల మధ్య హుస్సేన్ సాగర్‌లో గంగమ్మ ఒడికి తరువాయి 12లో



పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బి.మహేశ్‌కుమార్‌గౌడ్

## కవిత వ్యాఖ్యలు
# ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా...

- కొందరు నాయకులు, పార్టీలు చేసిన ఆరోపణలే ఆమెకూడా చేశారు
- కొత్తేమీ లేదు : హరీశ్‌రావు
- ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో బిఆర్‌ఎస్ చీఫ్ కెసిఆర్‌తో భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్

తన జీవితం తెరిచిన పుస్తకమని, గత కొంత కాలంగా కొందరు నాయకులు, పార్టీలు చేసిన ఆరోపణలే కవిత కూడా చేశారని, ఇందులో కొత్తదేమీ లేదని తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కవిత ఆ వ్యాఖ్యలు ఎందుకు చేశారో ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. అమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాత హరీశ్‌రావు తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ రెండున్న దబ్బాల కాలంలో కెసిఆర్ నాయకత్వంలో తాను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, తరువాయి 2లో

## చర్లపల్లిలో డ్రగ్స్ తయారీ
# యూనిట్ గుట్టు రట్టు

- 30 వేల లీటర్ల ముడి సరుకు స్వాధీనం
- 13 మంది నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**స్థావరంపై మహారాష్ట్ర పోలీసుల దాడి**



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి

మేడ్చల్ జిల్లాలోని చర్లపల్లిలో కెమికల్ ఫాక్టరీ మాటున గుట్టు చప్పుడు కాకుండా డ్రగ్స్ తయారు చేస్తున్న ఓ ముఠాను మహారాష్ట్ర క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేసారు.శనివారం మహారాష్ట్ర నుండి వచ్చిన పోలీసుల బృందం డ్రగ్స్ తయారు చేస్తున్న స్థావరంపై దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకొన్నారు. నిందితుల నుండి 32 వేల లీటర్ల అత్యంత ప్రమాదకరమైన ఎక్స్‌టిసీ, ఎక్స్‌టిసి మోలి అనే డ్రగ్స్‌ను స్వాధీనపరచుకొన్నారు. ఈ ముఠా గత కొద్ది కాలంగా తయారు చేస్తున్న డ్రగ్స్‌ను దేశ విదేశాలకు సరఫరా చేస్తున్నట్లు తరువాయి 2లో

## కోర్టు ఉత్తర్వులను ఉపేక్షిస్తే
# ఊరుకునేది లేదు

సిఎస్ కోర్టుకు రావాల్సిందే : హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిషేధి భూముల వివరాలను సంబంధిత సబ్‌రిజిస్ట్రార్లకు అందజేసే ప్రక్రియపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించినా పట్టించుకోని సీఎస్‌పై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను ఉపేక్షిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించింది. అఫిడవిట్ దాఖలు చేయకపోతే వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించామని, అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతోపాటు వ్యక్తిగత హాజరుకాకపోవడం అసహనం వ్యక్తం చేసింది. కనీసం హాజరు మినహాయింపు కోరుతో పిటిషన్ దాఖలు చేయకపోవడాన్ని తప్పుబట్టింది. చివరి అవకాశంగా మరో వారం గడువు ఇస్తున్నామని ఈలోగా రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22ఎ కింద ఉన్న నిషేధిత భూముల వివాదానికి సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని లేదంటే వ్యక్తిగతంగా తరువాయి 12లో

## భారత్ ప్రధాని మోదీతో
# స్నేహంగానే ఉంటా

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ/వాషింగ్టన్:** భారత్-అమెరికా మధ్య ప్రత్యేక సంబంధాలు ఉన్నాయని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. రెండు దేశాలమధ్య సంబంధాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ, ''కొన్ని సందర్భాల్లో అలా జరుగుతుంది'' అన్నారు. భారత్‌పై సుంకాల భారం, రష్యా నుండి చమురు కొనుగోలు చేయొద్దని ఒత్తిడిచేసేందుకు పెనాల్టీ విధించడం వల్ల ఉద్రిక్తతలు తలెత్తిన ప్రస్తుత పరిస్థితులమధ్య శనివారం వాషింగ్టన్ ఓవల్ ఆఫీసులో పాత్రికేయులు అడిగిన ప్రశ్నలపై ట్రంప్ పైవిధంగా వ్యాఖ్యానించారు. ''నేనెప్పుడూ నరేంద్రమోదీతో తరువాయి 2లో



## ట్రంప్ సానుకూల
# స్పందన శ్లాఘనీయం

'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ ప్రశంస

**న్యూఢిల్లీ:** భారత్-అమెరికా రెండు దేశాలమధ్యా బంధం ''ప్రత్యేకం'' అని డోనాల్డ్ ట్రంప్ కొనియాడిన తర్వాత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కూడా ఎక్స్ వేదికగా అంతకు సమానంగా ఎంతో సానుకూలంగా స్పందించారు. భారత్-అమెరికా భాగస్వామ్యంపై అమెరికా నాయకుడు వ్యక్తం చేసిన సానుకూలమైన విశ్లేషణ శ్లాఘనీయం, ఆయనకు నా అభినందనలు అని పేర్కొన్నారు. ''ఎంతో గాఢంగా ఆయనకు నా ప్రశంసలు తెలియజేస్తున్నాను, ఇరు దేశాల సంబంధాల విషయంలో అధ్యక్షుడు ట్రంప్‌కు ఉన్న భావోద్వేగాలు, సానుకూల విశ్లేషణాత్మకమైన అంచనాలు సంపూర్ణంగా పరస్పరం ఇచ్చిపుచ్చుకునేవి'' అని మోదీ పేర్కొన్నారు. ''చాలా సానుకూలమైన, భవిష్యత్తులోకి తొంగిచూడగల సమగ్ర,ప్రాపంచిక వ్యూహాత్మక తరువాయి 2లో

## రష్యా నుంచి మూడేళ్ళలో చమురు
# దిగుమతులు నిలిపివేత

- యురోపియన్ యూనియన్ నిర్ణయం
- తీవ్రంగా వ్యతిరేకించిన హంగేరి, స్లోవేకియా దేశాలు




**లండన్:** రష్యా నుండి రాబోయే మూడేళ్ళలో చమురు దిగుమతులను నిలిపివేయాలని యూరోపియన్ యూనియన్ నిర్ణయించింది. కానీ ఈ నిర్ణయాన్ని హంగేరీ, స్లోవేకియా దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. రష్యా నుండి చమురు దిగుమతి చేసుకోకూడదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యూరప్ దేశాలపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్న తరుణంలో ఇ యు ఈ నిర్ణయం తీసుకుంది. గడచిన గురువారం ట్రంప్ ఈ మేరకు యూరోపియన్ యూనియన్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో 2028 జనవరి ఒకటో తేదీ నుండి రష్యా నుండి చమురు దిగుమతులు నిలిపివేయాలని ఇ యు ఇంధన వ్యవహారాల కమిషనర్ డాన్ జోర్గెన్‌సన్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. చైనా తియాన్‌జిన్‌లో ఎస్‌సిఓ (షాంఘై సహకార సంస్థ) తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## జార్జియా హ్యుందయ్ ప్లాంట్‌పై దాడి
### 475 మంది వలస ఉద్యోగులు అరెస్టు

**జార్జియా:** అమెరికా జార్జియా రాష్ట్రంలో ఉన్న హ్యుందయ్ కంపెనీ బ్యాటరీ తయారీ ప్లాంట్‌పై అక్రమ వలస కార్మికుల నిరోధక అధికారులు దాడి చేశారు. విజిటర్ వీసాలు లేకుండా అక్రమంగా ప్లాంటులో పనిచేస్తున్న 475 మంది ఉద్యోగులను అధికారులు అరెస్టు చేశారు. వీరిలో దాదాపు 300 మంది పైగా దక్షిణ కొరియా దేశీయులే ఉన్నట్లు ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) అధికారులు గుర్తించారు. స్వల్పకాలిక, తాత్కాలిక పర్యటనల వీసాలపై వచ్చి ఉద్యోగాలు చేయడానికి అమెరికా నిబంధనలను ఒప్పుకోవని అధికారులు చెప్పారు. అమెరికా దేశీయుల ఉద్యోగాలను కాపాడేందుకే ఈ దాడులు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఐతే అమెరికాలోని కీలక పరిశ్రమల్లో కొన్ని వందల బిలియన్ డాలర్లు పెట్టుబడులుగా పెడతామని హ్యుందయ్ కంపెనీ ట్రంప్ ప్రభుత్వానికి ఇటీవల భరోసా ఇచ్చింది. అరెస్టుల విషయం తెలియగానే కొరియా ప్రభుత్వం రంగంలోకి దిగింది. అధికారులతో సంప్రదింపులు చేసి, కొరియన్ కార్మికుల హక్కులు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరింది.

## ఖలిస్థానీ, హమాస్, హిజ్బుల్లా సంస్థలకు కెనడాలోనే ఆర్థిక మద్దతు
### ప్రభుత్వ నివేదిక వెల్లడి





**ఒట్టావా:** ఖలిస్థానీ ఉగ్రవాదులకు కెనడా దేశంలోనే అంతర్గతంగా ఆర్థిక వనరులు సమకూరుతున్నాయి. కెనడా కేంద్రంగా ఆవిర్భవించి పనిచేస్తున్న కనీసం రెండు ఖలిస్థానీ ఉగ్రవాద ముఠాలకు అంతర్గతంగానే నిధులు అందుతున్నాయి. ఖలిస్థానీతోపాటు హమాస్, హిజ్బుల్లా గ్రూపులు కూడా అతిపెద్ద అంతర్జాతీయ సంస్థలుగా ఉగ్రవాద నిధులు అందుకుంటున్నాయి. వ్యాపారాలు, బ్యాంకింగ్ రంగాల సేవలను దుర్వినియోగం చేయడం ద్వారా క్రిప్టో కరెన్సీని ఉపయోగించి చారిటబుల్ సంస్థలను, ప్రభుత్వేతర సంస్థలను ఉపయోగించుకుని వాటి ద్వారా తప్పుడు మార్గాల్లో నిధులు సమకూర్చుకుంటున్నాయి.

ఉగ్రవాదులకు అక్రమ మార్గాల్లో నిధులపై కెనడా ప్రభుత్వం ప్రచురించిన సరికొత్త నివేదిక ఈ విషయం వెల్లడించింది.''అక్రమ మార్గాల్లో ధనం తరలింపు, కెనడాలో ఉగ్రవాదులకు పెట్టుబడుల మద్దతు ప్రమాదం–2025'' అనే పేరుతో అక్కడి ప్రభుత్వం ఈ నివేదిక విడుదల చేసింది. కెనడాలో ఉన్న బబ్బర్‌ఖల్సా ఇంటర్నేషనల్ అండ్ ద ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్ నుండి ఈ నిధులు అందుతున్నట్లు గుర్తించారు. రాజకీయ ప్రయోజనాలతో కూడిన హింసాత్మక ఉగ్రవాదం (పిఎంవిఇ) కేటగిరీ కింద 1980వ దశకం రెండో అర్థభాగం నుండీ కెనడాలో ఖలిస్థానీల పేరుతో ఈ ఉద్యమం ప్రారంభమైందని కెనడా ఇంటిలిజన్స్ ఏజన్సీ ప్రకటించిన రెండు నెలలకు ఈ కొత్త నివేదిక వెలువడింది. భారతదేశం పంజాబ్ రాష్ట్రంలో ఖలిస్థాన్ పేరుతో ఒక స్వతంత్ర రాజ్యస్థాపనకు ఉగ్రవాద మార్గాల ద్వారా ప్రయత్నాలు చేయాలనే ఉద్దేశంతో ఈ ఉద్యమం కెనడాలో నలభై సంవత్సరాలక్రితం ప్రారంభమైందని ఆ దేశ ఇంటిలిజెన్స్ విభాగం ప్రకటించింది. ఒక కొత్త రాజకీయ వ్యవస్థను ఏర్పాటు చేయడం కోసం ప్రస్తుతం ఉన్న వ్యవస్థలోనే అంతర్గతంగా హింసను ఆయుధంగా ఉపయోగించే కొత్త వ్యవస్థను, కొత్త నిబంధలను ఉపయోగిస్తున్నారని నివేదిక తెలియజేసింది. ఈ పిఎంవిఇ విధానంలో మతపరమైన శక్తులతోపాటు స్వయంప్రతిపత్తి సాధించడంకోసం ప్రధానంగా దృష్టిపెట్టిన కారకశక్తులు ప్రధానపాత్ర పోషిస్తూ ఉండి ఉంటారని నివేదిక పేర్కొంది. జాతి, వర్ణపరమైన ఆధిపత్యంకంటే రాజకీయ స్వయంనిర్ణయాధికార ప్రయోజనాలే ఇందులో ఇమిడి ఉండి ఉంటాయని పేర్కొంది. ఈ పిఎంవిఇ కేటగిరీలో కెనడా క్రిమినల్ కోడ్ కింద జాబితాలో అనేక ఉగ్రవాద సంస్థలపేర్లు ఉన్నాయి. హమాస్, హిజ్బుల్లా, ఖలిస్థానీ వంటి హింసాత్మక గ్రూపులు, బబ్బర్‌ఖల్సా ఇంటర్నేషనల్, ద ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్ వంటి సంస్థలు అనేకం ఉన్నట్లు కెనడా ప్రభుత్వ గూఢచారి, పోలీసు వ్యవస్థలు గుర్తించాయి. ఆర్థిక లావాదేవీలు, కెనడా విశ్లేషణ కేంద్రం 2022లో హిజ్బుల్లాను రెండవ అతిపెద్ద అంతర్జాతీయ ఉగ్రవాద కార్యకలాపాల సంస్థగా గుర్తించింది. కెనడాదేశంలో నిధులు ఇతర ప్రయోజనాలకు వెళుతున్నాయని పేర్కొంది.

# ఇద్దరు బందీల వీడియో విడుదల చేసిన హమాస్

**గాజా:** ఇద్దరు ఇజ్రాయెలీ బందీల వీడియోను హమాస్ విడుదల చేసింది. తాము హత్యకు గురయ్యే ప్రమాదం ఉందని వారు ఆ వీడియోలో ఆందోళన వ్యక్తం చేశారు. గిల్‌బోయా దలాల్, అలోన్ ఓహెల్ అనే ఇద్దరు యువకులు కూడా 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఉగ్రవాదులు కిడ్నాప్ చేసినవారిలో ఉన్నారు. యుద్ధం ప్రారంభమైన 22 నెలల తర్వాత కూడా తాము ఇంజా సజీవంగా ఉన్నామంటే నమ్మలేకపోతున్నామని, ఇది కలలా ఉందని, కానీ తమను ఇప్పటికీ హత్య చేసేందుకు చాలా అకాశం ఉందని, తమను హత్యచేస్తారని భయపడుతున్నట్లు గిల్‌బోయా దలాల్ ఆ వీడియోలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. అలోన్ ఓహెల్ కూడా వీడియోలో మాట్లాడుతూ, తన కుకన్ను కనిపించడం లేదని, అంధకారంలో ఉన్నాననీ ఆవేదన వ్యక్తం చేశాడు. అలోన్ దుర్భరమైన పరిస్థితిని చూసి తీవ్రంగా కలవరపడిన అతడి కుటుంబీకులు వీడియో చూపించి వైద్యుణ్ణి సంప్రదించారు. అతడు చెప్పిన ప్రకారం కన్ను పోయినట్టుగానే ఉందని వైద్యుడు కూడా ధృవీకరించాడు. అలోన్ ఓహెల్ కళ్ళు రెప్పలు తరచు టప టపా కొట్టుకుంటున్నాయి. బందీలు, గల్లంతైన ఇజ్రాయెలీ బాధిత కుటుంబాల వేదిక ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఐతే వారున్న దుస్థితికి సంబంధించి హమాస్ విడుదల చేసిన వీడియోనుగానీ, ఆ చిత్రాలను గానీ బయట మీడియాకు విడుదల చేయవద్దని కూడా బందీలిద్దరూ విజ్ఞప్తి చేశారు. తాము గాజా సిటీలోనే ఉన్నట్లు పేర్కొన్నారు. గాజాసిటీలో ఇజ్రాయెల్ దాడులు ఉధృతంగా కొనసాగుతున్న తరుణంలో తమను చంపుతారని వారు భయం వ్యక్తం చేశారు. హమాస్ మార్గదర్శకత్వంలోనే ఇదంతా జరిగిందని భావిస్తున్నారు. 22 నెలల క్రితం ఇజ్రాయెల్‌లో జరుగుతున్న సంగీతోత్సవంపై హమాస్ ఉగ్రవాదులు దాడి చేసి 1200 మంది కాల్చి చంపి మరో 249 మందిని బందీలుగా తీసుకువెళ్ళారు.



**బతికున్న 20 మందిలో కొందరు మరణించారు: ట్రంప్**

మరోవైపు ట్రంప్ ఓవల్ ఆఫీసులో శనివారం పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ, హమాస్‌తో తాము చాలా లోతైన చర్చల్లో మునిగి ఉన్నామన్నారు. బందీలను గనుక ఇజ్రాయెల్‌కు అప్పగించకపోతే పరిస్థితి చాలా తీవ్రంగా మారుతుందని, కఠిన చర్యలుంటాయన్నారు. ఎంతో అందమైన యువతీయువకులు హమాస్ చెరలో మరణిస్తున్నారన్నారు. గాజాలో 20 మంది బందీలు సజీవులుగా ఉన్నారని, వీరిలో ఈమధ్య కొందరు మరణించారని చెప్పారు. దాదాపు 50 మంది బందీలు గాజాలో ఉన్నారని, వీరిలా సగంమంది మరణించి ఉంటారని ఇజ్రాయెల్ భావిస్తున్నది. హమాస్ ఉగ్రవాదులకు, అమెరికా ప్రభుత్వానికి మధ్యవర్తిగా ఉండి సంప్రదింపులు చేస్తున్న పాలస్తినాకు చెందిన అమెరికా రాజకీయ కార్యకర్త భాహ్‌బాహ్ గడచిన బుధవారం సాదీ అరేబియా వార్తాసంస్థ అల్–అరేబియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, యుద్ధం ముగించి, బందీలందరినీ విడుదల చేయడానికి అమెరికా చేసిన సమగ్ర ఒప్పంద ప్రతిపాదన తుది ప్రతి చర్చల బల్లదగ్గర దగ్గర సిద్ధంగా ఉందని చెప్పారు. హమాస్ కూడా వెంటనే స్పందిస్తూ దీనికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పింది. దీనిపై ఇజ్రాయెల్ బందీలు, గల్లంతైన కుటుంబీకుల వేదిక కూడా స్పందిస్తూ ట్రంప్‌కు కృతజ్ఞతలు చెప్పింది.

**గాజాసిటీ ప్రజలకు ఐడిఎఫ్ అర్జంట్ వార్నింగ్**

గాజా సిటీలో దాడులను మరింత ఉద్ధృతం చేస్తామని ఇజ్రాయెల్ సైనిక దళం (ఐడిఎఫ్) ప్రతిజ్ఞ చేసింది. ప్రజలు నగరం వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోవాలని శనివారం అడిషనల్ అర్జంట్ వార్నింగ్ జారీ చేసింది. శుక్రవారంనాడే గాజా సిటీలో అతి ఎత్తైన భవంతులపై దాడులు చేసి వాటిని నేలమట్టం చేసిన ఐడిఎఫ్ శనివారం దాడులు మరింత ఉద్ధృతం చేసింది. యుద్ధ కార్యకలాపాల నిమిత్తం హమాస్ ఇంటిలిజన్స్ కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్న హైరైజ్ భవంతులపై తాజా దాడులుచేసి నేలమట్టం చేసినట్లు ఐడిఎఫ్ పేర్కొంది. ఇజ్రాయెల్ సైన్యం కదలికలను కనిపెట్టేందుకు హైరైజ్ భవంతులలో గస్తీ,నిఘా కేంద్రాలను, సంబంధిత సామాగ్రిని హమాస్ ఏర్పాటు చేసుకుందని, ఈ భవంతులను నేలమట్టం చేశామని ఐడిఎఫ్ ప్రకటించింది. ప్రజలకు ఎక్కువ నష్టం చేయదలచుకోలేదని, ప్రజలు నగరం వదిలివెళ్ళిపోవాలని ఐడిఎఫ్ కోరింది.

23 నెలలుగా గాజాలో ఐడిఎఫ్ చేస్తున్న యుద్ధంలో 64,000 మంది పాలస్తినా ప్రజలు మరణించారు. లక్షలాది మంది గాయపడ్డారు. 42,000 మంది పిల్లలు అనాథలయ్యారు. గడచిన మే నెల నుండి ఇప్పటివరకూ వరకూ ఆహార కేంద్రాల వద్ద ఆహారంకోసం ఎదురుచూస్తున్న 2,356 మంది ప్రజలు కాల్పుల్లో మరణించారు.

## లెబనాన్ మంత్రివర్గం నిరాయుధీకరణ
### ప్రణాళికకు హిజ్బుల్లా సుముఖత

**సనా:** హిజ్బుల్లా తిరుగుబాటుదారులను దశలవారీగా నిరాయుధులను చేసేందుకు ఉద్దేశించిన ఒక ప్రణాళికకు లెబనాన్ మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. దీనిని హిజ్బుల్లా కూడా స్వాగతించింది. అంతర్యుద్ధం ద్వారా మూడోదేశం ఆధిపత్యంలోకి వెళ్ళేకంటే దేశంలో ఆయుధాలను వదిలిపెట్టడం విజ్ఞత, వివేకాలతో కూడిన విషయమని ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి హిజ్బుల్లా ప్రకటించింది. హిజ్బుల్లా తిరుగుబాటుదారులు ఆయుధాలు వదలిపెట్టేందుకు ఎలాంటి కాలపరిమితినీ మంత్రివర్గం విధించకుండా శుక్రవారం తీర్మానం చేసింది. లెబనాన్ మిలిటరీ ఈ ప్రణాళిక



రూపొందించింది. హిజ్బుల్లాకు వ్యతిరేకంగా లెబనాన్‌లో అదేపనిగా సరిహద్దుల నుండి ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేస్తూ ఉండటం దేశ అవృద్ధికి, దేశ సైన్యం ప్రగతికి పెద్ద ఆటంకంగా ఉందని శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశం పేర్కొంది. ఆయుధాలు వదిలిపెట్టేందుకు తొలుత హిజ్బుల్లా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఇప్పటికీ హిజ్బుల్లాలో చాలా మంది ఆయుధాలు పూర్తిగా వదులుకోవడానికి సిద్దంగా లేరు.

## సమస్యలకు సైనిక చర్య పరిష్కారం కాదు
### ట్రంప్‌కు వెనిజులా హితవు

**కారకస్:** సమస్యలకు సైనిక చర్య పరిష్కారం కాబోదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు వెనిజులా హెచ్చరించింది. కరీబియన్ ప్రాంతంలో ఈ రెండు దేశాలమధ్యా రోజు రోజుకూ ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో చర్చలకు వెనిజులా సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆ దేశాధ్యక్షుడు నికొలస్ మదురో శనివారం ఒక ప్రకటన చేస్తూ, చర్చలద్వారా సమస్యను అర్థం చేసుకుందామని రేడియో సందేశం ద్వారా తెలియజేశారు. వెనిజులా మాదకద్రవ్యాలను రవాణా చేస్తోందని, ఈ ముఠాలకు ప్రోత్సాహం ఇస్తోందని ఆరోపణలు చేసిన ట్రంప్ కరీబియన్ ప్రాంతంలో వెనిజులా చుట్టూ యుద్ధనౌకలను, క్షిపణి ప్రయోగ నౌకలను మోహరించారు. క్రమంగా వీటిసంఖ్య మరింతగా పెంచుతూ ఉండటంతో వెనిజులా–అమెరికా మధ్య కొద్దిరోజులుగా ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. వెనిజులా అధ్యక్షుడు మదురో ఒక ప్రకటన చేస్తూ, తాము డ్రగ్స్ ముఠాలను అదుపు చేస్తున్నామని, ఇటీవల భారీగా డ్రగ్స్ కూడా స్వాధీనం చేసుకుని, నిఘా చర్యలకు భారీగా సిబ్బందిని మోహరించామని చెప్పారు. ఐనప్పటికీ అమెరికా వెనిజులాపై డ్రగ్స్ ముద్ర వేస్తోందని విమర్శించారు. బెదిరింపులు చేస్తే అమెరికాకు లొంగిపోయేదిలేదని, ప్రతిఘటిస్తామని మదురో హెచ్చరిక చేశారు. దీంతో ట్రంప్ రెచ్చిపోయి అమెరికాను బెదిరించేందుకు మదురో ఎలాంటి ప్రయత్నాలు చేసినా వారి యుద్ధ విమానాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని ప్రకటన చేశారు. ఈ పరిస్థితుల్లో ఉద్రిక్తతలను సడలించి శాంతిమార్గంలో వెళ్ళేందుకు ట్రంప్‌తో మదురో చర్చలకు ప్రతిపాదన చేశారు.



## స్నేహంగానే ఉంటా
(మొదటి పేజీ తరువాయి)

స్నేహంగానే ఉంటా, ఆయన గొప్ప ప్రధానమంత్రి, ఆయన గొప్ప నాయకుడు, మేం ఇద్దరం ఎప్పటికీ స్నేహితులమే, కానీ ఆ ముఖ్యమైన సందర్భంలో ఆయన అలా చేయడం నాకు నచ్చలేదంతే'' అన్నారు. ''కానీ భారత్–అమెరికా మధ్య ప్రత్యేక సంబంధం ఉంది, ఈ బంధం గురించి ఆందోళన చెందాల్సిన అవసరంలేదు, ఒక సందర్భంలో అలాంటి క్షణాలొస్తాయి'' అని నవ్వుమొహంతో చెప్పారు. ''గడచిన రెండు దశాబ్దాలుగా దారుణదశలో కొనసాగుతున్న రెండుదేశాల సంబంధాలను చక్కదిద్దేందుకు మీరు సిద్ధంగా ఉన్నారా?'' అని ప్రశ్నించినప్పుడు ట్రంప్ పైవిధంగా చెప్పారు. ఐతే మళ్ళీ రష్యా ప్రస్తావన తీసుకురావడం మాత్రం ఆయన మానలేదు. ''రష్యా నుండి అంత భారీ పరిమాణంలో చమురు కొనుగోలు చేయడం నాకు చాలా చాలా అసంతృప్తిగా ఉంది'' అన్నారు.

''రష్యా నుండి భారీ పరిమాణంలో చమురు కొనుగోలు చేయడం నాకు చాలా అసంతృప్తిగా ఉంది, ఆ విషయం వారు తెలుసుకోవాలని చెబుతున్నా, భారత్‌పై మేం చాలా భారీగా 50 శాతం మేరకు సుంకాలు విధించాం, చాలా భారీ సుంకాలవి, నేను మోదీతో చాలా బాగా కలిసిపోతాను, మోదీ గొప్ప నాయకుడు, ఆయన రెండు నెలలక్రితం అమెరికా వచ్చారు'' అన్నారు. భారత్, రష్యాలను తాము చైనాకు కోల్పోయామంటూ శుక్రవారం సోషల్ మీడియాలో చేసిన పోస్టింగ్‌పై పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ట్రంప్ పైవిధంగా జవాబిచ్చారు.

''చూస్తుంటే భారత్–రష్యాలను మేం చైనాకు కోల్పోయినట్లనిపిస్తోంది, వారితో మాకు చాలా సంపద్వంతమైన సుదీర్ఘమైన భవిష్యత్తు ఉండవచ్చుకదా'' అని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ఎస్‌సిఓ సదస్సు తర్వాత ట్రంప్ తొలుత ఆలోచనాత్మకంగా స్పందించారు. మోదీ,పుతిన్,జిన్‌పింగ్‌లు కలిసి ఉన్న పాత ఫోటోను కూడా ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇదిలా ఉండగా, ట్రంప్ యంత్రాంగంలో వాణిజ్య,తయారీరంగ సీనియర్ కౌన్సిలర్ పీటర్ నవర్రో ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, అమెరికా నుండి భారత్‌కు వచ్చే దిగుమతులపై చాలా భారీ సుంకాలను భారత్ విధిస్తోందని పేర్కొన్నారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోలు చేసి శుద్ధిచేసి ఇతర దేశాలకు విక్రయిస్తోందని, దాంతో రష్యాకు చాలా లాభం కలుగుతోందని, ఆ ధనంతో ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగిస్తోందని నవర్రో విమర్శించారు. ఈ విషయాలే ట్రంప్‌ను ఆందోళనకు గురిచేశాయన్నారు.

## యూనిట్ గుట్టు రట్టు
(మొదటి పేజీ తరువాయి)

మహారాష్ట్ర పోలీసులు గుర్తించారు. కొద్ది రోజుల క్రితం మహారాష్ట్ర పోలీసులకు చిక్కిన బంగ్లాదేశ్‌కు చెందిన ఓ విదేశీ మహిళా నిందితుడిచ్చిన సమాచారంతో తెలంగాణా రాష్ట్రం మేడ్చల్ జిల్లాకు చేరుకొని డ్రగ్స్ తయారీ ముఠాను అరెస్టు చేసారు. ఇక్కడ తయారు అవుతున్న డ్రగ్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొన్నడిస్ట్రిబ్యూటర్లతో ఏర్పాటు చేసుకొన్న భారీ నెట్‌వర్క్‌తో దేశ విదేశాలకు గుట్టు చప్పుడు కాకుండా కెమికల్స్ పేరిట డ్రగ్స్ తయారు చేసి వివిధ దేశాలకు సరఫరా చేస్తున్నారు. దీనిపై స్థానిక పోలీసులు సైతం దర్యాప్తు చేస్తున్నారు.నిందితులను మహారాష్ట్ర పోలీసులు ముంబయికి తరలిస్తున్నారు.

**బంగ్లాదేశ్ మహిళా నిందితులి సమాచారంతోనే**

మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని మీరారోడ్ పోలీసులు గత నెలలో విశ్వసనీయ సమాచారంతో బంగ్లాదేశ్‌కు చెందిన ఫాతిమా మురాద్ షేక్ అలియాస్ మొల్లా అనే 23 ఏళ్ల మహిళను అరెస్టు చేసి రూ. 24 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనపరచుకొన్నారు. తదుపరి విచారణలో డ్రగ్స్ తెలంగాణా రాష్ట్రం రాజధానిలోని మేడ్చల్ జిల్లా చర్లపల్లి ప్రాంతంలోని పారిశ్రామిక ప్రాంతంలో కెమికల్స్ ఫాక్టరీలో ఈ డ్రగ్స్ తయారీ అవుతున్నాయన్న విషయాన్ని నిందితురాలి నుండి తెలుసుకొన్నారు. ఈ మేరకు మహారాష్ట్రకు చెంది వాసాయి విరార్ పోలీసులు, క్రైం బృందానికి చెందిన మీరా భయాందర్ నేతృత్వంలో నిందితురాలిని వెంట తీసుకొని తయారీ కేంద్రమైన కెమికల్స్ ఫాక్టరీకి శనివారం చేరుకొని నిర్వహించిన దాడిలో 32 వేలలీటర్ల డ్రగ్స్ ముడిసరుకు స్వాధీనం చేసుకొని 13 మందిని అరెస్టు చేసారు.

# ట్రైనీ ఐపిఎస్‌లతో కొత్వాల్ ముఖాముఖి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 170 మంది ఐపిఎస్ అధికారులు బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసి భవనాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సి.వి. ఆనంద్‌తో ముఖాముఖిగా మాట్లాడారు. సివి ఆనంద్ తాను విధులు నిర్వహించిన తన అనుభవాన్ని వారితో పంచుకున్నారు. గణేష్ ఉత్సవాల బందోబస్తు నిర్వహించడం 13వ సారి అని, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నాలుగో సారి అని తెలిపారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంత సున్నితమైన, విస్తారమైన నగరాల్లో ఒకటని, ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారని, అందుకే పండుగల నిర్వహణ చాలా ముఖ్యమని కమిషనర్ వివరించారు. గణేష్ ఉత్సవాలకు పోలీసులు బందోబస్తు ఎలా నిర్వహిస్తారో వివరిస్తూ, ఈ ఏడాది నిమజ్జనం కోసం చివరి రోజున సుమారు 25,000 విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇంత భారీ స్థాయిలో జరిగే ఈ ఉత్సవానికి ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా భద్రత కల్పించడం చాలా ముఖ్యమని చెప్పారు. గణేష్ ఉత్సవం, మిలాద్ ఉన్ నబీ, బోనాలు, దసరా నవరాత్రులు, హనుమాన్ ర్యాలీ, శ్రీరామనవమి ర్యాలీ వంటి పండుగల సందర్భంగా తొక్కిసలాటలు జరగకుండా హైదరాబాద్ పోలీసులు తీసుకుంటున్న కార్యాచరణ ప్రణాళిక, సన్నాహాలు , వ్యూహాలు ఇతర చర్యల గురించి ఒక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆన్‌లైన్ అనుమతి ఫారాలు, విగ్రహాలకు జియోట్యాగింగ్, డ్రోన్‌లు, యాప్‌లు, సీసీటీవీల వాడకం, అలాగే మల్టీఏజెన్సీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వంటి సాంకేతికతను పోలీసులు ఎలా వినియోగిస్తున్నారో కూడా కమిషనర్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐపిఎస్ అధికారులు రామ్ నివాస్ సేపట్, కల్మేశ్వర్ సింగేన్వార్, ఐటి సెల్ డిసిపి పుష్పలు పాల్గొన్నారు.







## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గంపా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 100 మందికి పైగా ప్రముఖ ఉపాధ్యాయులు సమాజ భవిష్యత్తు రూపకల్పనలో వారి విశిష్ట సేవలకు గాను సన్మానించబడ్డారు. ఈ సందర్భంగా ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, సెకండ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ఎన్నికైన కొత్త నాయకులను అభినందించారు. లయన్ అశోక్ కుమార్ స్త్రవన్ సెకండ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా 90% ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. అనంతరం, లయన్స్ ఇంటర్నేషనల్ నిర్ణయం ప్రకారం, ఆయనను ఏకగ్రీవంగా ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా ప్రమోట్ చేశారు. గత ఇరువై సంవత్సరాలుగా లయనిజం పట్ల ఆయన కృషి, సమాజ సేవా భావం సభ్యులందరి, డిస్ట్రిక్ట్ నాయకుల మరియు మల్టిపుల్ నాయకుల నుండి ప్రశంసలు పొందింది.

## దేశ, సమాజ మార్పు కోసం కృషి చేసే మహనీయులను గుర్తుంచుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతి ఒక్కరూ దేశ సమాజ మార్పు కోసం తమ వంతు కృషి చేస్తున్న మహనీయులను గుర్తుంచుకోవాలని పలువురు వక్తలు అన్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో పలువురు గురువులకు 'శిఖరం ఆర్ట్స్' అవార్డులను శనివారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత కోటి రెడ్డి,సిఎస్‌సిసి కోర్టు హైదరాబాద్ సీనియర్ సూపర్‌డెంట్ పివిసి అంజనీ కుమారి, శిఖరం ఆర్ట్స్ అధినేత కృష్ణ, లంక లక్ష్మీ నారాయణ, కోటిరెడ్డి,టి చక్రపాణి, దామోదరం నాగేందర్, ప్రొఫెసర్ సత్యనారాయణ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కోదాటి అరుణ ,వావ్ మ్యాజిక్ అధినేత పి.వి లక్ష్మీ , ప్రముఖ రచయిత, విశ్లేషకురాలు కోదాటి అరుణ, కూచిపూడి గురువు రాగ రంజని, కూచిపూడి నాట్య గురువు సాయి, అరికెపూడి రఘు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తారని, ఇందులో వారు తమ కుటుంబాన్ని కూడా పక్కన పెడుతారని తెలిపారు.



## ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నా
(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర సాధనలో, అభివృద్ధిలో తాను చూపిన నిబద్ధత, పాత్ర అందరికీ తెలుసని హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం యూరియా లేక రైతులు గోస పడుతున్నారని, వరద ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం అండగా ఉండాలని డిమాండ్ చేశారు. కాగా ఇటీవల బిఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల కవిత సస్పెండ్‌కు గురైన తర్వాత బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు మొదటి సారి బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతో ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో శనివారం సమావేశమయ్యారు.

అమెరికా పర్యాటన ముగించుకుని వచ్చిన హరీశ్ రావు తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో కెసిఆర్‌తో సమావేశమవ్వడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావుతో పాటు పలువురు ముఖ్య నేతలు ఉన్నట్టు తెలిసింది. ఈ సమవేశంలో ఇటీవల కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యాలు,'కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకల విషయంలో ప్రభుత్వం సిబిఐకి కేసు అప్పగించడం, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు తదితర అంశాలు వారి మధ్యచర్చకు వచ్చినట్టు సమాచారం. ముఖ్యంగా కవిత చేస్తున్న వ్యాఖ్యలపైన బిఆర్ఎస్ తరపున ఎలా స్పందించాలనే విషయమై కూడా చర్చించినట్టు సమాచారం. అయితే ఎక్కువ సమయం 'కాళేశ్వరం ప్రాజెక్ట్, సిబిఐ కోర్ట్, న్యాయపరమైన అంశాల'పైనే చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఇటీవల శాసనసభలో కాళేశ్వరం నివేదికపై జరిగిన చర్చ, ప్రభుత్వం, బిఆర్ఎస్ తరపున వినిపించిన వాదనలు, ఆ తర్వాత జరిగిన పరిణామాలను కూడా సమీక్షించినట్టు సమాచారం.

కాగా తెలంగాణ భవన్ కేంద్రంగా జరిగే పార్టీలో చేరికలు, తదితర సమావేశాలు గత కొంత కాలంగా ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రానికి వేదికగా మారినట్టు తెలుస్తోంది. ఈ మధ్య జరిగిన పలు చేరికలు కూడా ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలోనే జరగడం బిఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయంశంగా మారింది.

## స్పందన శ్లాఘనీయం
(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యం భారత్–అమెరికా మధ్య ఉంది'' అని మోదీ పోస్టింగ్ చేశారు. ఈ ఏడాది జూన్ 17వ తేదీన ఫోన్ సంభాషణ తర్వాత మళ్ళీ మొదటిసారి ఈ నాయకులిద్దరూ ఈ విధంగా అభిప్రాయాలు పంచుకున్నారు. సరుకు దిగుమతులపై 25 శాతం అదనపు సుంకాలతోపాటు రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నదనే సాకుతో మరో 25 శాతం పెనాల్టీ భారత్‌పై ట్రంప్ విధించాక సంబంధాలు క్షీణదశకు చేరుకుంటున్న దశలో ఎస్‌సిఓ సదస్సులో ఆసియా అగ్రనేతల సమ్మేళనం తర్వాత ట్రంప్ దిద్దుబాటు ప్రయత్నాలను మోదీ ఆహ్వానించారు.

''మోదీతో తానెప్పుడూ స్నేహంగానే ఉంటానని వైట్‌హౌస్‌లో శనివారం పాత్రికేయులకు ట్రంప్ చెప్పిన గంటల వ్యవధిలోనే సోషల్ మీడియా వేదికగామోదీ స్పందించారు. ఐతే, ముఖ్యమైన సందర్భంలో భారత నాయకుడు అలా ప్రవర్తించడం నాకు నచ్చలేదంతే'' అని ట్రంప్ చెప్పారుతప్ప జగద్విదితమైన ఆ ముఖ్యమైన సందర్భం ఏమిటో ఆయన పాత్రికేయులకు వివరించి చెప్పలేదు.

## చమురు దిగుమతులు నిలిపివేత
(మొదటి పేజీ తరువాయి)

సదస్సు, చైనా 80వ యుద్ధ విజయవార్షికోత్సవలలో ఆసియా నాయకుల సమ్మేళనం తర్వాత ట్రంప్‌లో ఆందోళన ఆగ్రహం పెల్లుబుకుతూ ఉండటంతో ప్రతీకారచర్యలు ఉద్ధృతమయ్యాయి. ఐతే హంగేరీ ప్రతిరోజూ రెండు లక్షల బ్యారెల్స్, స్లోవేకియా రెండున్నర లక్షల బ్యారెల్స్ రష్యా చమురును ఇప్పటికీ దిగుమతి చేసుకుంటూ ఆ దేశంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. జోర్గెన్‌సన్ నిర్ణయాన్ని ఈ రెండు దేశాలూ వ్యతిరేకిస్తున్నాయి.

**ఉక్రేన్‌లో సేనల మోహరింపుపై రష్యా నిరసన**

ఉక్రేన్‌లో 26 దేశాల సేనలను మోహరించేందుకు యూరోపియన్ యూనియన్ సంసిద్ధం కావడం, ఉక్రేన్‌కు సెక్యూరిటీ గ్యారంటీల విషయాన్ని పరిశీలిస్తానని ట్రంప్ చెప్పడాన్ని రష్యా వ్యతిరేకించింది. యుద్ధానంతర చర్యలుగా ఉక్రేన్‌లో సేనవ మోహరింపు తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. యుద్ధం విరమించిన మరుక్షణమే సెక్యూరిటీ గ్యారంటీ అమలులోకి వచ్చి 26 దేశాల సేనలు అక్కడకు వెళతాయి. త్రివిధ దళాలకు సాయం అందించి రక్షణగా ఉంటాయి. పారిస్ సమావేశంలో ఈ నిర్ణయం జరిగింది.

**పుతిన్ ఆహ్వానాన్ని తిరస్కరించిన జెలెన్‌స్కీ**

కీవ్: సంప్రదింపులు చేయడానికి మాస్కో రావాల్సిందిగా రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇచ్చిన ఆహ్వానాన్ని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తిరస్కరించారు. పశ్చిమ ఉక్రేన్‌లో ఇటీవల రష్యా దాడుల్లో ధ్వంసమైన అమెరికా కర్మాగారాన్ని సందర్శించిన జెలెన్‌స్కీ అక్కడే ఎబిసి వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ, రోజువారీ ప్రాతిపదికపై రష్యా తమదేశంపై క్షిపణిదాడులు చేస్తుంటే ఆ టెర్రరిస్టు దేశానికి చర్చలకోసం తాను వెళ్ళేదిలేదని, ఆయనే తమ రాజధాని కీవ్‌కు రావాలని అన్నారు.

రష్యాకు లొంగిపోయేందుకు మాస్కోకు రావాలని తాము పిలవడంలేదని, సంప్రదింపులకోసమే పిలుస్తున్నామని, అంతకుముందు పుతిన్ అన్నారు. చర్చలకు తమదేశం వ్యతిరేకం కాదన్నారు. జెలెన్‌స్కీ సిద్ధంగా ఉంటే మాస్కోకు రావాలని కోరారు. వెంటనే యుద్ధ పరిష్కారం జరుగుతుందని తాను ఆశించడంలేదని, ఐతే సమస్య పరిష్కారానికి తమ కృషి కొనసాగుతుందన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సిబిఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు అస్వస్థత

నేటి అధికారిక కార్యక్రమాలపై నెలకొన్న అనిశ్చితి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) డైరెక్టర్ ప్రవీణ్ సూద్ శనివారం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కీలకమైన అధికారిక పర్యటన నిమిత్తం నగరానికి వచ్చిన ఆయన, శ్రీశైలం పర్యటన ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, ప్రవీణ్ సూద్ శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. కోఠిలోని సిబిఐ కార్యాలయంలో అధికారిక సమావేశంలో పాల్గొన్న తరువాత ఆయన శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. సిబిఐ అధికారులతో సమీక్షా సమావేశంతో పాటు, కీలకమైన కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల దర్యాప్తు పురోగతిపై కూడా ఒక ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాల్సి ఉన్నట్లు సమాచారం. అయితే, శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో ఆయనకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో, వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆసుపత్రిలో చేరడంతో, నేడు జరగాల్సిన అధికారిక సమావేశాలపై అనిశ్చితి నెలకొంది.

# గేమ్ ఛేంజర్‌గా దేవరపల్లి రహదారి

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి భవిష్యత్తులో తెలంగాణ దక్షిణ భారతదేశానికి గేమ్ ఛేంజర్‌గా మారబోతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ధంసలాపురం వద్ద ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనిఖీ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే ఆర్ వోబి, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పరిశీలించారు. అధికారులకు, ఏజెన్సీలకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. 160 కిలో మీటర్ల జాతీయ రహదారి పూర్తయితే గంటన్నర సమయంలో రాజమండ్రి వెళ్లవచ్చునన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ఇక్కడి వారికి ఈ రోడ్డు ఉపయోగపడుతుందన్నారు. ఉత్తర దక్షిణ భారతదేశాన్ని కలిపే రహదారిగా తయారవుతుందన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి డిజైన్స్ ఆలస్యం కావడం వల్ల పనులు ఆలస్యం జరిగిందన్నారు. ధంసలాపురం ఆర్‌వోబి నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఆర్‌వోబి నిర్మాణానికి సంబంధించి హైటెన్షన్ విద్యుత్ లైన్స్ తరలింపు, భూ సేకరణ వంటి అన్ని పనులు పూర్తి చేశామని నవంబర్ నాటికి ఒక వైపు రైల్వే బ్రిడ్జి పూర్తి చేసుకుంటే సత్తుపల్లి, జంగారెడ్డి గూడెం వరకు ఉపయోగపడుతుందన్నారు. కొత్త సంవత్సరంలో ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రావాలన్నారు. రైల్వే, కెనాల్, మున్నేరుపై రహదారి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం నుంచి సత్తుపల్లి వరకు జాతీయ రహదారికి సర్వీస్ రోడ్లు వేస్తే రైతాంగానికి ఉపయోగపడుతుందని దీనికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా వ్యవసాయ ప్రాంతం అధికంగా ఉందని, నాగార్జున సాగర్ కాలువ క్రింద ఆయకట్టు ఉన్నందున 365 రోజుల పాటు హార్వెస్టర్ రాకపోకలు ఉంటాయని వాహనాలకు ఆటంకం కలుగకుండా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. వర్షాలు తగ్గిన నేపథ్యంలో మున్నేరు బ్రిడ్జితో పాటు ధంసలాపురం ఎగ్జిట్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రూ.3,500 కోట్లతో ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారిని నిర్మిస్తున్నామన్నారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి చిన్న చిన్న సమస్యలు ఉంటే కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, నేషనల్ హైవే పిడి దివ్య, ఆర్అండ్‌బి ఎస్‌ఈ యాకోబ్, ఆర్డీవో జి.నర్సింహారావు, తహసీల్దార్ సైదులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధే ధ్యేయం

రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/వరంగల్:** రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం మంత్రి కొండా సురేఖ వరంగల్ (తూర్పు) నియోజకవర్గంలోని ఆరు దేవాలయాలకు రూ.4.35 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేశాయిపేటలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో స్వామి వారి జన్మదినం సందర్భంగా కోటి దీపాలను వెలిగించే కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొని ఒత్తులు వెలిగించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మట్టెవాడ భోగేశ్వర స్వామి దేవాలయం, దేశాయిపేట రంగనాయక స్వామి దేవాలయం, కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గోవిందరాజుల గుట్ట వద్ద ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణం, కాశీ విశ్వేశ్వర రంగనాయక స్వామి దేవాలయం కాశిబుగ్గ, అబ్బని కుంటలోని మహేశ్వరి దేవాలయాల అభివృద్ధి నవీకరణ పనులకు శనివారం శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ప్రతి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని, అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు సౌకర్యార్థంగా ఉండే విధంగా ప్రణాళికబద్ధంగా ఆలయాల్లో నిర్మాణాలు చేపట్టాలని, ఆలయాలకు రంగులు వేసి కొత్తదనాన్ని తీసుకోరావాలనిసూచించారు. తూర్పు నియోజకవర్గానికి 18 దేవాలయాల అభివృద్ధి పనులకు మంజూరు చేశామని, అందులో భాగంగా నేడు ఆరు దేవాలయాల అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. మిగిలిన దేవాలయాల అభివృద్ధి పనులను త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. దశలవారీగా అన్ని ఆలయాల అభివృద్ధి, నవీకరణ, పునరుద్ధరణ చేయడతామని తెలిపారు. కాకతీయుల కాలం నాటి చారిత్రాత్మక దేవాలయాలు వరంగల్‌లో అధికంగా ఉన్నందున వాటిని పునరుద్ధరణ చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పురావస్తు శాఖ వారి అనుమతి మంజూరైన తదుపరి ఆయా దేవాలయం అభివృద్ధి చేస్తామని, దేవదాయ శాఖకు సంబంధించిన అన్ని దేవాలయాలకు, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రిగా తాను నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు రామ తేజస్వి, శిరీష్, కావేటి కవిత, చింతాకుల అనిల్ కుమార్, ఓని స్వర్ణలత, భాస్కర్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, ఎండోమెంట్ అధికారి సునీత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తొలగించిన 43 మంది జెఎంఇటిలు తిరిగి విధుల్లోకి

పునర్‌నియామక ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి సంస్థ

ఫలించిన 'సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రయత్నం

క్రమ శిక్షణతో పని చేయండి : సిఎండి ఎన్.బలరామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ కారణాలతో తొలగించిన 'ది సింగరేణి సంస్థ'లో పని చేస్తున్న జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీలను (జెఎంఇటి) తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు సింగరేణి సంస్థలోని గుర్తింపు పొందిన 'సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్'(ఎఐటియుసి) చేసిన ప్రయత్నాలు సఫలమయ్యా యి. తద్వారా టర్మినేట్ చేసిన 43 మంది జెఎంఇటిలను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు సింగరేణి యాజమా న్యం అంగీకరించింది. ఈ మేరకు సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండి ఎన్.బలరామ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గైర్హాజరుకు సంబంధించిన, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించకపోవడం తో వారిని విధుల నుంచి తొలగించినట్టు సింగరేణి సంస్థ తెలిపింది. అయితే వీరిని తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై ఇటీవల డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) కు మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో వీరిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు వీలుగా యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే టర్మినేటైన 43 మంది జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీలకు ఇది తాజా నియామకంగా గుర్తించారు. వీరంతా సంస్థ ఏర్పాటు చేసే హై పవర్ కమిటీ ముందుకు వెళ్లి తమ వివరాలను, ఓవర్ మెన్ సర్టిఫికెట్, గ్యాస్ టెస్టింగ్ ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లు మొదలైనవి సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం ఆ కమిటీ సూచన మేరకు మెడికల్ ఫిట్ నెస్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా ప్రాథమిక అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేస్తారు. వారు తిరిగి ఉద్యోగంలో చేరిన జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీలు తమ మొదటి సంవత్సరంలో తప్పనిసరిగా కనీసం 190 మస్టర్లకు తగ్గకుండా విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

**మరో అవకాశం రావడం అదృష్టం.. కష్టపడి పనిచేయండి : బలరామ్**



డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి)కు మధ్య జరిగిన త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం జూలై 24 నాటికి టర్మినేట్ అయిన జెఎంఇటి వయసు 45 సంవత్సరాల కంటే తక్కువ ఉండి, హైపర్ కమిటీలో దరఖాస్తు చేసుకుని మెడికల్ టెస్టులలో ఫిట్ అయినవారికి జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రైనీ (జెఎంఇటి), టి.ఎస్ గ్రేడ్ సిగా పునర్నియామక పత్రాలను త్వరలో అందజేస్తామని సింగరేణి సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ వెల్లడించారు. తిరిగి ఉద్యోగాల్లో చేరుతున్న వీరంతా క్రమశిక్షణతో పనిచేయాలని, వచ్చిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ మార్కెట్‌లో ఉద్యోగాలను సాధించడం అతి కష్టంగా ఉంటుందని, ఇలాంటి సమయంలో ఒకసారి తొలగించిన వారి కి మరోసారి అవకాశం కల్పించడం అదృష్టమని, వారికి విలువైన అవకాశాన్ని కల్పించిన కంపెనీకి ఉత్తమ సేవలు అందించాలని బలరామ్ కోరారు.

# విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రాష్ట్రంలోని ప్రభుత్వ విద్య, వైద్య సంస్థల్లో మౌలిక వసతులు మెరుగు కోసం ప్రభుత్వ మొదట ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. శనివారం జిల్లాపరిషత్ కార్యాలయంలో జిల్లాలోని కేజీబీవీ మోడల్ స్కూల్ రెసిడెన్సియల్ పాఠశాలలో సిఎస్ ఆర్ నిధులతో చేపట్టిన మౌలిక వసతులు కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యరంగాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న కేజీబీవీ మోడల్ స్కూల్ రెసిడెన్షియల్ పాఠశాలలోని సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి అదికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలలో ఉన్న అన్ని కేజీబీవీ పాఠశాలలు మోడల పాఠశాలో రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పోరేట్ స్కూల్‌కు దీటుగా ప్రభుత్వ రంగంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల్లో మౌలిక వసతులు కల్పనకు ఎంతగానో ప్రాధాన్యమిస్తుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో కావాల్సిన వసతులపై సమగ్ర నివేదిక రూపొందించాలని వాటి ప్రాధాన్యాన్ని అనుసరించి సీఎస్ ఆర్ నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో ఆయా పరిశ్రమలు చేపట్టిన పనులను ఆయా అధికారులు నిరంతరం తనిఖీ చేసి పనులు నాణ్యతతో జరిగేలా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు.

జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలల కార్పోరేట్‌కు దీటుగా అభివృద్ధి చెందుతాయన్నారు. సంక్షేమ వసతి గృహాలు రెసిడెన్షియల్ పాఠశాలలో అవసరమైన ఫర్నీచర్స్, కిచెన్ సామాగ్రి స్పోర్ట్స్ కిట్‌లు పిఎస్ఆర్ నిదులతో అందుబాటులో ఉంచారన్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్, జడ్పీసీఈఓ జానకిరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జానాయక్ సిపఓ బాలశౌరి పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్‌శాఖ, అధికారులు టీఎస్ ఈ డబ్ల్యూ ఐడిసి ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. జర్నలిస్టు డేని పురస్కరించుకుని శనివారం కొత్తగూడెం ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసిన ఆయన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో కలిసి పలువురు జర్నలిస్టులకు శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తి ఎంతో విలువలతో కూడినదని, సమసమాజ స్థాపన కోసం జర్నలిస్టులు అనునిత్యం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పరిపాలనలో లోటుపాట్లు జరిగినప్పుడు, అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడినప్పుడు, దోపిడీ పెరిగిపోయినప్పుడు జర్నలిస్టులు వాటిపై అక్షర యుద్ధం చేయాలని, వ్యవస్థను, వ్యక్తులను గాడిలో పెట్టేందుకు కృషి చేయాలన్నారు. మారుతున్న కాలనుగుణంగా జర్నలిస్టు వృత్తిలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, వృత్తి నియమాలను పాటిస్తూ విషయ పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ నైపుణ్యతను ప్రదర్శించాలన్నారు. కొత్తగూడెం నియోజకవర్గాభివృద్ధికి ప్రభుత్వాన్ని ఒప్పించి పెద్ద ఎత్తున నిధుల తెస్తున్నామని, వివిధ అభివృద్ధి పథకాలు కొనసాగుతున్నాయని అన్నారు. మరింత అభివృద్ధి చేసుకునేందుకు ప్రతీ అంశంపై దృష్టి సారించామని, నియోజకవర్గాభివృద్ధికి జర్నలిస్టుల సూచనలు, సలహాలు కూడా అందించాలన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఇప్పటికే ప్రభుత్వ పెద్దలతో చెప్పామని, అనునిత్యం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులు ఆరోగ్యాల పట్ల, కుటుంబాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎంతో కాలంగా విలేకరులు ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించేందుకు కృషి మొదలు పెట్టామని, దీనిపై ఇప్పటికే కలెక్టర్‌తో పలు దఫాలుగా చర్చించామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో కార్యరూపం దాల్చేందుకు ప్రయత్నింస్తామని చెప్పారు. అర్హులైన ప్రతీ ఒక్క జర్నలిస్టుకు ఇంటి జాగా వచ్చేందుకు తన వంతు ప్రయత్నం తప్పకుండా ఉంటుందని, దీనిలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. నాగాచారి అధ్యకతన జరిగిన ఈ కార్యక్రమంలో విలేకరులు మోటమర్రి రామకృష్ణ, జనుమాల రమేష్, పందా సత్యానంద్, కాగితపు వెంకటేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరావు, కల్లోజి శ్రీనివాస్, లక్ష్మ ణ్, శశి, గోవింద్, సతీష్, నర్సింహారావు, రవి, రాజేష్, ఈశ్వర్, నవీన్, కుమార్, అనుపమ తదితరులు పాల్గొన్నారు.



## నేటి వరకు నిమజ్జనాలు:డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు సజావుగా కొనసాగుతున్నాయని ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలతో పాటు ముఖ్యంగా హైదరాబాద్‌లో జరుగుతున్న నిమజ్జన కార్యక్రమాన్ని ఆయన తన కార్యాలయం నుంచి అదనపు డిజిపి మహేష్ భగవత్‌తో కలిసి పర్యవేక్షించారు. ఆయా జిల్లాల ఎస్‌పిలు, కమిషరేట్ల కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్ ద్వారా మాట్లాడి అక్కడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రఖ్యాత ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, అయితే వినాయక నిమజ్జనాలు ఆదివారం కూడా కొనసాగనున్నాయని జితేందర్ తెలిపారు. నగరంలో మూడు కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేక బలగాలు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలాపూర్ గణపతి శోభాయాత్ర కూడా ప్రశాంతంగా సాగిందన్నారు. నిమజ్జనాలు ఆదివారం కూడా కొనసాగుతాయని తెలిపారు. బంజారాహిల్స్‌లోని ఐసీసీ కంట్రోల్ రూమ్ నుంచి వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఈసారి ఎస్‌డిఆర్‌ఎఫ్ కూడా నిమజ్జన విధుల్లో పాల్గొన్నదని తెలిపారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి






సిపిఐ ఉత్తరాఖండ్ రాష్ట్ర మహాసభల్లో గిరీశ్ శర్మ, అజీజ్ పాషా పిలుపు

**డెహ్రాడూన్:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సిపిఐ కార్యదర్శులు డాక్టర్ గిరీశ్ శర్మ, సయ్యద్ అజీజ్ పాషా పిలుపునిచ్చారు. నిరంకుశ మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడం కోసం కలిసి రావాలని ప్రగతిశీల, ప్రజాస్వామ్య, లౌకిక వాదులను కోరారు. ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలని ప్రజలను చైతన్యపరిచారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఉత్తరాఖండ్ రాష్ట్ర మహాసభలను పార్టీ కార్యదర్శి డాక్టర్ గిరీశ్ శర్మ శనివారం ప్రారంభించారు. తొలుత అరుణ పతాకాన్ని ఎగురవేసి అమరవీరులకు నాయకులు అరుణాంజలి ఘటించారు. మహాసభల ప్రారంభోత్సవానికి సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎన్ నేగి, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి రాజేంద్ర పురోహిత్, సిపిఐ(ఎంఎల్) కార్యదర్శి ఇందరేశ్ మైఖురి తదితరులు హాజరయ్యారు. అతిథులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్ కులియల్ స్వాగతం పలికారు.

## 'బిసి రిజర్వేషన్ల బిల్లుల' ఆమోదానికి సిఎం ప్రయత్నాలేవీ?

కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు ఆమోదం పొందేలా సిఎం రేవంత్ రెడ్డి ఎటువంటి ప్రయత్నం చేయడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బిసి రిజర్వేషన్ల బిల్లులు ఆమోదించడం తప్ప వాటికి రాష్ట్రపతి ఆమోదం కోసం సిఎం చిన్న ప్రయత్నం కూడా చేయడం లేదన్నారు. మాజీ కార్పొరేటర్ గోపు సదానందం, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఆరె కటిక సంఘం నాయకులు సురేందర్ తదితర బిసి నాయకులు హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో కవిత సమక్షంలో శనివారం జాగృతిలో చేరారు. అనంతరం బిసి సంఘాల నాయకులతో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే యోచనలో ఉన్నదని, ఇదే జరిగితే ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో హామీ ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని కవిత తెలిపారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

టెండర్ నోటీసు నం. : 06-GS-SC-II-25-OT, తేదీ: 03-09-2025. PUB/1086

భారత రాష్ట్రపతి తరపున, CAO/C/RSP/SCR-ENGINEERING/SOUTH CENTRAL RAILWAY, సికింద్రాబాద్ 30-09-2025 15:00 గంటల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కింది పనుల కోసం ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తుంది.

**టెండర్ నం. :** 06-GS-SC-II-25-OT. **పని పేరు:** చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ / గతి శక్తి / హైదరాబాద్ యూనిట్ కోసం ప్రాజెక్ట్ పర్యవేక్షణ సేవలు (PSS) అందించడానికి ప్రతిపాదన (RFP) కోసం అభ్యర్థన. **ప్రకటించబడిన విలువ:** రూ.5,60,80,881.92. **బయానా డబ్బు డిపాజిట్:** రూ.4,30,400.00.

మరిన్ని వివరాల కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.
**డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ / గతి శక్తి / హైదరాబాద్.**

టెండర్ నోటీసు నం. : 36/2025, తేదీ: 04-09-2025 స్టోర్ వస్తువుల సరఫరా PUB/1088

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు**
కింది టెండర్లు ఆన్‌లైన్‌లో ప్రవేశపెట్టబడ్డాయి. టెండరుదారులు **www.ireps.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించి తమ ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించాలని అభ్యర్థించారు. **టెండర్ వివరణ, Qty, EMD, SD వెబ్‌సైట్‌లో చూడవచ్చు.** మాన్యువల్‌గా సమర్పించిన ఆఫర్లు అంగీకరించబడవు. పోస్ట్ ద్వారా ఆఫర్లు స్వీకరించబడవు. టెండర్ ముగింపు సమయం టెండర్ గడువు తేదీ నుండి **14:30 గంటలు**. అన్ని స్వదేశీ ఆఫర్ల కోసం, **www.ireps.gov.in**లో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా మాత్రమే బయానా డబ్బు డిపాజిట్ అంగీకరించబడుతుంది.

| టెండర్ నెం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| 54255012 | ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్లు. |
| 54255007A | యూనిఫైడ్ టికెటింగ్ నెట్‌వర్క్స్ WAN పోర్టులతో కూడిన రూటర్లు. |
| 66257552 | స్పేర్డ్ డ్యూట్స్ తయారీ ట్రాక్ మెషీన్ల సేకరణ. |
| 76255001A | IRSM 46-2020కి Mig/Mag వెల్డింగ్ ఫిల్లర్ వైర్. |
| 45251004 | బ్రష్‌లెస్ ఆల్టర్నేటర్ 25kw. |
| 45251073 | 120 AH VRLA బ్యాటరీల సెట్. |
| 66257306 | ట్రాక్ మెషీన్ల కోసం కమ్మిన్స్ తయారు చేసే విడిభాగాల సేకరణ. |
| 66257607 | ట్రాక్ మెషీన్ల కోసం CATERPILAR తయారీ విడిభాగాల సేకరణ. |
| 66256053 | ప్లాసర్ తయారీ ట్రాక్ మెషిన్ విడిభాగాలు. |
| 45251021A | 1100 AH లీడ్ యాసిడ్ బ్యాటరీ. |
| 66256285 | ప్లాసర్ తయారీ ట్రాక్ మెషిన్ విడి భాగాలు. |

**గమనిక:- టెండర్ ప్రారంభ గడువు తేదీలు:** క్ర.సం.: 01 తేదీ: 15-09-2025న, క్ర.సం.: 02. తేదీ: 24-09-2025న, క్ర.సం.: 03 & 04 తేదీ: 25-09-2025న, క్ర.సం.: 05 & 06 తేదీ: 23-09-2025న, క్ర.సం.: 07 & 08 తేదీ: 06-10-2025న, క్ర.సం.: 09 & 10 07-10-2025న, క్ర.సం.: 11 తేదీ: తేదీ: 13-10- 2025న.

**సవరణ**
సంక్షిప్త వివరణ: టెండర్ నోటీసు నెం.31/2025 తేదీ: 01-08- 2025 టెండర్ నెం. 76251092 తేదీ: 26-08-2025న గడువు తేదీ; సాలిడ్ మిగ్ / మాగ్ వెల్డింగ్ ఫిల్లర్ వైర్ 1.2mm డయా క్లాస్-1ని ఇప్పటికే ఉన్న టెండర్లకు బదులుగా గడువు తేదీ: 11-09-2025గా చదువుకోగలరు. పైన పేర్కొన్న టెండర్లతో పాటు రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగిన ఇతర టెండర్లు కూడా ఉన్నాయి. వివరాల కోసం, దయచేసి పైన ఉన్న రైల్వే వెబ్‌సైట్‌ను సందర్శించండి.
**ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్, సికింద్రాబాద్.**

టెండర్ నోటీసు నం. : TRSO/ SC/01/2025-26, తేదీ: 04-09-2025 PUB/1087

క్రింద సంతకం చేసిన వారు అనుభవజ్ఞులైన కాంట్రాక్టర్ల నుండి ఈ-టెండర్లు ఈ క్రింది పనుల కోసం ఆహ్వానిస్తున్నారు.

**క్ర.సం.: 1. టెండర్ నం. & తేదీ:** C/E.29/TRSO/SC/12/2025-26, తేదీ: 04-09-2025 (ఇ-టెండర్ నం. CE-29- TRSO-SC-12-2025-26, తేదీ: 04-09- 2025). **పని వివరణ:** భద్రాచలం రోడ్ & డోర్నకల్ జంక్షన్ నుండి రెండు సంవత్సరాల పాటు వివిధ సిబ్బందిని మార్చుకునే పాయింట్లకు మరియు సైడింగ్లకు వ్యతిరేకంగా 24 గంటలూ సిబ్బంది రవాణా కోసం ఐదు నాన్-ఎసి MUV వాహనాలను అద్దెకు నియమించడం. **టెండర్ విలువ (రూ.) :** 1,62,16,888/-. **బయానా డబ్బు డిపాజిట్ (బిడ్ సెక్యూరిటీ) (రూ.) :** 2,31,100/-. **టెండర్ ఫారం ధర :** లేదు. **పూర్తి వ్యవధి :** 2 సంవత్సరాలు. **ముగింపు & ప్రారంభ తేదీ మరియు సమయం :** 30-09-2025 15:00 గంటలు & 30-09-2025, 15:30 గంటలు.

1. టెండర్ షరతులు / ఇతర వివరాలు **www.ireps.gov.in** లోని IREPS వెబ్‌సైట్‌లోని టెండర్ డాక్యుమెంట్లలో అందుబాటులో ఉన్నాయి.
2. అన్ని కాబోయే టెండరుదారులు ఆన్‌లైన్ చెల్లింపు ద్వారా మాత్రమే EMD (బిడ్ సెక్యూరిటీ) చెల్లించాలని అభ్యర్థించారు. టెండర్ డాక్యుమెంట్ సమర్పణ : **www.ireps.gov.in** లోని IREPS వెబ్‌సైట్ ద్వారా.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (TRSO), సికింద్రాబాద్.**

ఓపెన్ ఇ-టెండర్ నోటీసు నం.: DRM/వర్క్స్/BZA/21/2025, తేదీ: 04-09-2025 PUB/1089

**భారత రాష్ట్రపతి** తరపున మరియు వారి తరపున, దిగువ సంతకందారు ఈ క్రింది పనుల కోసం **15:00 గంటల వరకు** మరియు ప్రతిదానిపై పేర్కొన్న తేదీ వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**క్ర.సం: 1. టెండర్ నెం:** E-37- EAST-BZA-2025. **పని వివరాలు: పని పేరు:** SSE / వర్క్స్ / BVRM విభాగంలో BVRT వద్ద ఉన్న రైలు రకం COP షెల్టర్‌కు బదులుగా COP షెల్టర్ల ప్రతిపాదన. IRPSM ID: 11.06.53.24.3.55.064.
**పూర్తయిన వ్యవధి:** 12 (పన్నెండు నెలలు). **టెండర్ విలువ:** రూ.1,70,18,604.35/-. **బయానా డబ్బు డిపాజిట్:** రూ.2,35,100.00/- **ముగింపు తేదీ:** 26-09-2025.

1) టెండరు గడువు తేదీకి ముందు కాబోయే టెండరుదారులు ఏదైనా టెండర్‌కు సంబంధించిన ఏవైనా మార్పులు / సవరణనను గమనించడానికి www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించబడింది.
**డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), విజయవాడ.**
A1363

**మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.**



# జనరల్
STATE & REGIONAL NEWS

## నిమజ్జనంలో ఫైర్ సిబ్బంది



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో 527 మంది ఫైర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని అగ్నిమాపక శాఖ డిజి వై.నాగిరెడ్డి తెలిపారు. ముఖ్యంగా హుస్సేన్‌సాగర్‌లో ప్రత్యేక బోట్‌ల ద్వారా ఫైర్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు. ఎలాంటి ఉపద్రవం సంభవించిన వెంటనే రక్షణ చర్యలు తీసుకునేందుకు ఫైర్ అధికారులు, సిబ్బంది హుస్సేన్‌సాగర్ చుట్టు గస్తీలో ఉన్నారని నాగిరెడ్డి తెలిపారు.













## వివిధ రూపాల్లో విఘ్నేశ్వరుడు









## అభివృద్ధి, సంక్షేమం జోడేద్దుల్లా ముందుకు

### గత పాలకులు రాష్ట్రంపై 8.19 లక్షల కోట్ల అప్పులు మిగిల్చిపోయారు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం / వనపర్తి :** గత పాలకులు 10 సంవత్సరాల్లో రూ. 8.19 లక్షల కోట్ల అప్పు భారం చేసి వెళ్లినప్పటికి ఈ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీను నెరవేర్చుతున్నామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో సహచార మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే తుది మేఘారెడ్డి , జిల్లా ఆదర్శ్ సురభి తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం పైన ఇచ్చి అప్పులు ఉన్నా ప్రతి నెల చేసిన అప్పులకు వడ్డీ చెల్లిస్తూనే అభివృద్ధి, సంక్షేమాన్ని జోడేద్దుల వలె ముందుకు తీసుకువెళ్తున్నామని చెప్పారు. గత పాలకులు పేదలందరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేదని , కనీసం సంవత్సరానికి 2 లక్షల ఇల్లు కట్టిన ఐదు సంవత్సరాల్లో 10 లక్షల ఇళ్లు కట్టేవారని కాని వారికి పేదల సంక్షేమం కంటే కమిషన్లే ముఖ్యమని కాళేశ్వరం కట్టారని దుయ్యబట్టారు. ప్రజా పాలనలో తొలి విడతగా రూ. 22,500 కోట్ల నిధులతో ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. మరో మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. రాష్ట్ర అబ్కారి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన వారందరూ త్వరగా ఇళ్లు కట్టుకోవాలని సూచించారు. రాష్ట్ర పశుసంవర్ధక డైరీ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క నిరుపేద కుటుంబం సొంత ఇల్లు లేదని బాధపడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎన్నికల సందర్భంగా వనపర్తి నియోజకవర్గంలో తూడి మేఘారెడ్డిని గెలిపిస్తే వనపర్తి నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటా అని మాట ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గ అభివృద్ధి కొరకు ఇప్పటికే రూ. 1000 కోట్లు ఒకసారి మరోసారి 280 కోట్లు మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. అభివృద్ధి పరంగా రాష్ట్రంలో పాలేరు నియోజకవర్గం తర్వాత అంతటి ప్రాధాన్యత వనపర్తి నియోజకవర్గానికి కల్పించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 6,127 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడం జరిగిందన్నారు. వాటిలో 3565 ఇళ్లుకు మార్క్ అవుట్ ఇవ్వగా నేటి వరకు 180 చెత్తు లెవల్ పూర్తి అయ్యాయని, 150 ఇళ్లు రూఫ్ లెవెల్ , 1220 బేస్మెంట్ లెవెల్ పూర్తి అయి మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. మంగంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు చేసిన లబ్దిదారులకు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వం తరపున లబ్దిదారులకు బట్టలు పెట్టగా స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, వ్యక్తిగతంగా లబ్దిదారులకు బట్టలు పెట్టారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్యానాయక్ , అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పి. శ్రీనివాస్ గౌడ్ , పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఊపిరి పీల్చుకున్న పోలీసులు

### సాఫీగా ఇరువర్గాల పండుగలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మిలాద్‌ఉన్‌నబీ, గణేష్ ఉత్సవాలు ఒకేసారి రావడంతో హైదరాబాద్‌లో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు తీసుకున్న కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు ఎట్టకేలకు ఫలించాయి. శుక్రవారం మిలాద్ ఉన్ నబీ, శనివారం గణేష్ నిమజ్జనంలో సాఫీగా జరగడంతో హైదరాబాద్ పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. 11 రోజుల నుంచి పోలీసులు హైదరాబాద్‌లో స్టాండ్‌డ్యూటీ వరుసగా చేశారు. పికెటింగ్, బందోబస్తు, పెట్రోలింగ్, తనిఖీలు, నిఘా వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో ఎలాంటి సంఘటనలకు ఆస్కారం లేకుండా చేశారు. ముఖ్యంగా బాలాపూర్ గణనాథుడు పాత బస్తీ గుండా బార్కాస్ నుంచి చంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, గౌలిపుర, శాలిబండ, చార్మినార్, మదీనా, నయాపూల్, అఫ్జల్‌గంజ్ మీదుగా మోజంజాహిమార్కెట్‌కు చేరుకోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. ఇక అడుగడుగున సిసిటివి కెమెరాలు పెట్టడంతో బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసిలో సిసిటివిలో సిబ్బంది శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం ప్రత్యక్షంగా వీక్షించారు. శోభాయాత్ర పొడుగునా ప్రతి వ్యక్తిని వీరు గమనించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక దృష్టి సారించారు. మరో పక్క మహారాష్ట్రలో నిమజ్జనం రోజున మానవ బాంబులతో అల్లకల్లోలం సృష్టిస్తామని ఉగ్రవాదులు వాట్సాప్‌లో సందేశాలు పంపడంతో హైదరాబాద్ పోలీసులు కూడా ముందు జాగ్రత్త చర్యగా అప్రమత్తమయ్యారు. బందోబస్తులో శాంతి భద్రతల పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్, సిసిఎస్, ట్రాఫిక్, షీటీమ్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు పాల్గొన్నారు. బాలాపూర్ నుంచి ట్యాంక్ బండ్ వరకు నిఘా అధికారుల పర్యవేక్షణలో శోభాయాత్ర కొనసాగింది. హైదరాబాద్‌లో జరిగిన శోభాయాత్రలో 29 వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఆయా జోన్‌ల డిసిపిలు, డివిజన్‌ల ఎసిపిలతో పాటు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు ప్రతి క్షణం తమ తమ ఏరియాలో పర్యవేక్షిస్తునే ఉన్నారు. ఈ బందోబస్తు ఆదివారం రాత్రి వరకు కొనసాగనుందని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. షీటీమ్ పోలీసులు కొంత మంది ఆకతాయి యువకులను అదుపులోకి తీసుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా రహదారుల్లో ఎలాంటి ట్రాఫిక్ కష్టాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.శోభాయాత్రను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

## ఇండ్ల సమాచారం ఇవ్వండి : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమాచార హక్కు చట్టం కింద జనం కోరితే ఇందిరమ్మ ఇళ్ల వివరాలు ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశించింది. వివరాలు ఇచ్చేందుకు నిరాకరించడం సమాచార హక్కు చట్టం 2005కు పూర్తి విరుద్ధమంది. పిటిషనర్కు బీపీఎల్ కింద ఉచిత సమాచారం ఇవ్వాలంది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా, అర్హతలు, ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వాలంటూ పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులకు న్యాయ విద్యార్థి గాడిపెల్లి గణేశ్ సమాచార హక్కు చట్టం కింద అప్లికేషన్ పెట్టుకున్నారు. బీపీఎల్ కేటగిరీలోని సమాచారాన్ని సెక్షన్ 7(5) కింద ఇవ్వాలని కోరితే, ఇచ్చేందుకు ఆఫీసర్లు నిరాకరించారు. దీనిని సవాలు చేస్తూ గణేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా జస్టిస్ టి.మాధవీదేవి ఇటీవల తీర్పు చెప్పారు. జీవో 454 ఈ కేసులో వర్తించదని, దరఖాస్తుదారునికి చట్టప్రకారం సమాచారం ఇవ్వడం ప్రభుత్వ విధి అన్నారు.




### కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో..

## 17న తెలంగాణ విమోచన వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సెప్టెంబర్ 17న జరగనున్న తెలంగాణ విమోచన దినోత్సవం 2025 వేడుకల సన్నాహక సమావేశం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన హైదరాబాద్ బర్కత్ పురాలోని నగర కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, గజేంద్ర సింగ్ షెకావత్, బండి సంజయ్ కుమార్, మహారాష్ట్ర మంత్రులు పాల్గొంటారు. తెలంగాణ స్వాతంత్ర్య పోరాట యోధులు, ఉద్యమ కథనాలను వివరించే ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తారు. పరేడ్ గ్రౌండ్ సమీపంలోని కంటోన్మెంట్ పార్కులో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించనున్నారని ఈ వేడుకలను విజయవంతం చేయడానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. పార్టీ తరపున కూడా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## జాతీయ చిహ్నాన్ని దుర్వినియోగం చేసిన బిజెపి


### హజ్రత్‌బాల్‌లో శిలాఫలకాన్ని తొలగించాలి
### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్




**న్యూఢిల్లీ:** భారత జాతీయ చిహ్నాన్ని దుర్వినియోగం చేసిన కేంద్ర పాలకపార్టీ బిజెపి వైఖరిని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది.జాతీయ చిహ్నం అశోకచక్ర ఏ ఒక్క రాజకీయపార్టీకీ, ఏ ఒక్క వ్యక్తికీ సంబంధించినది కాదని, రాజకీయ ప్రచారాలకోసం మత ప్రదేశాలలో ఎట్టిపరిస్థితుల్లోనూ ఎప్పటికీ దుర్వినియోగం చేయకూడదని స్పష్టం చేసింది. హజ్రత్‌బల్ పవిత్ర ప్రదేశంలో ఏర్పాటు చేసిన సంబంధిత శిలాఫలకాన్ని అక్కడి నుండి తొలగించాలని, రాజకీయపార్టీలు జాతీయ చిహ్నాన్ని దుర్వినియోగం చేయకుండా ప్రభుత్వం భరోసా ఇవ్వాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ‘‘కశ్మీరులో దాల్ నదీతీరంలో ఉన్న ముస్లింలకు అతిపవిత్రమైన హజ్రత్ బాల్ పవిత్ర ప్రాంగణంలో బిజెపి నాయకురాలు, జమ్మూ,కశ్మీరు వక్ఫ్‌బోర్డు చైర్‌పర్సన్ డా.దరాక్షన్ అంద్రబీ ఇటీవల ఒక శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ శిలాఫలకంపై ఆమె పేరు పక్కనే భారత జాతీయ చిహ్నాన్ని కూడా ముద్రించుకోవడం దిగ్భ్రాంతి కలిగించింది. జాతీయ చిహ్నం దేశ గణతంత్ర సమష్టి గౌరవ ప్రతిష్ఠకు చిహ్నం, ఆ గౌరవాన్ని ఎన్నటికీ దిగజార్చకూడదు, ఈ జాతీయ చిహ్నాన్ని వ్యక్తులు తమ గొప్పతనాన్ని చాటుకోవడానికో లేదా తమకు అనుకూలమైన రాజకీయ ప్రయోజనాలు సాధించడానికో ఒక సాధనంగా ఉపయోగించుకోకూడదు. ఒక పవిత్రమత ప్రదేశంలో రాజకీయ ప్రయోజనాలకోసం బిజెపి ఉద్దేశపూర్వకంగా ఈ జాతీయచిహ్నాన్ని శిలాఫలకంపై ముద్రించిందనేదే సిపిఐ ఉద్దేశం’’ అని పార్టీ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అన్యాయాన్ని వ్యతిరేకించినవారు ఉగ్రవాదులు కాదనీ, వారు ప్రజాస్వామ్యవాదులేననీ, దేశ ప్రజాస్వామ్య, లౌకిక సూత్రాలను దిగజార్చిన బిజెపి ఇందుకు తప్పనిసరిగా బాధ్యత వహించాలని సిపిఐ పునరుద్ఘాటిస్తోందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మతప్రదేశంలో జాతీయ చిహ్నాన్ని శిలాఫలకంపై ముద్రించి అవమానించడమేకాకుండా, పుండుమీద కారం జల్లినవిధంగా దీనికి వ్యతిరేకంగా గొంతెత్తి ప్రశ్నించి, ఈ చర్యను ప్రతిఘటించినవారిపై ఉగ్రవాదులుగా బిజెపి నాయకత్వం ముద్రవేసిందనీ, ప్రజాస్వామ్యబద్ధంగా అసమ్మతిని, నిరసనను తెలియజేసే హక్కును నేరంగా చిత్రీకరించే ఈ దౌర్జన్యకరమైన ప్రయత్నాన్ని సిపిఐ ఖండిస్తోందనీ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఈ విధమైన చర్యలు భక్తుల మతపరమైన భావోద్వేగాలను గాయపరచడమేకాకుండా, రాజ్యాంగ విలువలను కూడా దిగజారుస్తాయని హెచ్చరించారు.

### ఎర్రకోటలో రూ. కోటి విలువైన

## రెండు బంగారు కలశాలు చోరీ



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంగణంలో జరిగిన జైన మతపరమైన కార్యక్రమంలో రెండు బంగారు ‘కలశం’ (కలశం), దాదాపు రూ. 1.5 కోట్ల విలువైన ఇతర విలువైన వస్తువులు చోరీ అయ్యాయి. దొంగ జైన పూజారి వేషంలో వచ్చి విలువైన వస్తువులను దోచుకున్నట్లు సిసిటివి ఫుటేజ్‌లో తేలింది. నిందితుడిని గుర్తించామని, అతన్ని అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. దొంగిలించబడిన వస్తువులలో ఒక బంగారు ‘జారి’ (కలశం), దాదాపు 760 గ్రాముల బరువున్న బంగారు కొబ్బరికాయ, వజ్రాలు, పచ్చలు, మాణిక్యాలతో పొదిగిన చిన్న పరిమాణంలో ఉన్న 115 గ్రాముల బంగారు ‘జారి’ ఉన్నాయని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. దొంగిలించబడిన వస్తువులు వ్యాపారవేత్త సుధీర్ జైన్‌వి కాగా, అతను ప్రతి రోజూ పూజ నిమిత్తం ఇక్కడికి తీసుకువస్తారు. ఎర్రకోట ప్రాంగణంలోని 15 ఆగస్టు పార్క్‌లో 10 రోజుల పాటు జరిగే ‘దసలక్షణ మహాపర్వం’ సందర్భంగా బుధవారం దొంగతనం జరిగింది. జైన పూజారి వేషంలో ఉన్న నిందితుడు విలువైన వస్తువులు ఉన్న బ్యాగును ఎత్తుకెళ్లినట్లు సిసిటివిలో కనిపించింది. నిర్వాహకులు ప్రముఖులను స్వాగతించడానికి ఏర్పాట్లు చేస్తున్నప్పుడు దొంగతనం జరిగినట్లు బయటపడింది. ఉత్సవ కార్యకలాపాలు తిరిగి ప్రారంభమైనప్పుడు వేదికపై వస్తువులు కనిపించకుండా పోయాయి. రద్దీగా ఉండడంతో దొంగ దానిని ఆసరాగా చేసుకున్నాడని, రత్నాలు కేవలం సౌందర్యం కోసమేనని, ‘కలశం’ మన మనోభావాలతో ముడిపడి ఉండగా, అలాంటి వస్తువుకు మనం విలువ కట్టలేమని సుధీర్ జైన్ విలేకరులతో అన్నారు. పోలీసులకు ఆధారాలు లభించాయని, వారు త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తారని ఆయన అన్నారు. దొంగ గతంలో మూడు దేవాలయాలపై ఇలాంటి ప్రయత్నాలు చేశాడని సుధీర్ జైన్‌కు బంధువు అయిన పునీత్ జైన్ ఆరోపించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఎస్ఐఆర్ సన్నద్ధతపై ఇసి కీలక భేటీ

**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఇటీవల ఓటరు జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టిన ఎన్నికల సంఘం, ఇప్పుడు దేశవ్యాప్తంగా చేపట్టాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రతినిధులతో దేశవ్యాప్త అమలుకు సంబంధించిన సంసిద్ధతపై చర్చించనుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు శనివారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు వచ్చే వారం రాష్ట్ర ప్రతినిధులతో చర్చించనున్నట్లు చెప్పారు. పోల్ అథారిటీ బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారుల సమావేశాన్ని ఏర్పాటు చేసిందని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 10న జరగనున్న సమావేశం ప్రాముఖ్యాన్ని సంతరించుకుందని అధికారులు తెలిపారు. ఫిబ్రవరిలో జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది మూడ సిఇఒల సమావేశం. బిహార్ తర్వాత, దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం స్పెషల్ రివిజన్ నిర్వహించనుందని పేర్కొన్నారు. 2026లో అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎస్ఐఆర్ ప్రాథమిక లక్ష్యం విదేశీ అక్రమ వలసదారులను తనిఖీ చేయడం ద్వారా వారిని తొలగించ డం. బంగ్లాదేశ్, మయన్మార్‌తో సహా వివిధ రాష్ట్రాల్లో అక్రమ విదేశీ వలసదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

## నిర్భయంగా, నిష్పక్షపాతంగా చట్ట పాలన అమలు చేయడం కోర్టుల విధి

### నేషనల్ లా యూనివర్శిటీ 12వ స్నాతకోత్సవంలో 'సుప్రీం' న్యాయమూర్తి జస్టిస్ బి.వి.నాగరత్న ఉద్బోధ



**న్యూఢిల్లీ :** చట్టపాలనను కాపాడుకోవాలంటే ప్రజాస్వామ్యం సారాంశాన్ని భయం లేదా పక్షపాతం లేకుండా దానిని అమలు చేయడం కోర్టుల విధి అని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బి.వి.నాగరత్న ఉద్బోధించారు. శనివారం నేషనల్ లా యూనివర్శిటీ 12వ స్నాతకోత్సంలో ప్రసంగించారు. చట్టం అంటే కేవలం రూల్స్‌కు సంబంధించింది మాత్రమే కాదని, సంపద, హోదా, కులం, లింగం, నమ్మకంతో సంబంధం లేకుండా ప్రతీ వ్యక్తినీ చట్టం ముందు సమానమైన అంశంగా పరిగణించబడుతుంది అన్నారు. చట్టాన్ని శక్తివంతులు మాత్రమే చేరుకోగల కోటగా చూస్తారని, అయితే న్యాయవాదులు హక్కులు, పరిష్కారాల మధ్య వారధిగా మారడం ద్వారా దీనిని మార్చవచ్చని ఆమె అన్నారు. న్యాయవాద వృత్తి పరివర్తనకు ఒక వాహనం అన్నారు. ముఖ్యంగా భారతీయ సమాజంలో 'చారిత్రక మినహాయింపులు, పాతుకుపోయిన అసమానతలు కొనసాగుతున్నాయి' అని పేర్కొన్నారు. 'చట్టపాలన దాని సారాంశం అయిన ప్రజాస్వామ్యంలో అది సంరక్షించబడుతుంది, అమలు చేయబడుతుంది. చట్టపాలన దాని సారాంశం అయిన ప్రజాస్వామ్యంలో దానిని ముఖ్యంగా న్యాయస్థానాలు కాపాడుకోవాలి లేదా అమలుచేయాలి.ప్రజాస్వామ్యం సారాంశంగా చట్ట పాలనను కాపాడుకోవాలంటే భయం లేదా అనుకూలత, పక్షపాతం లేదా ద్వేషం లేకుండా దానిని అమలు చేయడం కోర్టుల విధి. చట్టబద్ధమైన పాలన అనేది అత్యంత ముఖ్యమైన లక్షణం, ఎందుకంటే భారతదేశంలో స్వతంత్ర న్యాయవ్యవస్థ ఉంది. ఇతరులతో పాటు ఇండిపెండెంట్ బార్‌కు మద్దతు, సహాయం కారణంగా సుపరిపాలన కొనసాగుతోంది' అని జస్టిస్ నాగరత్న చెప్పారు. రాజ్యాంగాన్ని దాని గొప్పతనం, ఉద్దేశంతో అమలు చేయాల్సిన బాధ్యత అధికార వర్గాలలోని వ్యక్తులపై మాత్రమే కాకుండా రాజ్యాంగాన్ని సమర్థించాల్సిన ప్రతీ న్యాయవాదిపైనా ఉందని వివరించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న వాణిజ్యం, లాభదాయక అవకాశాలు పెరుగుతున్న ఈ రోజుల్లో చట్టపరమైన జీవితం అంటే మొదటగా ప్రజాసేవలో జీవించడం అని మర్చిపోవడం సులభమని ఆమె అన్నారు. 'చాలా తరచుగా చట్టాన్ని బలవంతులకు మాత్రమే అందుబాటులో ఉండే కోటగా చూస్తారు. కానీ మీచేతుల్లో అది వారధిగా మారాలి. హక్కులు, పరిష్కారాల మధ్య రాజ్యాంగం, పౌరుడి మధ్య, న్యాయం మరియు ప్రజల మధ్య వారధిగా మారాలి. చట్టం అందరికీ చెందుతుందని గుర్తుంచుకోండి .కానీ అందరూ దానిని పొందలేరు. ఈ ప్రాప్యత నిరాకరించబడకుండా చూసుకోవడంలో మీరు విభిన్నంగా ఉండాలి' అని జస్టిస్ నాగరత్న సూచించారు.యువ న్యాయవిద్యార్థులకు సలహా ఇస్తూ, రాజ్యాంగ పరిచారకులుగా, న్యాయవాదులు వాణిజ్య పరిస్థితులను సులభతరం చేస్తే, సమాజంలో విశ్వాసాన్ని పెంపొందించినట్లయితే, రాజ్యాంగ విలువలతో పౌరనిర్మాణాన్ని నిర్మించడంలో వారు సరైన పాత్రను పోషిస్తేనే భారతదేశం సరైన మార్గంలో పురోగతి సాధించగలదని జస్టిస్ నాగరత్న ఉద్బోధించారు.' చారిత్రక మినహాయింపులు, పాతుకుపోయిన అసమానతలు కొనసాగుతున్న మనలాంటి సమాజంలో న్యాయవాద వృత్తి కేవలం ఒక నినాదం మాత్రమే కాదు, పరివర్తనకు ఒక వాహనం' అని ఆమె వివరించారు.

## టెంట్లలోనే 'యమున' బాధితులు





### బురదనేల, దోమల మధ్య బిక్కుబిక్కు మంటూ జీవనం

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా యమునా నది ప్రమాదస్థాయికి మించి ప్రవహించగా 70కి పైగా కుటుంబాలు నిరాశ్రులయ్యాయి. ఇప్పుడు వీరంతా అక్షరధామ్ సమీపంలోని ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే వెంబడి తాత్కాలిక గుడారాలలో ఒకవైపు బురద, మరోవైపు దోమకాట్లు మధ్య బిక్కుబిక్కుమంటూ జీవనం కపదుతున్నారు. టార్పాలిన్ టెంట్ బయ ట కూర్చున్న గంగాదేవి పేదలందరూ ఎక్కడి వె ళ్లారో అని దీనంగా యోచిస్తోంది. తమ ఇళ్లు కూ ల్చివేతలు లేదా వర్షం వల్ల తమకు ఈ దుస్థితి రాలేదని, కేవలం యమునా నది ఉప్పొంగడం వల్లేనని పేర్కొంది. ఢిల్లీలో చెత్తను శుభ్రం చేయ డం ద్వారా తాము రోజుకు రూ. 300 నుండి 400 వరకు సంపాదిస్తామని, కొందరం చెత్త ఏరుతామని, కొందరు డ్రైనేజీలు శుభ్రం చేస్తారని, ఇంకొందరు పువ్వులు అమ్ముతూ జీవనం గ డుపుతారని, అయితే ఇప్పుడు తామంతా ఎక్కడి వెళ్లాలని ప్రశ్నించారు. 6X8 సైజులో ఎక్స్‌ప్రెస్‌వే అంచున తాత్కాలిక శిబిరం ఏర్పాటు చేయగా, ఇది ఇటీవల యమునా వరద మైదానాలకు సమీపంలో ఉన్న వారి జుగ్గీలు లేదా కుచ్చా ఇంటి నుండి ఖాళీ చేయవలసి వచ్చిన కుటుంబాలకు 'ఇల్లు'గా మార్చబడింది. అటువంటి ఒక టెంట్ లోపల ఇటుకలపై ఒక చిన్న స్టవ్, కొన్ని స్టీల్ ప్లేట్లు, నల్లబడిన పాన్ వంటగదిలో కనిపించాయి. టెంట్ మీదుగా తడి బట్టలు వేలాడుతున్న ఒక తీగ ఉంది. ప్రతిరోజూ వర్షాలు కురుస్తుండటంతో బట్టలు ఎండిపోవడం లేదని, రెండు జతల బట్టలు మాత్రమే ఉండడం వల్ల వాటినే తాము ధరించాల్సి వస్తుందని కమలేష్ కుమార్ పేర్కొన్నారు. ఏడుస్తున్న తన కొడును ఒడిలో పడుకోబెట్టడానికి తీవ్రంగా శ్రమిస్తూ తన ధీనగాథను వినిపించాడు. అదే విధంగా ముగ్గురు పిల్ల ల తల్లి మీనా కుమారికి పరిమిత స్థలంలో జీవితాన్ని గడపాల్సి రావడం నిత్యం ఇబ్బందిగా మారింది. రాత్రిపూట ఒక బిడ్డ నిద్రలోకి జారుకునే సమయంలో మరొక బిడ్డ కూడా మేల్కొంటుందని, తాము ఆరుబయటే వంట చేస్తున్నామని, వర్షం పడితే ప్రతీదీ తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేసింది. కానీ వరదలు తమ కలలను, జుగ్గీని మింగిన తర్వాత తమకు మిగిలి ఉన్నది ఈ టెంట్ మాత్రమేనని చెప్పుకొచ్చింది. సాయంత్రాలో తమ తమ పిల్లలు టెంట్ల వెనుక ఆడుతూ ఒకరినొకరు తోసేసుంటున్నారని, ఈ సమయంలో తమ కుటుంబాలకు చెందిన పిల్లలు యము నా నది దగ్గరకు లేదా రోడ్డు పక్కన వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాల్సి వస్తోందన్నారు. ఈ శిబిరం ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేకు సమాంతరం గా ఉందని, అక్కడ భారీ ట్రక్కులు, కార్లు అన్ని సమయాల్లోనూ వేగంగా వెళ్తాయని అని హరీష్ చెప్పారు. తమ పిల్లలు ఆడుకుంటూ హైవే వైపు పరిగెత్తేస్తారేమో అన్న భయం తమను నిత్యం వెంటాడుతుందన్నారు. ఇదిలా ఉండగా, శనివారం ఓల్డ్ రైల్వే బ్రిడ్జి (ఒఆర్‌బి) వద్ద యమునా నది మట్టం 206.47 మీటర్లుగా నమోదై, చాలా రోజుల తర్వాత 207 మీటర్ల మార్క్ నుండి తగ్గుతోందని అధికారులు తెలిపారు. నది ప్రవాహాన్ని, సంభావ్య వరద ప్రమాదాలను ట్రాక్ చేయడానికి ఓల్డ్ రైల్వే బ్రిడ్జి కీలకమైన పరిశీలన కేంద్రం గా పనిచేస్తుంది. గత కొన్ని రోజులుగా న ది అధిక ఆటుపోట్ల కారణంగా నది ఒడ్డున ఉన్న అనేక ప్రాంతాలను ముంచెత్తింది. నదికి సమీపంలోని లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను తాత్కాలికంగా ఉంచడానికి ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే, మయూర్ విహార్, కశ్మీర్ గేట్, సమీప ప్రాంతాలలో టెంట్లు ఏర్పాటు చేశారు.



## స్టార్‌మర్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ

### ఉపప్రధాని డేవిడ్ లమ్మీ, విదేశీమంత్రి కూపర్

**లండన్:**బ్రిటన్ ప్రధానమంత్రి, లేబర్‌పార్టీ నాయకుడు కీర్ స్టార్‌మర్ ఆకస్మికంగా తన మంత్రివర్గాన్ని పునరుద్ధరించారు. ఉప ప్రధానమంత్రి ఏంజెలా రేనర్‌పై విచారణ సందర్భంగా నిజానిజాలు వెల్లడి కావడంతో శుక్రవారం ఆమె ఆకస్మికంగా పదవికి రాజీనామా చేయడంతో మంత్రివర్గాన్ని మరింత పటిష్టం చేసుకోవడానికి స్టార్‌మర్ తక్షణ చర్యలు తీసుకున్నారు. ఏంజెలా రేనర్ స్థానంలో ఉప ప్రధానమంత్రిగా డేవిడ్ లమ్మీని నియమించారు. ఆయన న్యాయశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తారు. ఇప్పటివరకూ ఆయన విదేశాంగ మంత్రిగా పనిచేశారు. ఆయన స్థానంలో మహిళా ప్రతినిధి వై వెట్టే కూపర్‌ను విదేశాంగమంత్రిగా నియమించారు. ఇప్పటివరకూ కూపర్ దేశీయాంగమంత్రిగా విధులు నిర్వహించినప్పటికీ చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడంలో కూడా ఆమె విఫలమయ్యారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఐతే కీర్ స్టార్‌మర్ కూడా పనితీరుకు సంబంధించి ప్రజల్లో వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ఆయనకు ప్రస్తుతం ప్రజల్లో 'పూర్ రేటింగ్' ఉంది. ఉపప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసిన ఏంజెలా రేనర్ సముద్రతీర ప్రాంతంలో 40,000పౌండ్లతో నిర్మించుకున్న లగ్జరీ భవంతికి పన్నులు చెల్లించడంలో విఫలమయ్యారని విచారణలో తేలడంతో ఆమె తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. మంత్రుల పనితీరును మెరుగుపరచడంలో స్టార్‌మర్ విఫలమయ్యారని ప్రతిపక్షం విమర్శించింది.



## జిఎస్‌టి పన్ను సవరణ మైలురాయి

### రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లేఖ




**న్యూఢిల్లీ :** సహకార సమాఖ్య స్ఫూర్తిని నొక్కిచెబుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు ఒక లేఖ రాశారు. వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి) విధానం మైలురాయి సవరణను అమలు చేయడంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రుల మద్దతు, చురుకైన పాత్రకు కృతజ్ఞతలు తెలియజేశారు. పన్నుల రేట్లను పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదనపై రాష్ట్రాలు వాటి అభిప్రాయాలు తెలియజేశాయని, కానీ అది చివరకు సామాన్యుల ప్రయోజనాల కోసమేనన్న విషయాన్ని అంగీకరించడం సంతోషదాయకం అన్నారు. ఈ వారం ప్రారంభంలో జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయానికి రావడానికి ఈ వాదన సహాయపడిందని మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం 'పిటిఐ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. సెప్టెంబరు 22 నుంచి జరుగనున్న సరికొత్త మార్పులో వెన్న నుండి చాక్లెట్లు, షాంపూల నుండి ట్రాక్టర్లు, ఎయిర్ కండీషనర్ల ధరలు తగ్గడం చూడబోతున్నాం. సెప్టెంబరు 3న జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం దీనిని అంగీకరించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వం వహించే ఈ ప్యానెల్‌లో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రాతినిధ్యం వహిస్తాయి. 'నిన్న (శుక్రవారం) నేను రాష్ట్రాలకు చెందిన ప్రతీ ఆర్థిక మంత్రికీ రాసిన లేఖలో కృతజ్ఞతలు తెలియజేశాను. మీరు ఎన్ని తీవ్రమైన వాదనలు చేయవచ్చు కానీ చివరకు కౌన్సిల్ సందర్భానికి తగ్గట్లుగా స్పందించి భారత ప్రజలకు, భారతదేశంలోని ప్రజలందరికీ ఒక గొప్ప ఉపశమనం కలిగించారు. అందువల్ల నేను ఒక లేఖ రాస్తున్నాను' అని నిర్మలా సీతారామన్ చెప్పారు. కౌన్సిల్‌లో పని 'నిజంగా అద్భుతమైనది' అని ఆమె తెలియజేశారు. చాలా ఉత్పత్తులను వర్గీకరించి కేటగిరీలుగా చేయడం వల్ల ఆదాయం కోల్పోతుందనే భయాలు ఉన్నప్పటికీ సాధారణ వినియోగ వస్తువులకు 5శాతం, మిగతా వాటికి మిగతా వాటికి 18శాతం, 12 మరియు 28 శ్లాబులను తొలగించడం ద్వారా జిఎస్‌టి పునర్విభజనకు కౌన్సిల్ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. కేంద్రం చేసిన ప్రతిపాదనను చర్చించడానికి సెప్టెంబరు 3నుండి రెండు రోజుల పాటు ప్యానెల్ సమావేశం కావాల్సి ఉంది. కానీ రోజంతా జరిగిన సమావేశం తర్వాత మొదటిరోజే దానిని ఆమోదించింది. 'అందువల్ల సభ ఉద్దేశం ఏమిటంటే, సామాన్యులకు నిస్సందేహంగా ప్రయోజనం చేకూర్చే ప్రతిపాదన ఇది. దీనికి వ్యతిరేకంగా నిలబడటంలో అర్థం లేదు. చివరికి అందరూ ఒక మంచి కారణం కోసం కలిసి వచ్చారు. నేను నిజంగా చాలా కృతజ్ఞతలు చెబుతున్నాను' అని నిర్మలా సీతారామన్ చెప్పారు. 'రాష్ట్రాలు ఎల్లప్పుడూ అనుకూలంగా ఉంటాయని, పన్ను కోతల తర్వాత వారి ఆదాయ ప్రభావం గురించి మాత్రమే వారి ఆందోళన' అని మంత్రి చెప్పారు. శనివారం నాడు విలేకరులతో మాట్లాడుతూ ఒక ముఖ్యమైన పన్ను సంస్కరణలను అమలు చేయడంలో రాష్ట్రాల సహకారం, సహకార ప్రయత్నాలకు ఆమె కృతజ్ఞతలు వెల్లడించారు. జిఎస్‌టి కౌన్సిల్‌లో రాష్ట్రాల భాగస్వామ్యం, సంస్కరణల పట్ల వారి నిబద్ధతను కూడా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు.

## స్నేహితుడిపై ప్రతీకారం తీర్చుకునేందుకే... ముంబయికి బాంబు బెదిరింపులు

### పోలీసు దర్యాప్తులో వెల్లడి, నిందితుడి అరెస్టు

**ముంబయి :** వినాయక నిమజ్జనం కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్న సమయంలో శుక్రవారం ముంబయికి వచ్చిన బాంబు బెదిరింపు మెయిల్స్ కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు మెయిల్స్ పంపిన నిందితుడిని అరెస్టు చేశారు. అతడిని బిహార్‌లోని పాటలీపుత్రకు చెందిన అశ్వినికుమార్‌గా గుర్తించామన్నారు. గత ఐదేళ్లుగా నోయిడాలో నివసిస్తున్నాడని చెప్పారు. తన స్నేహితుడిపై ప్రతీకారం తీర్చుకోవడానికే నకిలీ బాంబు బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. అతడు వృత్తిరీత్యా జ్యోతిషుడని పేర్కొన్నారు. 2023లో ఓవివాదం విషయంలో అశ్వినీ కుమార్ స్నేహితుడు ఫిరోజ్ అతడిపై కేసు పెట్టాడు. దీంతో అశ్వినీ కుమార్ మూడు నెలలపాటు జైలు శిక్ష అనుభవించాడు. దీనిపై ప్రతీకారం తీర్చుకోవడాని కి నాటి నుంచి ఎదురు చూస్తున్నాడు. శనివారం వినాయక నిమజ్జనానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో ముంబయికి బాంబు బెదిరింపులు వస్తే.. కఠిన శిక్ష పడుతుందనే ఉద్దేశం తో శుక్రవారం తన స్నేహితుడు ఫిరోజ్ పేరుతో ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఉగ్ర బెదిరింపు మెయిల్స్ పంపాడు. దర్యాప్తులో భాగంగా పోలీసులు అశ్వినీ కుమార్‌ను అ దుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి ఏడు మొబైల్ ఫోన్లు, మూడు సిమ్ కార్డులు, ఆరు మెమరీ కార్డ్ హోల్డర్లు, రెండు డిజిటల్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. 34 వాహనాల్లో మానవబాంబులు ముంబయిలోకి ప్రవేశించాయని పేర్కొంటూ శుక్రవారం ముంబయి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు బెదిరిం పు కాల్ వచ్చింది. ముంబయిలోకి 14 మంది పాక్ ఉగ్రవాదులు చొరబడ్డారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 34 వాహనాల్లో మానవబాంబులను ఏర్పాటు చే శాం. 400 కిలోల ఆర్డీఎక్స్ ఉంది. ఇప్పుడు తా ము చేపడుతున్న భారీ పేలుళ్లు మొత్తం ముంబ యి నగరాన్ని కుదిపేస్తాయి అని మెయిల్‌లో పే ర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. లష్కరే జిహాదీ అ నే ఖాతా నుంచి ఈ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు వెల్లడించారు. తాను పాక్‌కు చెందిన జిహాదీ గ్రూ ప్ సభ్యుడిగా మెయిల్ పంపిన వ్యక్తి పేర్కొన్నట్లు తెలిపారు.

## హనీమూన్ హత్యకేసు... 790 పేజీలతో చార్జిషీట్



**షిల్లాంగ్ :** హనీమూన్‌కు తీసుకెళ్లి భర్తను హత్యచేసిన కేసు ఇటీవల దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. రాజా రఘువంశీ హత్య కేసులో మేఘాలయ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం తాజాగా ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇందులో మృతుడి భార్య సోనమ్ సహా ఎనిమిది మంది నిందితులపై పోలీసులు అభియోగాలు మోపారు. సోహ్రా సబ్‌డివిజన్‌లోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ముందు శుక్రవారం పోలీసులు 790 పేజీల చార్జిషీట్‌ను సమర్పించారని తూర్పు ఖాసీ హిల్స్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వివ్కే సియెమ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల ప్రకారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ, అతని భార్య సోనమ్ సోహ్రాకు వెళ్లే ముందు మే 21న షిల్లాంగ్‌కు వెళ్లారు. మే 26న, ఆ జంట కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదు దాఖలైంది. దీనితో సోహ్రా పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్‌ఒటి), ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, ట్రెక్కింగ్ గ్రూపులు, స్థానిక గ్రామస్తులు భారీ గాలింపు ఆపరేషన్ నిర్వహించారు. రోజుల తరబడి గాలింపు జరిపిన తర్వాత, జూన్ 2న సోహ్రాలోని ప్రసిద్ధ వీ సావ్‌డాంగ్ జలపాతం సమీపం ఉంబ్లాయ్‌లోని అర్లియాంగ్ రియాట్ కునోంగ్రిమ్ వద్ద ఉన్న లోతైన లోయ నుండి రాజా రఘువంశీ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సోహ్రా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, తూర్పు ఖాసీ హిల్స్ ఎస్‌పి (నగరం) హెర్బర్ట్ ఖార్కోంగోర్ నేతృత్వంలో ఇతర సీనియర్ అధికారులతో కలిసి ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటి) ఏర్పాటు చేశారు. రాజ్ కుష్వాహాతో సోనమ్ సంబంధం పెట్టుకున్నట్లు దర్యాప్తు అధికారులు కనుగొన్నారు. ఈ ఇద్దరు, ముగ్గురు అద్దె దుండగులతో కలిసి, హనీమూన్ నెపంతో రఘువంశీని చంపడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. సోనమ్ సమక్షంలో లోయ వద్ద ఆకాశ్ సింగ్ రాజ్‌పుత్, విశాల్ సింగ్ చౌహాన్, ఆనంద్ కుర్మి ఈ హత్యను చేశారని పోలీసులు తెలిపారు. దర్యాప్తు ప్రారంభించిన వారంలోపే సోనమ్‌తో సహా ఐదుగురు నిందితులను గుర్తించి వారిని మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారుగా తెలుసుకున్నారు. సోనమ్ రఘువంశీ, రాజ్ కుష్వాహా, ఆకాష్ సింగ్ రాజ్‌పుత్, విశాల్ సింగ్ చౌహాన్ ఆనంద్ కుర్మిలపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103(1) (హత్య), 238 (ఎ) (సాక్ష్యాలు అదృశ్యం), 61(2) (నేరపూరిత కుట్ర) కింద అభియోగాలు మోపినట్లు పోలీసులు ఒక ప్రకటన తెలిపారు. తర్వాత, సాక్ష్యాలను నాశనం చేయడంలో వారి పాత్రకు సంబంధించి మరో ముగ్గురు నిందితులు లోకేంద్ర తోమర్, బల్లా అహిర్వార్, శిలోమ్ జేమ్స్‌లను గ్వాలియర్, షాడోరా, దేవాస్‌లో అరెస్టు చేశారు.

## తెగిన కార్గో రోప్ వే.. ఆరుగురు మృతి



**అహ్మదాబాద్:** కొండపై ఉన్న ఆలయం వద్ద కార్గో రోప్ వే తెగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు సిబ్బంది మరణించారు. పోలీసులు, అ గ్నిమాపక సిబ్బంది, అధికారులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గుజరాత్‌లోని పంచమహల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు శక్తిపీఠమైన పావగఢ్ కొండ ఆల యం వద్ద గూడ్స్ రోప్‌వే వైర్ తెగిపోయింది. కొండపైకి నిర్మాణ సామాగ్రిని తీసుకెళ్లడానికి ఉపయోగించే కార్గో ట్రాలీ కేబుల్స్ తెగిపోయాయి. దీంతో నాల్గవ టవర్ నుంచి ట్రాలీ కిందపడింది. కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అధికారులు అక్కడకు చేరుకున్నారు. సహాయ క చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మరణించినట్లు పంచమహల్ కలెక్టర్ ధృవీకరించారు. మృతుల్లో ఇద్దరు లిఫ్ట్ మెన్లు, ఇద్దరు కార్మికులు, మరో ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. సాంకేతిక బృందంతో ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుపుతామని అన్నారు. మరోవైపు పావగఢ్ ఆలయం సుమారు 800 మీటర్ల ఎత్తులో ఉన్నది. 2,000 మెట్లు ఎక్కడం లేదా కేబుల్ కార్ల ద్వారా భక్తులు, యాత్రికులు శిఖరానికి చేరుకుంటారు. అయితే శనివారం ప్రతికూల వాతావరణం కారణంగా ప్రజలు ఉపయోగించే రోప్ వేను మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు.

## భారత్ పరాక్రమాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన 'ఆపరేషన్ సిందూర్'

### వైమానికదళ ప్రధానాధిపతి అమర్‌ప్రీత్

**చెన్నై:** ఆపరేషన్ సిందూర్ భారతదేశ పరాక్రమానికి నిదర్శనమని వైమానికదళ ప్రధానాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అన్నారు. సూటిగా గురిచూసి ఖచ్చితమైన లక్ష్యాలను ఎంచుకుని, శత్రువును నిర్ణయాత్మకంగా శరవేగంగా దెబ్బతీయడంద్వారా భారత సాయుధబలగాలు తమ శక్తిసామర్థ్యాలు చాటిచెప్పి దేదీప్యమానంగా ప్రపంచానికి ఆ వెలుగులు ప్రసరింపజేశాయన్నారు. భారతదేశ త్రివిధ దళాలమధ్య, ఇతర సాయుధ సంస్థలమధ్య ఉన్న సమన్వయ సామర్థ్యాన్ని ఆపరేషన్ సిందూర్ తెలియజెప్పిందన్నారు. చెన్నైలోని వైమానిక దళాధికారుల శిక్షణాపీఠంలో శిక్షణ ముగించుకుని విధుల్లోకి వెళుతున్న అధికారుల పనితీరును సమీక్షించిన అనంతరం అమర్ ప్రీత్‌సింగ్ వారిని ఉద్దేశించి ప్రసంగించారు. మొత్తం 130 మంది అధికారులు, మరో 25 మంది మహిళా అధికారిణులు భారత సాయుధ సేవా బలగాల్లో వివిధ బాధ్యతల్లోకి వెళ్ళనున్నారు. కాగా తొమ్మిది విదేశాలకు చెందిన 12 మంది మహిళా అధికారిణులు కూడా ఈ శిక్షణాపీఠంలో విజయవంతంగా తమ శిక్షణ పూర్తిచేసుకున్నారు. అంతర్జాతీయ సరిహద్దుల్లో స్నేహసంబంధాలను కొనసాగించడం,పెంపొందించుకోవడంలో భాగంగా వారు ఈ శిక్షణ తీసుకున్నారు. యుద్ధతంత్రంలో శరవేగంగా మార్పులు సంభవించడం, ప్రపంచ వ్యాప్తంగా సైనికపాటవశక్తి ప్రాధాన్యత రోజు రోజుకూ పెరగడం అనే రెండు విషయాలను ఖచ్చితంగా భవిష్యత్తులో సంభవించబోయే విషయాలని, వీటిని గుర్తెరిగి వ్యవహరించాలని ఎయిర్‌చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కొత్తగా విధుల్లోకి వెళ్ళబోయే అధికారులకు హెచ్చరిక చేశారు. "భారత అసమానధీశక్తి వెలుగులను ప్రపంచమంతగా వెదజల్లిన ఒక గొప్ప ఉదాహరణగా ఆపరేషన్ సిందూర్ నిలిచిపోతుందని ఆయన అన్నారు. సాయుధబలగాలలో భవిష్యత్‌లో భాగస్వామ్యం కానున్న ఈ అధికారులందరూ మనదేశ రక్షణ శక్తిని, సమన్వయదృష్టిని చా లా జాగ్రత్తగా అర్థం చేసుకుని మెలగాలన్నారు. శరవేగంగా శత్రువు కదలికలపై మొదట మనమే స్పందించాలన్నారు. ఈ విద్యాపీఠంలో శిక్షణపొందిన అధికారుల సామర్థ్యం, వారి ప్రవర్తన, వారి భవితవ్యం అంతా వారికి శిక్షణ ఇచ్చిన గురువుల కు ప్రతిబింబంగా నిలుస్తుందని గుర్తుచేశారు. శిక్ష ణ పూర్తిచేసుకుని విధుల్లో చేరిన అధికారుల ప్రవర్తన ఈ శిక్షణాపీఠం కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలన్నారు. భూతల,గగనతల,సముద్రతలాల లో ఎక్కడైనా ఏ సేవలను ఏ ఒక్కరూ ఒంటరిగా చే యలేరన్నారు. ఉమ్మడిస్ఫూర్తిగా, ఐక్యంగా బాధ్యతలు పూర్తిచేసే లక్ష్యాన్ని మరచిపోకూడదన్నారు. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోవాలి, మీరు నిర్వహించాల్సిన పాత్రను అర్థం చేసుకోవాలి, ఇతరుల తో కలిసి నిర్వహించాల్సిన పాత్రను గుర్తెరిగి ప్రవర్తించాలి, మాతృదేశంకోసం మీ సర్వశక్తులనూ ధారపోయాలి, చేయగలిగినంతా చేయాలి" అని స్ఫూర్తినిచ్చారు.

## జాతి కలహాలకు మోదీ పరిష్కారం చూపాలి

### మణిపూర్ శాసనభ్యులందరితోనూ సమావేశమవ్వాలి : కాంగ్రెస్

**ఇంఫాల్ :** ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారం మణిపూర్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని శాసనసభ్యులందరినీ కలుసుకుని జాతి కలహాలకు పరిష్కారం చూపాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే తోక్‌చోమ్ లోకేశ్వర్ డిమాండ్ చేశారు. మెయిటీ ప్రజలు జాతీయ రహదారి 2 లోని కాంగ్‌పోక్పి విభాగం గుండా వెళితే ఎవరికీ హాని జరగకుండా ప్రభుత్వం చూసుకోవాలని కోరారు. మెయిటీలు మెజారిటీగా ఉన్న భాగంలోని జాతీయ రహదారిపై కుకిజో ప్రజలను కూడా అనుమతించాలని ఖుంద్రక్‌పామ్ నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నారు. మెయిటీలను జాతీయ రహదారి గుండా వెళ్లడానికి అనుమతించబోమని బహిరంగంగా ప్రకటించిన వారిని అధికారులు అరెస్టు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ వలంటీర్ల సమన్వయ కమిటీతో సహా అనేక కుకి గ్రూపులు కుకి ప్రాంతాలలోకి మెయిటీలను అనుమతించబోమని ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్య చేయడం గమనార్హం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పర్యటన సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్ని సంక్షోభానికి పరిష్కారం చూపించాలని, మొత్తం 59 మంది ఎమ్మెల్యేలను కలుసుకుని ఒక ప్రణాళికను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. జాతి కలహాలకు ఒక పరిష్కారం తీసుకురావాలని లోకేశ్వర్ అన్నారు. మోదీ తన సందర్శనను ఇంఫాల్, చురాచంద్‌పూర్ అనే రెండు ప్రదేశాలకే పరిమితం చేయకూడదని, ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ, కాంగ్‌పోక్పి జిల్లాలతో సహా హింస ప్రభావిత ప్రాంతాలన్నింటినీ ఆయన సందర్శించాలన్నారు. మే 2023 నుండి మెయితీస్, కుకిజో గ్రూపుల మధ్య జరిగిన జాతి హింసలో 260 మందికి పైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులైన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఎన్ బిరేన్ సింగ్ రాజీనామా చేసిన తర్వాత కేంద్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించింది. 2027 వరకు పదవీకాలం ఉన్న రాష్ట్ర అసెంబ్లీని తాత్కాలికంగా నిలిపివేశారు. ఇందిలా కల్లోలం చెలరేగిన తరువాత ఉండగా ప్రధాని మోదీ తొలిసారిగా మణిపూర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఇంఫాల్‌లోని కాంగ్లా కోటలో భారీ వేదికను నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో శుభ్రపరచడం, పెయింటింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. వేదిక ముందు 15,000 మందికి పైగా కూర్చోవడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కాంగ్లా కోట మాజీ మణిపురి పాలకుల సాంప్రదాయ అధికార స్థానంగా పనిచేస్తుంది. వేదిక నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని మణిపూర్ వెలుపల నుండి దిగుమతి చేసుకుంటున్నారు. 100 మందికి పైగా కార్మికులు నిర్మాణ కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారు. అలాగే, భద్రతా సిబ్బంది ఉనికిని పెంచుతున్నట్లు మరొక అధికారి తెలిపారు.

కోటలోకి ప్రవేశించే సందర్శకుల గుర్తింపులను నమోదు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. జాతి కలహాలతో అల్లకల్లోలంగా ఉన్న రాష్ట్రాన్ని ప్రధాని సందర్శించకపోవడంపై ప్రతిపక్ష పార్టీలు బిజెపిపై దుమ్మెత్తిపోస్తున్నాయి.

# డోనాల్డ్ ట్రంప్ నిర్వేదం

ప్రజాపక్షం
07-09-2025, ఆదివారం

బెదిరింపులతో భారత్‌ను సులభంగా లొంగదీసుకుని తమకు లాభసాటి షరతులతో కొత్త వాణిజ్య ఒప్పందం సాధించవచ్చునని, దిగుమతి సుంకాలు భారీగా విధిస్తే భారత్ ప్రధాని, అధికారులు తమ వద్దకు పరుగెత్తుకు వస్తారని భావించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడు నిర్వేదంలో పడ్డారు. ఆయన అనుకున్నట్లు భారత్ లొంగుబాటు ప్రదర్శించలేదు. ఆగస్టు 25,26 తేదీల్లో వాణిజ్య చర్చలకు ఢిల్లీ రావలసిన అమెరికా ప్రతినిధివర్గం పర్యటన రద్దు చేసుకుంది. ఈలోపు ట్రంప్ ఏకపక్షంగా భారత్‌నుంచి దిగుమతులపై సుంకాన్ని10 నుంచి 25 శాతానికి పెంచారు. ఉక్రేన్‌పై యుద్ధం కొనసాగిస్తున్న కారణంగా రష్యాను ఆర్థికంగా కృంగదీసి లొంగదీసుకునేందుకు రష్యానుంచి ఏ దేశం క్రూడాయిల్ కొనుగోలు చేయరాదని యూరోపియన్ యూనియన్ విధించిన ఆంక్షను ఉల్లంఘించి భారత్, రష్యా ఇస్తున్న తక్కువ రేటుకు క్రూడ్ ఆయిలు కొని, శుద్ధిచేసి లాభానికి ఎగుమతి చేస్తున్నదని ట్రంప్ ఆరోపించారు. ఆగస్టు 22లోపు కొనుగోలు బంద్ చేయకపోతే భారత్ దిగుమతులపై మరో 25శాతం సుంకం విధిస్తానన్న ట్రంప్ ద్వితీయ హెచ్చరికకు భారత్ స్పందించలేదు. 22వ తేదీ నుంచి మొత్తం 50శాతం సుంకాలు అమలులోకి వచ్చాయి. బ్రిక్స్‌కు నాయకత్వం వహిస్తున్న బ్రెజిల్ ట్రంప్ 50 శాతం సుంకాలకు గురైన మరో దేశం.

ఇంతలో ట్రంప్‌పై ఇంట, బయట రెండు పిడుగులు పడ్డాయి. ఒకటి, ట్రంప్ ఎమర్జెన్సీ అధికారాలు ఉపయోగించి భారత్ తదితర దేశాలపై సుంకాల పెంపు చేయటం రాజ్యాంగ విరుద్ధమని అమెరికా అప్పీల్స్ కోర్టు తీర్పు చెప్పింది. ట్రంప్ ప్రభుత్వం దానిపై సుప్రీంకోర్టుకు వెళ్లింది. రెండు, చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సభ సందర్భంగా చైనా–రష్యా–భారత్ నేతల సంభాషణలు, స్నేహ–సహకారాలు, వాణిజ్యం పునరుద్ధరణ, పెంపుదల నిర్ణయాలు ట్రంప్‌ను ఇబ్బందిలో పడేశాయి. ఆసియాలో చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను నిలబెట్టేందుకు రెండు దశాబ్దాలుగా చేసిన కృషి ట్రంప్ మూర్ఖత్వంతో నేలపాలైందని స్వదేశంలో రాజకీయ, దౌత్యవర్గాలనుంచి విమర్శలు ఉత్పన్నమైనాయి. ట్రంప్‌కు తీసిపోని ఆయన వాణిజ్య సలహాదారు పీటర్ నవర్రో భారత్‌పై అవాకులు చవాకులు పేలుతున్నారు. ఇదంతా కడుపు మంట వెళ్లగక్కటమే. అమెరికా కోరుకుంటున్నట్లు భారత వ్యవసాయ, పాడిపరిశ్రమ మార్కెట్లను, లఘు మధ్యస్థాయి పారిశ్రామిక ఉత్పత్తుల మార్కెట్ల ద్వారాలను వారి ఉత్పత్తులకు తెరిచి మన దేశంలోని సామాన్య ప్రజలకు నష్టం కలగజేస్తే దోస్తీ, లేకపోతే దూషణలు అనే ధోరణి అమెరికా పెత్తందారీతనానికి నిదర్శనం.

ఎస్‌సిఒలో భారత్ వైఖరి ట్రంప్ ఊహించనిది. ''భారత్, రష్యాలను నిగూఢమైన, కారునలుపు చైనాకు కోల్పోయామని అనిపిస్తోంది. అవి కలిసికట్టుగా దీర్ఘకాలం సౌభాగ్యవంతమైన భవిష్యత్ కలిగి ఉండుగాక'' అంటూ ఆయన నిర్వేదం, వ్యంగ్యంతో కూడిన ఉక్రోసం వ్యక్తం చేశారు. ఇది కేవలం వాణిజ్యానికి సంబంధించిన విషయమే కాదు. ప్రపంచ రాజకీయాల్లో అమెరికాకు వ్యతిరేకమైన మొగ్గు. అంతేగాక వచ్చే సంవత్సరం అమెరికన్ కాంగ్రెస్ ఎన్నికలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. భారత్‌తో సంబంధం పునరుద్ధరణకు ట్రంప్ తపిస్తున్నట్లున్నది. భారత్ కూడా తన 'వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి' పరిధిలో అమెరికాతో సత్సంబంధాలను అభిలషిస్తున్నది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వ్యాఖ్య దీన్ని సూచిస్తోంది : పరస్పర ప్రయోజనాలు, ప్రజాస్వామిక విలువలు, ప్రజల మధ్య సంబంధాలలో వేళ్లానుకుని ఉన్న సమగ్రమైన విశ్వ వ్యూహాత్మక భాగస్వామ్యం మా మధ్య ఉంది'' అని అన్నారాయన. ట్రంప్ బెదిరింపులకు భారత్ ప్రతిఘటన అనేక ఇతర దేశాలకు బలం చేకూర్చింది.

బ్రెజిల్ భారత్–రష్యా–చైనా, దక్షిణాఫ్రికాతో కూడిన బ్రిక్స్ కూడా బలమైన బహుళపక్ష అంతర్జాతీయ వేదికగా విస్తరిస్తున్నది. అందువల్ల ట్రంప్ ఒంటెత్తుపోకడలు, దూకుళ్లు ప్రతిఘటనకు గురికాక తప్పదు. ఉక్రేన్ యుద్ధ విరమణకు రష్యాకు హెచ్చరికలు చేయటం కాదు, కయ్యాన్ని పెంచుతున్న ఇయు దేశాలను అదుపు చేయాలి. అలాగే గాజాలో నరమేధం సాగిస్తూ గాజాను పూర్తిగా ఆక్రమించుకునే ఇజ్రాయిల్‌ను వెనక్కు లాగాలి. దుందుడుకుతనం ఇకపై చెల్లదు – ట్రంప్ కూడా పాఠాలు నేర్చుకుంటేనే అమెరికా ఆధిక్యత కొనసాగుతుంది.

# తెలంగాణ రాజకీయ వైతాళికుడు రావి నారాయణ రెడ్డి

## నేడు 34వ వర్ధంతి



కందిమళ్ళ ప్రతాప రెడ్డి
కార్యదర్శి,
తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు
98490 8212

నిజాం నిరంకుశ మతపక్షపాత ఫ్యూడల్ పరిపాలనకు వ్యతిరేకంగా బావుటా ఎగరవేసి, తెలంగాణా గ్రామీణ రైతులలో, శ్రమజీవులలో నూతన చైతన్యం కలిగించిన ప్రజానాయకుడు. పీడిత తాడిత ప్రజల ప్రాథమిక హక్కుల కోసం సమాజంలో అట్టడుగున పడివున్న హరిజన గిరిజన వెనుకబడిన తరగతుల ప్రజల సముద్ధరణ కోసం అహోరాత్రులు అవిరళ కృషి చేసిన నిస్వార్థ నిరాడంబర దేశభక్తుడు, సంఘ సేవకుడు రావి నారాయణ రెడ్డి ఆధునిక తెలంగాణ పోరాట చరిత్ర రావి నారాయణ రెడ్డి జీవితంతో ముడిపడి వున్నది. రావి నారాయణ రెడ్డి 34వ వర్ధంతి సందర్భంగా ఆ వీరుడిని స్మరించుకుందాం.

***రావి నారాయణ రెడ్డి గురించి ఒక సభలో:***
***సుప్రసిద్ధ కవి ఉత్పల సత్యనారాయణ:***

*ఏ యెడ నుంచి వచ్చితివి ఈ నగరమ్మున కోరి నాయనా*
*ఈయననే ఎరుంగవుర? ఈ మహనీయుడు*
*యావదాంధ్ర దేశీయుల కాప్తబంధువుర*
*శీలనమున్నతుడైన రావి నారాయణ రెడ్డి*
*మన చింతనకీర్తికి మారుపేరురా అన్నారు.*

1978లో ఆంధ్ర విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సందర్భంగా ముగ్గురు ప్రముఖులు రావి నారాయణ రెడ్డి, నందమూరి తారాకరామారావు, అక్కినేని నాగేశ్వరరావులకు 'కళాప్రపూర్ణ' గౌరవ డాక్టరేటు ప్రదానం చేసింది.

ఆంధ్ర మహాసభ నాయకులు, తెలంగాణ స్టేట్ కాంగ్రెస్ వ్యవస్థాపకులు, హరిజనోద్యమ నిర్వాహకులు, దేశ సేవాదురంధరులు, ప్రజాహిత పరతంత్రులు, ప్రజాప్రతినిధులు –

***ప్రశంసాపత్రంలో ఆచార్య బి.హెచ్. కృష్ణమూర్తి***

***నూతన చైతన్యం రగిలించిన కలిగించిన ప్రజానాయకుడు***

నిజాం నిరంకుశ నియంతృత్వ పరిపాలనలో అణగిమణగి అట్టడుగున పడిపోయిన అమాయక ప్రజల జనహృదయంలో నవచైతన్యము, మానవ చైతన్యము కలిగించి, నిద్రాణము దరిద్రాణము అయిన జాతిని జాగృతము చేసిన మహావ్యక్తి, నిజాం మహాశయుని నిరంకుశ పాలనను ప్రతిఘటించి స్టేట్ కాంగ్రెస్ నిర్వహించిన సత్యాగ్రహోద్యమం ప్రథమ దళమునకు నాయకత్వం వహించి, దాస్యశృంఖలాలు ఛేదించుటకు శంఖారావము పూరించిన ప్రజానాయకుడు, అజ్ఞాన తిమిరాంధకారమును పటాపంచలు చేసి సమాజంలో రాజకీయ స్పృహను సృజించిన ప్రజారథసారథి రావి నారాయణ రెడ్డి.

**ఎం.ఎల్. నరసింహారావు (ఆర్.ఎన్. జన్మదినం సందర్భంగా, ఆంధ్రభూమి)**

**గుండెను కాగడాగా వెలిగించిన రావి నారాయణ రెడ్డి**

'తెలంగాణా విముక్తికోసం సాయుధ పోరాటానికి సారథ్యం వహించి, గుండెను కాగడాగా వెలిగించి, గెరిల్లా సైనికులకు వెలుగు దారి చూపించి, నిజాం రాచరికాన్ని తుదముట్టించడానికి ఉప్పెనలా పైకెగసి, విజయఢంకా మ్రోగించి, పల్లెపల్లెల్లో రైతాంగ పోరాటాన్ని ఫెను తుఫానులా హెూరెత్తించిన విప్లవయోధుడు, కర్మవీరుడు 'కళాప్రపూర్ణ' కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి'

***ఆచార్య పేర్వారం జగన్నాథం (ఆంధ్రప్రభ 16.9.90)***

***తెలంగాణ వీరయోధులకు తలమానికం రావి నారాయణ రెడ్డి***

1983, జూన్ 4వ తేదీన ఆర్.ఎన్. 75వ జన్మదినోత్సవాన్ని వారి అభిమానులు వేడుకగా జరిపారు. ఆ సందర్భంగా రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయపక్షాలకు, సామాజిక జీవితానికి చెందిన ప్రముఖుల అభిప్రాయాలు వారి మాటల్లో: 'తెలంగాణా వీరయోధులకు తలమానికం రావి నారాయణ రెడ్డి, భగతిసింగ్ స్మరించుకున్నట్లే తెలంగాణా పోరాట యోధులు చిరకాలం ప్రజల హృదయాల్లో నిలిచిపోతారు'.

***– భగత్ సింగ్ సహచరుడు విజయకుమార్ సిన్హా***

'అన్ని రాజకీయపార్టీలు భూసంస్కరణలు గురించి మాట్లాడుతున్నాయంటే అది రావి నారాయణ రెడ్డి భూమికోసం నడిపిన పోరాటమే కారణం. మా అందరి గురించి ఏమన్నా అనొచ్చుగానీ, రావి నారాయణరెడ్డి గురించి ఎవ్వరూ ఏమనలేరు. కమ్యూనిస్టులే కాదు అందరూ ఆయనను అభిమానిస్తారు. నేను ముఖ్యమంత్రి అయినంక వారి కోసం ఏదో చెయ్యాలనుకున్నా కానీ ఇంత తొందరగా దిగిపోతానను కోలేదు'.

***– టి. అంజయ్య, మాజీ ముఖ్యమంత్రి***



'ఇప్పుడు నేను రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడిగా ఉన్న. ఈ కాంగ్రెసును మొదట స్థాపించిన వ్యక్తి రావి నారాయణరెడ్డి. ఆయన నడిపిన పోరాటం ఇప్పటికీ నల్లగొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ గుట్టలు రావి నారాయణ రెడ్డి, రావి నారాయణరెడ్డి అంటున్నయ్. కానీ మీ స్వప్నం నెరవేరలేదు. యియ్యాల గాకున్నా 10, 20, 30 ఎన్నేండ్లకైనా నెరవేరుతుంది'

***– జి. వెంకటస్వామి***

'కమ్యూనిస్టు నాయకుడే కాదు తెలంగాణాకు మార్గదర్శి. మాలాంటి వాళ్ళందరినీ రంగంలో దింపిన ఉద్యమకారుడు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు, వ్యక్తులు, ప్రజలు ఆయనను అభినందించడానికి కారణం వారు నిర్వహించిన పాత్ర'.

**– నల్లమల గిరిప్రసాద్**

'ప్రజలు చరిత్ర నిర్మిస్తారు. చరిత్రను నాయకులు సృష్టిస్తారు. నాయకులు ప్రజలను ముందుకు నడిపించడానికి తోడ్పడతారు. అదేవిధంగా తెలంగాణా పోరాటకాలంలో వందనినాదాలు వినిపిస్తే అందులో 50 నినాదాలు రావి, బద్ధం గురించే వుండేవి. ప్రపంచ చరిత్రకెక్కిన తెలంగాణా పోరాటంలో రావి నారాయణ రెడ్డి పాత్ర ప్రముఖమైనది'.

***యం.ఓంకార్ (సి.పి.ఐ. (యం))***

'విప్లవ వైతాళికుడు, ఆంధ్రప్రదేశ్ నిర్మాతగా నా మనసులో నిలిచిపోయాడు. ఒక యుగపురుషుడిగా చరిత్ర సృష్టించాడు'

**– ఎస్. జయపాల్ రెడ్డి (అప్పటి జనతాపార్టీ నాయకుడు)**

ఇది ఒక చారిత్రక సత్యానికి సాక్ష్యం, చారిత్రక సత్యాలను 'ముఖ్యంగా తెలంగాణా వీరోచిత పోరాటాన్ని ఏ పార్టీ నడిపిందో, ఆ పార్టీ ప్రతిష్టను పైకి రానీయకుండా,అణచడమో, రాజకీయ కక్షతో చూడటం, సరియైనది కాదు. ఆ చారిత్రక పోరాటాన్ని నడిపింది కమ్యూనిస్టు పార్టీ, దాని అగ్రనాయకుడు రావి నారాయణ రెడ్డి' అని తాను గీసిన చారిత్రక తెలంగాణా సాయుధ పోరాట చిత్రపటాన్ని ఆర్.ఎన్.కు సమర్పించారు.

***– ప్రఖ్యాత చిత్రకారుడు శేషగిరిరావు***

కాంగ్రెస్ నాయకులు, ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ మీర్ అక్బర్ అలీ ఖాన్, కాంగ్రెస్ నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రజాకవి కాళోజీ నారాయణరావు, తెలంగాణా పోరాట యోధులు ఆరుట్ల రామచంద్రారెడ్డి, కార్మిక నాయకుడు బి.ఎస్. మహాదేవ్ సింగ్, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు దేవులపల్లి రామానుజరావు, కోదాటి, మహారాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు చంద్రగుప్త చౌదరి, ఆహ్వానసంఘ ప్రముఖులు సిహెచ్. రాజేశ్వరరావు, బూర్గుల నర్సింగరావు, ఓంకార్ ప్రసాద్, ఆలంకుంద్‌మిరి, డా॥పరంజపే, రావి నారాయణ రెడ్డి త్యాగ నిరతిని కొనియాడారు.

1946–1948 నిజాం రాజరిక పాలన అంతంచేసి, హైదరాబాద్‌ను భారతదేశంలో విలీనం చేయాలని సాగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా గుర్తించాలని, ఆ పోరాట యోధులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. 1975లో ఢిల్లీలో ఇందిరాగాంధీని కలిసి ఒప్పించి, ఆ పోరాటాన్ని భారత స్వాతంత్ర్యంలో భాగంగా, సమరయోధులకు పెన్షన్ అంగీకరింపజేశారు. ఫలితంగా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల వేలాదిమంది సమరయోధులుగా గుర్తింపబడి పెన్షన్ పొందారు, పొందుతున్నారు.

ప్రధానంగా తెలంగాణా సాయుధ సమరంలో అసువులు బాసిన నాలుగువేల మంది అమరవీరులకు హైదరాబాదులో స్మారకచిహ్నాం నిర్మించాలని. ఆ పోరాటంలో పాల్గొని త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులకు గుర్తింపు, పెన్షన్ మంజూరు కోసం కృషి చేశాడు.

1991 సెప్టెంబరు 7 రాత్రి అరుణతార ఆర్.యన్. నిష్క్రమించాడు. మరుసటి రోజు ఉదయం ఆ విషాద వార్తను పత్రికలు పతాక శీర్షికలతో ప్రచురించాయి.

సమరం మార్గంగా సంఘర్షణ ఊపిరిగా తనువు మనసు బడుగు బతుకులకు కానుకగా సహస్ర మాసాధికంగా బతికినటువంటి 'రావి' ఇప్పుడు లేడు. అయినా, ఆయన ఉంటాడు.

కానీ ఆ మహనీయుడికి ప్రభుత్వాలు మారినా గుర్తింపు రాలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రావి నారాయణ రెడ్డికి స్థల చిహ్నాంగా ఎల్ నగర్ నిర్మాణం జరుగుతున్న టిమ్స్ ఆసుపత్రికి రావి నారాయణ రెడ్డి నామకరణం చేయాలని, హైదరాబాద్ నగరంలో ముఖ్యమైన కేంద్రంలో ఆయన కాంస్య విగ్రహం నెలకొల్పాలని కోరుతున్నాం.


### రావి నారాయణ రెడ్డి జీవితంలో ప్రముఖ ఘట్టాలు :

- 1930 కాకినాడ సత్యాగ్రహంలో పాల్గొన్నాడు.
- 1930 ఆంధ్ర మహాసభ వ్యవస్థాపక సభ్యులు
- 1932 హైదరాబాదు రాష్ట్ర హరిజన సేవాసంఘ్ కార్యదర్శిగా మహాత్మాగాంధీచే నియామకం
- 1934 అఖిల భారత కార్యవర్గ సభ్యుడు
- 1934 గాంధీజీని హైదరాబాదుకు ఆహ్వానించి హరిజన సేవా సంఘ్ నిధివసూలు, బహిరంగసభ నిర్వహించి రూ.20,000/లు స్వయంగా నిధిని అందజేశాడు. హైదరాబాదు రాష్ట్రంలో 100కు పైగా హరిజన విద్యార్థులకు హాస్టళ్లు స్థాపించారు.
- 1938 జూలై హైదరాబాదు రాష్ట్రంలో స్టేట్ కాంగ్రెస్ నిర్మాణానికి సారథ్యం వహించిన తెలంగాణ ప్రథమ వ్యక్తి. స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం ఎత్తివేయాలని సాగిన సత్యాగ్రహ ఉద్యమానికి తెలంగాణా ప్రాంత ప్రథమ సత్యాగ్రహ నాయకులు.(గోవిందరావు నానల్ మహారాష్ట్ర, రావినారాయణరెడ్డి తెలంగాణ, రామకృష్ణ దూత్ కర్ణాటక ప్రాతినిధ్యం వహించారు.) సత్యాగ్రహిగా మూడు నెలల జైలు శిక్ష
- 1938 హైదరాబాదు రాష్ట్రంలో రాజకీయ ఉద్యమానికి రూపకల్పన చేసినవారు మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన... స్వామి రామానంద తీర్థ, తెలంగాణలో రావి నారాయణ రెడ్డి అగ్రగణ్యులు.
- 1941 ఆంధ్రమహాసభ అధ్యక్షుడిగా ఎన్నిక
- 1944 రెండవసారి ఎన్నిక
- 1946 భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి రద్దుకోసం, మహోద్యమానికి నేతృత్వం. 700 ఎకరాల స్వంతభూమిలో 500 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ.
- 1947 తెలంగాణ సాయుధ సమరానికి సారథ్యం
- 1952 నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం నుండి జవహర్ నెహ్రూ కంటే దేశంలో అత్యధిక ఓట్లతో విజయం.
- వినోబాభావే భూదాన ఉద్యమానికి ప్రేరణ రావి నారాయణ రెడ్డి
- నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం, ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను ఒప్పించి సాధించిన వ్యక్తి.
- 1954 విశాలాంధ్ర నిర్మాణం కోసం ఉద్యమం, ఉద్యమ కార్యదర్శిగా కృషి
- 1957 ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికై ప్రతిపక్ష ఉపనాయకుడిగా, కొంతకాలం ప్రతిపక్ష నాయకుడి గా, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతల నిర్వహణ.
- 1967 స్వచ్ఛందంగా ప్రత్యక్ష రాజకీయ పదవుల విరమణ.
- 1978 ఆంధ్ర విశ్వవిద్యాలయంచే గౌరవ డాక్టరేట్ పొందారు. స్వాతంత్ర్య సమరయోధుడుగా భారత రాష్ట్రపతి వెంకటరామన్ చేత తామ్రపత్రం.
- 1986 తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టును స్థాపించి అధ్యక్షులుగా బాధ్యతల నిర్వహణ
- 1991 సెప్టెంబర్ 7న పరమపదించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు.
- 1992 రావినారాయణ రెడ్డి మరణానంతరం భారతప్రభుత్వం అత్యుత్తమ 'పద్మవిభూషణ్' బిరుదు ప్రకటించి, 1992 ఫిబ్రవరి 25న భారత రాష్ట్రపతి వెంకట్రామన్ రావి నారాయణ రెడ్డి సతీమణికి అందజేశారు.

# సిబిఐ... సస్పెన్షన్... సోషల్ మీడియా...

వారం రోజులుగా రాష్ట్ర రాజకీయాలలో జరుగుతున్న పరిణామాలు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్)ని ఇబ్బందులకు గురిచేస్తున్నవి. కాళేశ్వరం ప్రాజెక్టుపై దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని ప్రభుత్వ నిర్ణయం, బిఆర్ఎస్ నుంచి ఎంఎల్‌సి కవిత సస్పెన్షన్, తరువాత సోషల్ మీడియా వార్ గులాబీ పార్టీని ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. శనివారం(ఆగస్టు 30న) సాయంత్రం మొదలై గత ఆదివారం తెల్లవారుజాము 2:38 గంటల వరకు కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ నివేదికపై శాసనసభ చర్చించింది. చివరలో కాళేశ్వరం ప్రాజెక్టు మూడు బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, అవినీతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిబిఐ దర్యాప్తునకు ఇస్తున్నట్లుగా అనూహ్య నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో అంతర్‌రాష్ట్ర అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ ఏజెన్సీలు ఉన్నందున దర్యాప్తును సిబిఐకి అప్పగించడం సముచితమని భావిస్తున్నట్లు వెల్లడించారాయన. నిజానికి సుమారు 20 మాసా ల సుదీర్ఘ కసరత్తు అనంతరం సుమారు 665 పేజీలతో జస్టిస్ ఘోష్ సమగ్ర నివేదిక ఇచ్చారు. అందులో అవకతవకలపై పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్ల పాత్రను పేర్లతో సహా నిర్ధారించడమే కాకుండా, నాటి ముఖ్యమంత్రి కెసిఆర్, ఆయన మంత్రివర్గ సహచరులు హరీశ్ రావు,ఈటల రాజేంద్రలను కూడా బాధ్యులుగా చూపి, వారిపై చట్టంలో పేర్కొన్న విధంగా చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. అయితే, ప్రభుత్వం ఈ నివేదిక ఆధారంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) లేదా ప్రత్యేక కోర్టు లేదా, సిఐడి లేదా ఎసిబి ఆధ్వర్యంలో తదుపరి చర్యలకు ఉపక్రమిస్తుందనే భావన నెలకొంది. తన నిర్ణయాన్ని వెల్లడించడానికి ముందుగా నివేదికను శాసనసభలో చర్చకు ఉంచి, శాసనసభాపక్ష నాయకుల అభిప్రాయాలను ప్రజాస్వామ్య బద్ధంగా తీసుకుంది ప్రభుత్వం. అధికారేతర పక్షాలు ప్రభుత్వం ఏమి చేస్తుందో ముందుగా చెప్పాలని కోరాయి. సహజంగానే ప్రతిపక్ష బిఆర్ఎస్ తరుపున మాట్లాడిన సీనియర్ సభ్యులు టి.హరీశ్‌రావు ఆ నివేదిక ను తిరస్కరిస్తూ, అది చెత్త నివేదిక అని కొట్టిపారేశారు.







## రాజధాని సందడి

**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

గతంలో సిబిఐ దర్యాప్తునకు డిమాండ్ చేసిన బిజెపి పక్షాన శాసనసభా పక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి చర్చలో పాల్గొంటూ కమిషన్ పేరుతో నీరుగార్చాక సిబిఐకి ఇచ్చి ఏమి లాభమన్నారు. చివరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిబిఐ దర్యాప్తునకు ప్రకటన చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. గతంలో విద్యు త్ కొనుగోలుపై వేసిన కమిషన్ తమకు కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్‌లోని 8 బి, 8 సి కింది నోటీసు ఇచ్చిందని కోర్టుకు ఎక్కిన బిఆర్ఎస్, కాళేశ్వరం విషయంలో 8బి, 8 సి కింద నోటీసులు ఇవ్వలేదని కోర్టుకు ఎక్కిన తీరును ఆయన ఎండగట్టారు.

ఘోష్ కమిషన్ నివేదికను సభ ముందుంచకముందు నుంచే బిఆర్ఎస్ దాని ఆధారంగా చర్యలు తీసుకోవద్దంటూ కోర్టుకు ఎక్కినప్పటికీ, చివరకు సిబిఐ దర్యాప్తును అడ్డుకోలేకపోయింది. చివరకు కాళేశ్వరం అక్రమాల బంతి రాష్ట్ర ప్రభుత్వం తన వైపు నుంచి కేంద్ర ప్రభుత్వం కోర్టులోకి వేసేసింది. అయితే, ముందే సిబిఐకి అప్పగించి ఉంటే, ఘోష్ కమిషన్ తీసుకున్న 20మాసాల సమయం కలిసొచ్చేది కదా అని కమలనాథులు ప్రశ్నిస్తున్నారు. తాము సిబిఐకి అప్పజెప్పడం ద్వారా బిఆర్ఎస్ విషయంలో కేంద్ర బిజెపి ఎలా వ్యవహరిస్తుందో ప్రజలకే తేటతెల్లమవుతుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఆ రెండు పార్టీల అంతర్గత సహకారం బట్టబయలవుతుందని భావిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ, సిబిఐ దర్యాప్తునకు అప్పగించడమనేది బిఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టే అంశమే. ఎందుకంటే సిబిఐని కేంద్ర ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న బిజెపి ఏ రకంగా ఆయుధంగా వాడుకుంటుందో దేశ వ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు కోడై కూస్తున్నాయి. ఇప్పుడు బిఆర్ఎస్‌ను తమ చెప్పుచేతల్లోకి తీసుకొని, తాము బలపడేందుకు బిజెపి చూస్తుందని రాజకీయ విశ్లేషకులు గత ఉదంతాల ఆధారంగా అంచనా వేస్తున్నారు.

ఇక కాళేశ్వరంపై సిబిఐ ఎంక్వయిరీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మరుసటి రోజే అమెరికా నుంచి వచ్చిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కుమార్తె కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కెసిఆర్‌కు కాళేశ్వరం అవినీతి మరక అంటడానికి కారణం హరీశ్‌రావు, సంతోష్‌రావులేనని ప్రత్యక్ష ఆరోపణలు చేయడం ద్వారా బిఆర్ఎస్ శ్రేణులను దిగ్భ్రాంతికి గురి చేశారు. మరుసటి రోజే ఆమెపై బిఆర్ఎస్ సస్పెన్షన్ వేటు వేయడం, ఆ వెంటనే కవిత తన ఎంఎల్‌సి సభ్యత్వానికి, బిఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడం చకచకా జరిగిపోయాయి. ఇక బిఆర్ఎస్‌లో అంతర్గత యుద్ధం ఒక్కసారిగా రెచ్చకెక్కడం మొదలైంది. కవిత రాజీనామా చేసిన వెంటనే ఆమెపై బిఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం మొదలైంది. యూట్యూబ్ ఛానల్‌లో ఆ పార్టీ నాయకులు, విశ్లేషకులు వ్యక్తిగతంగా కవితపై సున్నితమైన అంశాల ప్రస్తావన చేయడంతో ఒక్కసారిగా వైరం ముదిరింది.

**కలకలం సృష్టిస్తున్న కవితక్క అప్‌డేట్స్**

తాజాగా కవితక్క అప్‌డేట్స్ పేరుతో ఉన్న ''ఎక్స్'' ఖాతాలో పోస్టులు సంచలనం సృష్టిస్తున్నాయి. 15 రోజుల్లో పలు సంచలన విషయాలను బైటపెడతామని, ఇప్పటికే గతంలో జరిగిన రెండు అంశాలను అందులో పోస్ట్ చేశారు. అందులో ఒకటి ట్రాక్టర్ల కుంభకోణానికి, మరొకటి బిఆర్ఎస్ ఎంఎల్‌ఎల టూర్‌కు సంబంధించిన విషయాలు. అవి సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. గతంలో ప్రత్యర్థి పార్టీలు ఆరోపణలు చేసినప్పటికీ, తాజాగా ''ఎక్స్'' వేదికగా వస్తున్న అప్‌డేట్స్ పోస్టులలో పెడుతున్న నిర్దిష్ట సమాచారం పాత ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా ఉం ది. అయితే, కవిత తన తండ్రి కెసిఆర్, సోదరుడు కె.టి.రామారావులను పల్లెత్తు మాట అనకుండా జాగ్రత్త పడుతూ, పార్టీలో కీలక స్థానాలలో ఉన్న వ్యక్తులను లక్ష్యంగా తన రాజకీయ యుద్ధం చేస్తున్నారు. ఇదంతా ఎటు దారితీస్తుందోననే ఆందోళన బిఆర్ఎస్ శ్రేణులలో వ్యక్తమవుతోంది. ఒక విధంగా బిఆర్ఎస్ ముప్పేట దాడిని ఎదుర్కొంటోంది. ఈ పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్న బిజెపి, త్వరలోనే రంగంలో దిగేందుకు అడుగులు వేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా పరిణామాలను మరింత అప్రమత్తతతో గమనిస్తోంది.




## కొత్తరకం సెలవు!




సెలవు పెట్టడానికి చాలా మంది ఉద్యోగులు పడే పాట్లు అన్నీ ఇన్నీకావు. చనిపోయిన వారినే పదేపదే చంపుతుంటారు. హఠాత్తుగా ఏదో ఒక అనారోగ్యం వచ్చిపడిందని అంటా రు. ఒక్కోసారి అకారణంగానే ఆఫీసుకు వెళ్లాల ని అనిపించదు. అలాంటప్పుడు, ఇలాంటి ఒక కారణాన్ని వెతుక్కుంటారు. ఉద్యోగుల్లో ఉన్న ఈ మనస్తత్వాన్ని చైనాలోని ప్రముఖ రిటైల్ వ్యాపారి యూ డాంగ్ లై గుర్తించాడు. అందుకే, 'అన్‌హ్యాపీ లీవ్' అనే కొత్త స్కీమ్‌ను ప్రవేశపెట్టాడు. మానసికంగా సంతోషంగా లేని కారణంగా ఉద్యోగులు ఏడాదికి 10 రోజుల సెలవు తీసుకోవచ్చు. దీని కోసం మేనేజర్ లేదా అధికారి అనుమతి అవసరం లేదు. 'మీరు మానసికంగా ఉత్సాహంతో లేకపోయే, ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదు' అనేది డాంగ్ లై సూత్రం. అతని రిటైల్ చైన్ చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో ఉంది. అతని సంస్థలో సుమారు 7,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ సంస్థ కస్టమర్ సర్వీస్, ఉద్యోగుల సుఖసంతోషాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. ఇక్కడ ఉద్యోగులకు రోజుకు 7 గంటల పని మాత్రమే ఉంటుంది. వారాంతంలో శని, ఆది సెలవు రోజులు. దీనికి అదనంగా సంవత్సరానికి, వారివారి అర్హతను బట్టి 30 నుంచి 40 రోజుల సెలవు ఉంటుంది. లూనార్ న్యూ ఇయర్‌కు ప్రత్యేకంగా 5 రోజుల సెలవు ఉంటుంది. చైనా లో విస్తృతంగా అమలవుతున్న 996 సంస్కృతికి డాంగ్ లై వ్యతిరేకిస్తున్నాడు. 996 అంటే, ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ, వారానికి 6 రోజుల పని. అయితే, ఈ విధానం ఉద్యోగుల మానసిక, శారీరక సమస్యలకు కారణమవుతుందని డాంగ్ లై అంటున్నాడు.

## నిజమైన మృత్యుంజయుడు



సాధారణంగా ఏదైనా ఒక ప్రమాదం నుంచి బయటపడిన వాడిని మృత్యుంజయుడు అంటారు. కానీ, నిజానికి ఈ పదం ఇస్మాయిల్ అజిజికి మాత్రమే అతికినట్టు సరిపోతుంది. టాంజానియా దేశానికి చెందిన ఒక సాధారణ వ్యక్తి, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వైద్య శాస్త్రానికి సవా ళ్లు విసురుతున్నాడు. ఒకటికాదు.. రెండుకాదు.. ఏకంగా ఆరు పర్యాయాలు అతను మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అతని కుటుంబ సభ్యులకు తేల్చిచెప్పారు కూడా. కానీ, ప్రతిసారీ అతను కొన్ని రోజుల్లో మళ్లీ బతికి బట్టకట్టాడు. నమ్మడం కష్టమేగానీ, ఇది ముమ్మాటికీ నిజం. మొదటి ఘటనలో అజిజి మరణించినట్టు నిర్ధారించిన వైద్యులు, అతని శరీరాన్ని మార్చురీకి పంపారు. అక్కడి నుంచి శవాన్ని తీసుకెళ్లడానికి వచ్చిన కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారిని ఆశ్చర్యానికి గురి చేస్తూ అజిజి కళ్లు తెరిచి చూశాడు. ఆ విధంగా మొదటిసారి బతికాడు. అది కాకతాళీయమని, వైద్యులు పొరబడ్డారని అంతా అనుకున్నారు. తర్వాత కొంతకాలానికి అతనికి మలేరియా సోకింది. వ్యాధి ఎంతకూ తగ్గలేదు. వైద్యులు అతను మరణించినట్టు చెప్పారు. మృతదేహాన్ని దహన సంస్కారాల కోసం అతని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. కానీ, ఆశ్చర్యకరంగా అతను లేచి కూర్చున్నాడు.

## పిఎస్‌బిలలో పని ఒత్తిడి!



ప్రభుత్వ రంగ బ్యాంకులు (పిఎస్‌బి)లో పని ఒత్తిడి పెరిగిందని, ముఖ్యంగా అధికారులు ఈ సమస్యను బాగా వేధిస్తున్నదని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గత దశాబ్దకాలంలో 500 మందికిపైగా పిఎస్‌బి అధికారులు ఆత్మహత్య చేసుకున్నారన్న సమాచారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఫైనాన్స్, ఇన్సూరెన్స్ వంటి రంగాలతోపాటు, బ్యాంకింగ్ రంగం కూడా తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. పిఎస్‌బిలో ఉన్నత పదవుల్లో ఉన్నవారు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న ఘటనను గమనించకపోవడం దుర్మార్గం. దీనిని వ్యక్తిగత సమస్యలతో ముడిపెట్టడం ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దకపోవడం అన్యాయం. ప్రముఖ బ్యాంకింగ్ విశ్లేషకుడు తమాల్ బందోపాధ్యాయ వ్యాసం ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించినప్పటికీ, పరిష్కరించే ప్రయత్నాలు జరగడం లేదు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖగానీ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగానీ స్పందిస్తున్న దాఖలాలు లేవు. రోజురోజుకూ పెరుగుతున్న టార్గెట్లు ఉద్యోగులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. ఒక్కో బ్రాంచ్‌కి నాలుగు నుంచి ఆరుగురు మాత్రమే ఉంటున్నారు. దీనితో ఎక్కువ సమయం పని చేయాల్సి వస్తున్నది. ఫలితంగా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇఎఎస్ఇ సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను భారీగా తగ్గించింది. దీంతో పలు ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖలలో ఉద్యోగుల కొరత పెరిగింది.

**– బిఎస్ఎస్ మైత్రేయి**

## వసతిగృహ విద్యార్థులను మనపిల్లలుగా భావించాలి

నాగర్‌కర్నూల్ ఆర్‌డిఓ కడం సురేష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** వసతిగృహ విద్యార్థులపట్ల ఆత్మీయంగా ఉంటూవారి అభివృద్ధికి తోడ్పడాలని నాగర్‌కర్నూల్ ఆర్‌డిఓ కడం సురేష్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బిసిబాలుర వసతిగృహన్ని సందర్శించారు. వసతిగృహంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దూరప్రాంత విద్యార్థులకు వసతిగృహాలు విజ్ఞానాన్ని అందించే దేవాలయాలని అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈసౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని విద్యపై శ్రద్ధపెట్టి అభివృద్ధిలోకి రావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను మన పిల్లలుగాభావించి వారికి మంచిచెడులు చెప్పాలని వార్డెన్ పోలశివయ్యకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. వ్యాధులకాలంకావున విద్యార్థులు భోజనంచేసే డైనింగ్‌హాల్, నిద్రించే గదులు, విద్యార్థులువాడే టాయిలెట్స్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని కొండారెడ్డిపల్లి అభివృద్ధిపనులను శనివారం జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిపనులను నాణ్యతప్రమాణాలతో అత్యంత వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విజయ్‌కుమార్, కల్వకుర్తి ఆర్‌డిఓ జనార్ధన్‌రెడ్డి, ఎల్‌డిఎం శ్రీనివాసులు, వివిధశాఖల జిల్లా అధికారులు, మండలశాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శోభాయాత్ర, బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జనం శోభయాత్ర సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ బందోబస్తును పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ చౌక్ నుండి సరఫ్ బజార్, గుడ్ లక్ కమాన్, బహార్ పేట్, పల్లా హనుమాన్ దేవాలయం వరకు ఫుట్ పెట్రోలింగ్ చేస్తూ భద్రత ఏర్పాట్లను పరిశీలించి బందోబస్తు సంబంధించి పోలీస్ అధికారులకు భద్రతాపరమైన సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. గణేష్ శోభయాత్ర సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని శోభ యాత్రకు వచ్చే భక్తులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని, విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సంయమనం పాటించాలని అధికారులకు సూచించారు. గణేష్ నిమజ్జనం సజావుగా అయ్యేటట్లు చూడాలని పోలీసు అధికారులకు తెలిపారు. ఎస్పీతో పాటు డీఎస్పీ ఎన్. లింగయ్య, సీఐ లు శివ శంకర్, సైదులు, ఎస్సై వెంకట్వేర్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు



**ప్రజాపక్షం/మక్తల్:** గణేష్ నిమజ్జనం పూర్తయ్య వరకు పోలీసులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏమరపాటు ఉండారదని, గణేష్ శోభయాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని మక్తల్ సిఐ రామ్ లాల్ తెలిపారు. మక్తల్ మండల కేంద్రంలో గణేష్ శోభయాత్ర, నిమజ్జనం సందర్భంగా బందోబస్తుకొచ్చిన పోలీసు అధికారులు సిబ్బందికి స్థానిక పోలీస్ స్టేషన్లో మక్తల్ సిఐ రామ్ లాల్ హద్రతాపరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మక్తల్ సిఐ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సజావుగా జరిగేలా చూడాలని ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. విధుల్లో ఉండే పోలీసులు తమ కేటాయించిన ప్రదేశంలో ఉంటూ సంయమనం పాటించాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలని సిఐ తెలిపారు. గణేష్ శోభయాత్ర జరిగే సమయంలో కాలనీలో ప్రత్యేక పోలీసులను నియమించి దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని మక్తల్ గణేష్ నిమజ్జనం బందోబస్తులో 150 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు భాగ్య లక్ష్మి రెడ్డి, అశోక్ బాబు, రేవతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా మంచినీటి ట్యాంకు ఏర్పాటు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలపరిధిలోని గంగారం గ్రామంలో పురాతన ఆంజనేయస్వామి దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛందంగా మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ తోట శ్రీనివాసులు తన సొంత డబ్బులు 80వేల సొంతనిధులతో మంచినీటి ట్యాంకును కట్టించడంపై గ్రామస్తులు అభినందించారు. శనివారం నీటి ట్యాంకును భక్తుల సౌకర్యార్థం ప్రారంభించిన మాజీసర్పంచ్ గుండ్లపల్లి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు సేవాభావాన్ని కలిగి ఉండాలని కోరారు. గ్రామ అభివృద్ధిలో తనవంతుగా తోటశ్రీనివాసులు పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. శ్రీనివాసులును ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ గ్రామఅభివృద్ధికి తమవంతు పాత్రను పోషించి గ్రామంలో వివిధరకాల ప్రజల అవసరాలకోసం మంచి కార్యక్రమాలు చేపడితే బాగుంటుందని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ గట్టయ్య, గ్రామస్తులు తోటచంద్రయ్య, ఆంజనేయులు, రవి, పిట్టల తిరుపతయ్య, చెన్నారెడ్డి, బొందయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

## ఆపదలో అండగా సిఎంఆర్ఎఫ్



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు అధిక వైద్య ఖర్చులు భరించలేని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఆదుకునే చేయిగా మారింది. శనివారం మండల కేంద్రమైన వీపనగండ్లలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిల్లో మెరుగైన వైద్య చికిత్స పొందిన పలువురికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య, రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, పార్టీ నాయకులు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మనిషాకు రూ.25వేలు, నక్క సంగెంకు రూ.19వేలు, జొల్లు పెద్ద గంగయ్యకు రూ.9వేలు, బాలపీర్‌కు రూ. 33,500, నక్క శేషయ్యకు రూ. 29వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నక్క విష్ణు, నాయకులు రవీందర్ రెడ్డి, మహేష్ నాయుడు, గోపి, యాదయ్య, రాజు, వెంకటేష్, గంగులు, వెంకటయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

## 10న హెల్త్‌క్యాంపు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జర్నలిస్టు యూనియన్ టియుడబ్ల్యూజే ఐజెయు ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులకువారి కుటుంబాలకు మెగాహెల్త్‌క్యాంపు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు పి.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విలేకరుల ఆరోగ్య పరిరక్షణ కోసం యశోద ఆస్పత్రివారి సంపూర్ణ సహకారంతో ఈనెల10న నిర్వహించబోయే ఉచిత మెగాహెల్త్‌క్యాంపును జర్నలిస్టు కుటుంబాలందరూ యూనియన్లకు అతీతంగా సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. జిల్లాకేంద్రంలోని సాయిగార్డెన్స్‌లో ఉదయం 9గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

# అభివృద్ధికి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ ఇవ్వండి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నర్వ/నారాయణపేట్ :** నర్వ మండల అభివృద్ధి కోసం అధికారులు కేవలం ఆలోచనలకే పరిమితం కాకుండా, డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ డిపిఆర్ రూపంలో ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్లో నిర్వహించిన సమీక్షా సమావేశలో ఆస్పిరేషన్ నర్వ బ్లాక్ కింద చేపట్టాల్సిన ఉత్తమ పద్ధతులు, వినూత్న ప్రాజెక్టులు, కొత్త ఆలోచనలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో నర్వ మండలంలోని అన్ని శాకల అధికారులు పాల్గొన్నారు. కీలక పనితీరు సూచికలు సాధించడానికి ప్రతి శాక తమవంతుగా చురుకైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతుల ఆదాయం పెంచే ప్రాజెక్టులు, స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధి కల్పించే కార్యక్రమాలు, నీటి సంరక్షణ చర్యలు, పాడి ప్రాజెక్టులు వంటి అంశాలపై అధికారులు విస్తృతమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని ఆమె ఆదేశించారు. ఇక విద్య, వైద్య, పశు సంవర్ధక, వ్యవసాయ శాఖల అధికారులు తమ శాఖల్లో అత్యవసరమైన, ప్రజలకు ఉపయోగపడే సృజనాత్మక ప్రాజెక్టులను రూపకల్పన చేసి, డిటైల్డ్ రిపోర్ట్ రూపంలో ఇవ్వాలని కలెక్టర్ ప్రత్యేకంగా ఆదేశించారు. ''అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరే ప్రాజెక్టులను ప్రాధాన్యతగా తీసుకోవాలి'' అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిఆర్డిఓ మొగలప్ప, డిఎస్వైఓ, డిఎఓ తదితరులు పాల్గొన్నారు.

**అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలి**

బాలికలు ఆరోగ్యం, స్వీయరక్షణకై మెళకువలు కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాయామంతో పాటు స్వీయ రక్షణకై మెళకువలు కలిగి ఉండాలన్నారు. పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. విద్యావకాశాలను సద్వినియోగం చేసుకొని, ఉన్నత లక్ష్యాలను నెరవేర్చుకుంటూ గమ్యాలను చేరుకోవడానికి



దృఢ సంకల్పం కలిగి ఉండాలన్నారు. అమ్మాయిలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాలికా విద్య పై ప్రత్యేక శ్రద్ధ, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలనకు బాధ్యతాయుతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, జిల్లా సంక్షేమాధికారి (ఇంచార్జి) రాజేందర్ గౌడ్, డిప్యూటీ డీయంఎచ్ఓ డా॥ శైలజ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యాదమ్మ, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నర్సింహులు, జెండర్ స్పెషలిస్టులు అనిత, నరసింహ, భారతి, ప్రాజెక్టు అసోసియేట్ నరేష్, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ లక్ష్మి కాంత్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# విద్యా నాణ్యత పెంచినప్పుడే విద్యార్థులకు మేలు



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** విద్యా నాణ్యత పెంచినప్పుడే విద్యార్థులకు మేలు జరుగుతుంది అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం లోని హన్వాడ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి బోధనాభ్యసన సామాగ్రి మేళా, ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా విషయాలపైన విద్యార్థులకు ఆసక్తి కలిగించడంతో పాటు వినూత్న బోధనా పద్ధతులను ప్రోత్సాహించాలని ఆయన సూచించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం విద్యాభివృద్ధికి, పాఠశాలలో మౌలి వపతులు కల్పనకు కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గం లోని ప్రతి పాఠశాలలో శతశాతం ఫలితాలు సాధించాలని అలాగే మీమీ పాఠశాలల నుంచి కనీసం ఒక్కరైనా మప మహబూబ్‌నగర్‌లోని ఐఐఐటి కళాశాలలో సీటు సంపాదించాలని ఆయన చెప్పారు. మన నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో ఐఐఐటి కళాశాలలో సీటు సాధిస్తారనే నమ్మకం విశ్వాసం నాకు ఉందని మీరు నా నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాగా చదువుకోవాలని ఆయన చెప్పారు.

**విద్యార్థులు ఇంటి దగ్గర చదువుకోవాలి**

విద్యార్థులు తమ ఇంటి దగ్గర చదువుకోవడానికి వారి తల్లిదండ్రులు మంచి వాతావరణం కల్పించాలని ఆయన సూచించారు. విద్యార్థుల పైన ఎలాంటి ఒత్తిడి లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన ఉందని చెప్పారు. ఈ ఒక్క సంవత్సరం కష్టపడి ఇష్టంగా చదువుకొంటే మంచి భవిష్యత్తు ఉంటుంది అని ఆయన విద్యార్థులకు చెప్పారు. మీరు నాకు తిరిగి ఇవ్వాల్సింది కేవలం ఉత్తమ ఫలితాలు మాత్రమే అని చెప్పారు. మీ అందరూ జీవితంలో స్థిరపడితే మీ తల్లిదండ్రులతో పాటు సంతోష పడడానికి నేను సిద్ధంగా ఉంటానన్నారు. అనంతరం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం అనంతరం మండల స్థాయి బోధనిభ్యాసన సామాగ్రి టిఎమ్ఎల్ మేళా ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, డిసిసి ప్రధాన కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్, చెన్నయ్య, సుధాకర్, వెంకటయ్య, షబ్బీర్ హుసే, బొట్టు శ్రీను, శ్రీను, కేశవులు, తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపిడిఓ యశోద, ఎంఎంఓ దుంకుడు శ్రీనివాస్ ఎంఇఓ గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

## సిపిఐ గ్రామకార్యదర్శి ఎన్నిక



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పెద్దకొత్తపల్లి మండలపరిధిలోని తిర్నాంపల్లి గ్రామ సిపిఐశాఖ సమావేశంలో సిపిఐ గ్రామ కార్యదర్శిని ఎన్నుకున్నారు. ఈశాఖ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఏర్పడిన సిపిఐపార్టీ అన్నివర్గాల ప్రజలకోసం పనిచేస్తున్న ఏకైకపార్టీ సిపిఐ అన్నారు. నిరంతరం ప్రజలనుచైతన్యపరుస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాలుచేస్తూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను హెచ్చరిస్తుందన్నారు. నూతనశాఖను ఏకగ్రీవంగా కమిటిని ఎన్నుకున్నారు. కార్యదర్శి వెంకటస్వామి, సహాయ కార్యదర్శులు శేషయ్య, రామకృష్ణ, కోశాధికారి శివుడు, కార్యవర్గసభ్యులు రంగస్వామి, సత్యం, బిచ్చన్న, సీతయ్య, శివ, లింగస్వామి, నాగేంద్రం, విష్ణులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మండల కార్యదర్శి బొల్లెద్దులశ్రీనివాసులు, సిపిఐజిల్లా కౌన్సిల్‌మెంబర్ కుర్మయ్య, పెద్దకొత్తపల్లి సిపిఐ కార్యవర్గసభ్యులు ప్రకాష్ పాల్గొన్నారు.

## నేడు సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశాలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐపార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశాలను సిపిఐ నాగర్‌కర్నూల్ కార్యాలయం కామ్రేడ్ లక్ష్మణ చారి భవనంలో ఆదివారం ఉదయం 10.30 నిమిషాలకు కార్యవర్గం మధ్యాహ్నం 12గంటలకు జిల్లా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తెలిపారు. ఈసమావేశానికి జిల్లా కార్యవర్గకౌన్సిల్ మండల కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు, సభ్యులందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు. ఈసమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు.

# అక్రమ కేసులతో కార్మిక ఉద్యమాన్ని అనచలేరు

కార్మికులను, వేధిస్తున్న శానిటరీ అధికారులు

రాం నాయక్, నరేందర్‌లను తక్షణమే సస్పెండ్ చేయాలి:

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** కుట్ర పూరిత అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలు కమ్యూనిస్టు కార్మిక సంఘ నాయకులకు కొత్తేమి కాదని, ఎన్ని తప్పుడు కేసులలో ఇరికించాలని చూసిన కార్మిక ఉద్యమాలు ఆగవని మరింత ఉవ్వెత్తున ఎగుస్తాయని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, పి.సురేష్ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ రంగ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కాంట్రాక్టు పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ విభాగాల కార్మికుల పట్ల అక్కడి శానిటరీ అధికారులైన సిహెచ్ఓ రామ్ నాయక్ స్వార్థపూరి ప్రయెజనాల కోసం కార్మికులను చెయ్యని తప్పులకు బాధ్యులుగా చిత్రీకరిస్తూ బలి పశువులగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా శానిటరీ విభాగంలో సూపరిండెంట్, ఇతర అధికారుల పేరు చెబుతూ సిహెచ్ఓ రామ్ నాయక్ సొంత నిర్ణయాలతో కొంతమంది ఎస్‌హెచ్ఓ లను ఉసిగోల్పి కార్మికులను తీవ్రంగా వేధిస్తున్నారని మండిపడ్డారు. సంబంధిత ఏజెన్సీకి సిహెచ్ఓ రామ్ నాయక్ కి చీకటి ఒప్పందం బెడిసి కొట్టిన అసహనంతోనే ఇలా వ్యవహరిస్తున్నాని అన్నారు. కార్మిక సమస్యలపై అడిగిన యూనియన్ నాయకులపై కార్మికులపై ఇష్టానుసారంగా దూషిస్తూ దాడులకు దిగుతున్నారని, కార్మికులను రెచ్చగొడుతూ వీడియోలు తీస్తూ అధికారులకు నిజాయితీగా చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులపై హక్కులు అడిగి యూనియన్ పై వక్రీకరిస్తూ తప్పుడు సమాచారం చేరవేస్తున్నారని అన్నారు. కార్మికులను వేధింపుల గురి చేస్తున్న సిహెచ్ఓ రామ్ నాయక్, ఎస్‌హెచ్ఓ నరేందర్‌లను తక్షణమే సస్పెండ్ చేయాలని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని 650 పడకల అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని లేనిచో ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు బి.చెన్నయ్య, జి.మొగులయ్య, జే.నరసింహ, రంగన్న, అంజి, శ్రీను, శంకర్, యాదయ్య, యాదగిరి, పద్మ, సత్యమ్మ, అలివేల, ఇందిర, సునీత, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహ్మద్ పీర్ బాబాన్ సబ్ ఉర్సు ఉత్సవాలు



**పుల్కల్ :** కుల మతాలకు అతీతంగా ఉర్సు ఉత్సవలలో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని, దేవుని కృపకు పాత్రులవుతాని దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబిద్ హుస్సేన్ సత్తారుల్ ఖాద్రి సాహెబ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పరిధిలోని సింగూర్ గ్రామంలోని దర్గా వద్ద గత రెండు రోజులుగా హజారత్ మహమ్మద్ బాబాన్ షా వలీ.(ర.హ) దాదా హజాద్ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో వివిధ జిల్లాల నుండి భక్తులు భారీ సంఖ్యలో హాజరై పూజలు చేశారు. శనివారం సాయంత్రం పీఠాధిపతిని ఇంటి నుండి గంధం (సందల్) ఒంటెలు, గుర్రాల పైన కూర్చోబెట్టి బ్యాండ్ మేళాలతో గ్రామ పురవీధుల గుండా శోభయాత్ర నిర్వహించారు. భక్తులతో కలసి ఆయన దర్గా వద్దకు చేరుకొని గంధం సంధా ల్, రోజ్ వాటర్, గులాబీ పువ్వులతో దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సాయంత్రం యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించగా 18 టీములు పాల్గొన్నాయి. దీనిలో విజేతలుగా నిలిచిన ప్రథమ బహుమతి సంగారెడ్డి, ద్వితీయ బహుమతి సింగూర్ యువ చైతున్య టీంలకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గా రెడ్డి, దర్గా ఫీఠధాపతి ఇద్దరి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా దర్గా ఇంతియాజ్ సాహెబ్, జహీరాబాద్ దర్గా హరుణ్ సాహెబ్, బోడ్మట్‌పల్లి హషం సాహెబ్, సద్దాం సాహెబ్ కర్ణాటక, గౌస్ సాహెబ్ కర్ణాటక పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గోవర్ధన్, రామచందర్ రెడ్డి, అంజయ్య, సంగమేశ్వర్, వీరారెడ్డి, ఎర్ర గంగారాం, మధుసూదన్, ఎర్ర నాగరాజు, దత్తు, ఎర్ర వెంకట్, మన్నే విజయ్, చెన్నాగౌడ్, ఎర్ర శేఖర్, పి.యదయ్య, దర్గా కమిటీ మెంబెర్స్ సయ్యద్ అజ్మత్, నఖీబ్, ఖయ్యూమ్, ఇస్మాయిల్ సింగూర్ గ్రామ ప్రజలు తదితరులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఉపాధ్యాయుడు సర్వేపల్లి అంతటి గొప్పగా ఎదగాలి



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలను శనివారం ఐడిఓసి సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి హాజరై మాట్లాడారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఒక అధ్యయనమన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి మొదటగా ఆయన ఉపాధ్యాయుడిగా ప్రస్థానం మొదలై అంచలంచెలుగా ఎదిగి దేసానికి ప్రథమ పౌరుడిగా ఉన్నారన్నారు. తమ పుట్టిన రోజును టీచర్స్ డేగా జరుపుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులకు గొప్ప గౌరవం అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం అంటే ఉపాధ్యాయులకు ఇచ్చిన గౌరవమన్నారు. విద్యావ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేసేందుకు ప్రయత్నం చేస్తుందని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయులకు పదోన్నతులు, కొత్త టీచర్ల నియామకం అన్నారు. ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి నూతన విద్యా విధానం తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో వనపర్తి జిల్లా ఉత్తీర్ణత శాతం పెంచాలని, ప్రతి ఉపాధ్యాయుడు మనసు పెట్టి బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, డిఈఓ మహమ్మద్ గని, ఏసిజిఈ గణేష్, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రిని హతమార్చి.. నదిలో పడేసిన ఘనుడు

కారుడిక్కిలో వేసుకొని చింతపల్లిబ్రిడ్జిలో పడేసిన వైనం

కొడుకును అదుపులోకి తీసుకున్న పోలీసులు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** దేశంలోకాని రాష్ట్రంలో ఈమధ్యకాలంలో చాలా దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. ఆస్తికోసం, భూముల కోసం, చిన్న చిన్న గొడవలకు సంబంధించిన రక్త సంబంధాలనుకూడా చూడకుండా మానవులే అడవిలో ఉండే మృగాలుగా మారిప్రాణాలు తీస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఎన్నోచూశాంకాని చిన్నగొడవ కారణంచేత కల్వకుర్తి పట్టణానికిచెందిన బీరయ్య అనే వ్యక్తి కన్నతండ్రి బాలయ్య(70)ను కర్రలతోకొట్టి దారుణంగా చంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే కల్వకుర్తి పట్టణానికి చెందిన వాసవినగర్ కాలనీలో నివాసముంటున్న బాలయ్య వ్యవసాయక్షేత్రంలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజులాగే ఆయన వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నాడు. బుధవారం సాయంత్రం తన కుమారుడు బీరయ్య అక్కడికికారులో వెళ్లి తండ్రితో గొడవపడ్డాడు. దీంతో అక్కడే ఉన్న కర్రలతో విచక్షణరహితంగా దాడిచేసి హతమార్చాడు. దీంతో తండ్రి మృతి చెందిన తర్వాత అతని శవాన్ని కారుడిక్కిలో వేసుకొని చింతపల్లి బ్రిడ్జి వద్ద పడేశాడు. అయితే రాత్రివరకు బాలయ్య పొలంనుండి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెంది మొత్తంవెతికి ఎక్కడ ఆచూకి లభించకపోవడంతో గురువారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ నాగార్జున , ఎస్ఐ మాధవరెడ్డి సిబ్బందితో బాలయ్యపొలం వద్దకు వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న రక్తపు మరకలను గుర్తించి అనుమానంరావడంతో వెంటనే సమీపంలోని సిసి కెమెరాలను పరిశీలించారు. కుమారుడు బీరయ్య దాడి చేసి కారులో శవాన్ని వేసుకొని వెళ్లినట్లు గుర్తించారు. కొడుకు బీరయ్య కోసం పోలీసులు గాలించి శుక్రవారం అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించి తండ్రి బాలయ్యను ఏం చేశాడో పోలీసులు ఆరా తీయగా అసలునిజం బయటపడింది. తండ్రి బాలయ్య మృతదేహాన్ని చింతపల్లి బ్రిడ్జి వద్ద పడేసినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు గత ఈతగాళ్లను రప్పించి మృతదేహంకోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకు మృతదేహం ఆచూకి తెలియలేదు. కొన్ని నెలలకిత్రమే బీరయ్య కుమార్తె ఇంట్లో ఉరివేసుకొని చనిపోవడం జరిగింది. మళ్లీ ఇప్పుడు ఈసంఘటన జరగడంతో పట్టణంలో కలకలంరేగింది. బంధాలు, బంధుత్వాలు అనేభావనకూడా లేకుండా తండ్రిని చంపిన ఘటనగురించి పట్టణప్రజలు చర్చించుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం కొరటికల్లు గ్రామ సమీపంలో గలవాగులో రాత్రి 8.30గంటల ప్రాంతంలో కల్వకుర్తి పట్టణానికి చెందిన బాలయ్య తలలేకుండా మొండెంభాగంతో లభ్యమైంది. కాగా, బాలయ్య కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు.

## జెడ్‌పిహెచ్‌ఎస్ బాయ్స్ విజయం



**ప్రజాపక్షం/మక్తల్:** ధ్యాన్ చంద్ జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని నారాయణపేట జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో మక్తల్ మండలంలోని ఉన్నత పాఠశాలల మధ్య క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. నేడు ఫైనల్ పోరులో జెడ్‌పిహెచ్ఎస్ బాయ్స్ మక్తల్ లిటిల్ యాంగిల్స్ ఇరు జట్ల మధ్య రసవత్తరంగా మ్యాచ్ జరిగింది. చివరికి మూడు పరుగులు తేడాతో జెడ్‌పిహెచ్ఎస్ బాయ్స్ విజయం సాధించడం జరిగింది. రన్నర్స్ గా లిటిల్ ఏంజెల్ మ్యాన్ ఆఫ్‌ది సీరిస్ రామ్ చరణ్, బెస్ట్ బ్యాట్స్మెన్ మనీ, బెస్ట్ బౌలర్ రామ్ చరణ్, విజేత అయినటువంటి ఇరుజట్లను క్రీడా మంత్రి డాక్టర్ వాటికి శ్రీహరి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి వెంకటేష్ శెట్టి, రాష్ట్ర ఫైనాన్షియల్ డైరెక్టర్ లక్ష్మి నారాయణ, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ గణేష్, మాజీ ఎంపీపీ కోళ్ల వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు, వాలీబాల్ కోచ్ రాఘవేందర్, పీడీలు , విష్ణువర్ధన్ రెడ్డి, ఈశ్వర్, నరేష్, రమేష్, భరత్, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్ పీఈటి, పీడీలు పాల్గొన్నారు.

## చాకచక్యంగా గీత కార్మికుడి ప్రాణాలు కాపాడారు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని జనగాం గ్రామంలో శనివారం ఉదయం ప్రమాదం తృటిలో తప్పింది. గ్రామానికి చెందిన కొండూరు చంద్రయ్య కల్లు గీత కార్మికుడు ప్రతిరోజు దినచర్యలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగుతున్న సమయంలో ఒక్కసారి మోకు జారి పడిపోతుండగా అక్కడే ఉన్న ఇతర గీత కార్మికులు యాదయ్య, ఇస్త్రారి, లింగయ్య గీత పనివారల సంఘం అధ్యక్షుడు నాతి కృష్ణయ్యలు అప్రమతమై చెట్టు పైకి ఎక్కి చాకచక్యంగా ప్రాణాపాయం నుండి రక్షించారు. గాయాలు తేలికగా ఉండడంతో ప్రథమ చికిత్స చేసి ఇంటికి పంపించారు. పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు చేరుకొని ప్రమాదం స్థలంలో సహాయం చేశారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామపాలన అధికారులు విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రామపాలన అధికారుల కౌన్సిలింగ్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, అభ్యర్థి సొంత నియోజక వర్గం కాకుండా వేరే నియోజక వర్గంలో ఖాళీల జాబితా ప్రదర్శిస్తూ వారి ఐచ్ఛికాల మేరకు పోస్టింగ్‌లు కేటాయించడం జరుగుతుందన్నారు. నియామక పత్రాలు తీసుకున్న గ్రామ పాలన అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవ్, పరిపాలన అధికారి సుదర్శన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గురి నరసింహ

**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం దేవరకొండ నియోజకవర్గ సమావేశం పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయములో జరిగింది. ఈ సమావేశానికి ఎలిమినేటి హుస్సేన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గురి నరసింహ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకై సెప్టెంబర్ 8న, జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, మండల తహసీల్దార్ కార్యాలయాల ముందు నిర్వహించ తలపెట్టిన ధర్నాలు జయప్రదం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి 2 లక్షల 70 వేల కోట్లు కేటాయించాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజువారి వేతనము 700 రూపాయలు ఇవ్వాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో, మున్సిపాలిటిలో ఉపాధి హామీ పనిని విస్తరించాలని ఆయన డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. కేంద్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల బలహీన వర్గాల పై జరుగుతున్న దాడులను, మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను అరికట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు జరిపి వ్యవసాయ కార్మిక కుటుంబాలకు 12 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వృద్ధాప్య పెంచన్ 6000 చేయాలని, మహిళలకు గృహలక్ష్మి పథకం అమలు చేయాలన్నారు. పేదలకు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని, ఇల్లు లేని వారికి ఇల్లు, స్థలాలు లేనివారికి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని అన్నారు. ప్రమాదవశాత్తు వ్యవసాయ కార్మికులు చనిపోతే వారికి 25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మొగిళ్ళ వెంగలయ్య, కిన్నెర భారీములు, నియోజకవర్గ నాయకులు గంగలి పుల్లయ్య, ఏశమోని మల్లేష్, ఆర్.శంకర్ నాయక్, ఎండి జానీమియా తదితరులు పాల్గొన్నారు.

## చిల్లర రాజకీయాలు మానుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్చుకోలేక బిజెపి,బిఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి విమర్శించారు.శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని వ్యక్తిగతంగా విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నల్లగొండ పట్టణంలోని 1 నెంబర్ వినాయక విగ్రహం వద్ద గణేష్ నిమజ్జనం రోజు బిజెపి జిల్లా అధ్యక్షుడితో పాటు మాజీ ఎమ్మెల్యే వ్యవహరించిన తీరు పట్ల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.వారిద్దరి దిగజారుడు రాజకీయాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కత్తుల కోటి,కుసుకుంట్ల రాజిరెడ్డి,దుబ్బ రూపా అశోక్ సుందర్,బొజ్జ శంకర్, సురిగి వెంకన్న గౌడ్,మామిడి కార్తీక్,గాలి నాగరాజు, కంచర్ల ఆనంద్ రెడ్డి, ఇటికాల శ్రీనివాస్, పిల్లి రమేష్ యాదవ్ ,ఎగ్గడి సుజాత, బొబ్బలి స్వరూప రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదల, సంకల్పంతో లక్ష్యసాధన సులభం

చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ సందర్శించిన జస్టిస్ షమీం అక్తర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** చిన్నారులు కష్టపడి చదివి జీవితంలో మంచి స్థానంలోకి రావాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్ అన్నారు.శనివారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని పానగల్ లో ఉన్న చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ ను వారి గజాల అంజుమ్ అక్తర్ తో కలిసి సందర్శించారు.చైల్డ్ కేర్ సెంటర్ లోని చిన్నారులను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ జీవితం ఘర్షణలతో కూడుకొని ఉన్నదని, ప్రతి ఒక్కరు కష్టపడి చదివితేనే ముందుకు వెళ్తారని, ముఖ్యంగా పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలని అన్నారు. చదువుకునెందుకు ప్రభుత్వం అనేక అవకాశాలు, సౌకర్యాలను కల్పిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని, భారత రాజ్యాంగం చదువుకునే హక్కును కల్పించిందని అన్నారు. దాతల సహకారంతో చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ ను నడిపిస్తున్న నిర్వాహక అధ్యక్షులు శ్యామల నాగసేనారెడ్డిని ఆయన అభినందించారు. ఈ కేంద్రం ద్వారా 500 మందిని చదివించి అభివృద్ధి చేయడం, 43 మంది అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయడం చాలా గొప్ప విషయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్మన్ కృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి,జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంతరెడ్డి, ఎల్ఐసి పాలసీదారుల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కట్ట వెంకట రెడ్డి, సిడబ్ల్యుసి సభ్యులు వెంకన్న,డిపిసి సభ్యులు గణేష్ ,సిడిపిఓ నిర్మల, మేనేజర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

## 9న అప్రెంటిస్ మేళా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కేంద్రంలోని (ప్రభుత్వ ఐటిఐ (బాలికల న్యూ) నందు ఈనెల 9 అప్రెంటిస్ మేళా నిర్వహిస్తునట్లు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ భూక్య శ్రీరాములు తెలిపారు. ఈ అప్రెంటిస్ మేళాలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్,మెకానిక్,డ్రాఫ్ట్ మెన్ సివిల్,ఇన్స్యూస్టుమెంట్ మెకానిక్,మిషినిస్ట్, స్టెన్‌గ్రాఫి ,కోసా,డ్రెస్ కి మికింగ్,వెల్డర్‌లలో ఉత్తీర్ణులు అయిన అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. మేళాలో హేటరో, డిఈసి, మోదులి కానెస్,అడ్వాసరెస్తా ,రెడ్డీస్ ల్యాబ్ లాంటి ప్రముఖ కంపెనీలు పాల్గొనడం జరుగుతుంది. కావున ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి బయోడేటా, ఆధార్ కార్డ్,2పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు,ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్‌తో హాజరై ఈ అవకాశాన్ని సదినియోగం చేసుకోవాలిని కోరారు.

## ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచినా భోజనంలో నాణ్యత ఏదీ?

మోడల్ స్కూల్,జూనియర్ కళాశాల హాస్టల్ తనిఖీ చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/మర్రిగూడ :** ప్రభుత్వం విద్యార్థిలకు మంచి భోజనం పెట్టాలని మెస్ చార్జీలు పెంచినప్పటికీ విద్యార్థులకు పెట్టె భోజనంలో నాణ్యత ఉండడం లేదని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాల వసతి గృహాన్ని ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు.విద్యార్థినుల డార్మెటరీ హాల్, డైనింగ్ హాల్, వంటగది, బాత్రూంలు, లెట్ రూమ్ లు పరిశీలించి నాన్యమైన భోజనం పెడుతున్నారా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోడల్ పాఠశాలను పరిశీలించారు తరగతిగదులు ఆటస్థలం పరిశీలించి మోడల్ పాఠశాల అభివృద్ధికి స్థానిక నాయకులతో కమిటీ ఉంటుందని, వారందరూ వచ్చి మోడల్ పాఠశాలలో ఏ ఏ సమస్యలు ఉన్నాయని విషయాలకు సంబంధించి పరిశీలన చేసి పరిష్కరిస్తారని తెలిపారు. అనంతరం కస్తూరిబా పాఠశాలకు చేరుకొని రూ.1 కోటి 25 లక్షల తన సొంత ఖర్చుతో నిర్మిస్తున్న తొమ్మిది నూతన తరగతి గదులను, 30కి పైగా బాత్రూంలు లెట్ రూమ్ లను, మురుగునీటి వ్యవస్థను పరిశీలించారు.కస్తూరిబా పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభాలను తీగలను వెంటనే తొలగించాలని విద్యుత్ అధికారులను ఫోన్లో ఆదేశించారు... కస్తూరిబా పాఠశాల విద్యార్థినులకు ఆడుకోవడానికి నూతన ఆట స్థలం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను సర్వే చేయించి ఆక్రమణలకు గురికాకుండా చూడాలని అక్కడే ఉన్న రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆట స్థలాన్ని ప్రభుత్వ భూమి ఎంతవరకు ఉంటే అంతవరకు విస్తరించాలని సూచించారు.ఎమ్మెల్యే వెంట డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తోపాటు మండల నాయకులు పాల్గొన్నారు.



## పక్షపాతానికి తావు లేకుండా పనిపై శ్రద్ధ

గ్రామ పాలనాధికారులుగా ఉత్తర్వులు అందుకున్న వారు సోమవారం నాటికి నూరుశాతం విధుల్లో చేరాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ:** గ్రామ పాలన అధికారులు పనిపై పూర్తి శ్రద్ధ వహించి విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. శనివారం ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన గ్రామ పాలనాధికారుల కౌన్సిలింగ్‌కు హాజరై మాట్లాడుతూ గ్రామ పాలనాధికారుల కౌన్సిలింగ్ ను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి పారదర్శకంగా నిర్వహించడం జరుగుతున్నదని, ఎలాంటి సిఫారసులకు ,పక్షపాతానికి ఇందులో తావు లేదని అన్నారు. గ్రామ పాలనాధికారులుగా ఉత్తర్వులు అందుకున్న వారు సోమవారం నాటికి నూటికి నూరు శాతం విధుల్లో చేరాలని కోరారు. అభ్యర్థులందరి సమక్షంలోనే ఖాళీల జాబితా ప్రదర్శిస్తూ వారి ఐచ్ఛికాల మేరకు పోస్టింగులు కేటాయించడం జరుగుతున్నదని, అందువల్ల గ్రామ పాలన అధికారులు వారి ఐచ్ఛికం మేరకు తీసుకున్న పోస్టులలో చేరి శ్రద్ధ వహించి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వానికి రెవిన్యూ శాఖపై ప్రత్యేక శ్రద్ధ ఉందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత గ్రామ పాలన అధికారులపై ఉందన్నారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి ఉన్నారు.

**మున్సిపల్ పట్టణ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి**

తీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఎక్కువ దరఖాస్తులు స్వీకరించే విధంగా మున్సిపల్ పట్టణ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. జాతీయ కుటుంబం ప్రయోజన పథకం కింద లబ్ధి చేకూర్చేందుకు బాగా కృషిచేసిన ఆర్‌డిఓలు, 4 గురు తహసిల్దార్లు,4 ఎంపీడీవోలు,4 గ్రామపంచాయతీ కార్యదర్శులను సన్మానించనున్నట్లు తెలిపారు. ఈనెల 13న జిల్లా స్థాయిలో జాతీయ కుటుంబ ప్రయోజన పథకంపై నిర్వహించే సమావేశంలో ఈ మేరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సన్మానిస్తామని చెప్పారు.శనివారం ఆమె వివిధ అంశాలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లాలో ఇప్పటివరకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 6,000 దరఖాస్తులను ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, మరో నాలుగు వేల దరఖాస్తులను పంపించగలమనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. గడచిన 7,8 సంవత్సరాలలో జిల్లాలో 42,000 మంది కి పైగా చనిపోయినట్లు తమ దగ్గరున్న లెక్కల ప్రకారం తెలుస్తున్నదన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 6న ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా పోలింగ్ కేంద్రాలు,ఓటరు జాబితాలు ప్రచురించాలని, 6 నుండి 8 వరకు అభ్యంతరాల సేకరణ, 9నఅభ్యంతరాల పరిష్కారం,10 న తుది జాబితా ప్రచురించాలని తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జెడ్పీసీఈవో శ్రీనివాసరావు ,ఆర్ డి ఓలు అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి,డి ఆర్ డి ఏ శేఖర్ రెడ్డి, తదితరులు మాట్లాడారు.



## చైన్ స్నాచర్స్ అరెస్ట్... 3తులాల పుస్తెలతాడు స్వాధీనం!



**ప్రజాపక్షం/ హాలియా:** హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల ఒక మహిళ మెడలో మూడు తులాల పుస్తెలతాడును దొంగిలించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసినట్లు మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు, హాలియా సీఐ సతీష్ రెడ్డి, ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ శనివారం తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం మండలంలోని శ్రీనాథపురం స్టేజి వద్ద గత నెల 27వ తేదీ సాయంత్రం గ్రామం వైపు వెళ్తున్న ఒక మహిళ మెడలో నుంచి ఇద్దరు యువకులు పల్సర్ బైక్ పై వచ్చి మూడు తులాల బంగారు పుస్తెలతాడును దొంగిలించినట్లు చెప్పారు. ఈ విషయమై బాధితమైన మహిళ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పుస్తెలతాడు దొంగిలించిన దొంగలను పట్టుకునేందుకు హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం ఎస్సై సాయి ప్రశాంత్ కొత్తపల్లి గ్రామ శివారులో బాలాజీ రైస్ మిల్ దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను పట్టుకుని విచారించగా దొంగతనం చేసినట్లు చెప్పారని తెలిపారు. దొంగతనానికి పాల్పడిన ఇద్దరి యువకులు పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి చెందిన కల్లూరి బ్రహ్మారెడ్డి, మూల మాధవ రెడ్డిలుగా గుర్తించినట్లు చెప్పారు. వీరి నుంచి పల్సర్ బైక్, రెండు మొబైల్ ఫోన్లు, దొంగలు తమ స్వగ్రామమైన చలకుర్తిలో తమ నివాసంలో వారు దొంగిలించిన మూడు తులాల బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన ఇద్దరి యువకులని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసును చేదించడంలో హాలియా సీఐ సతీష్ రెడ్డి, హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్, నిడమనూరు ఎస్ఐ సురేష్, పోలీసులు సురేష్, హరి ప్రసాద్, వెంకటేశ్వర్లు, రమేష్ గౌడ్, హఫీస్, శివరాజ్ ,రైటర్ కృష్ణ పాల్గొన్నారు.



## పూర్తి నష్ట పరిహారం తర్వాతే జాతీయ రహదారి 565 పనులు

నిర్వాసితుల పోరాట కమిటీ నాయకులు డిమాండ్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బాధితులకు పూర్తి నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే జాతీయ రహదారి 565 నిర్మాణ పనులు ప్రారంభించాలని నిర్వాసితుల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం 565 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్వాసితుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గిరికబాయిగూడెం బైపాస్‌లో ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించి నిరసన తెలిపారు. బాధితులకు పూర్తి నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే జాతీయ రహదారి 565 నిర్మాణ పనులు ప్రారంభించాలని నిర్వాసితుల పోరాట కమిటీ గౌరవాధ్యక్షుడు సయ్యద్ హాశం, మాజీ కౌన్సిలర్ ఎండీ సలీం, ఉట్కూరు వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం 565 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్వాసితుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గిరికబాయిగూడెం బైపాస్‌లో ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పానగల్ నుండి సాగర్ రోడ్డు వరకు బైపాస్ నిర్మాణంలో 35 శాతం మంది బాధితులకు నోటీసులు కానీ నష్ట పరిహారం కానీ అందలేదన్నారు. నోటీస్, నష్ట పరిహారం ఇవ్వకుండా శుక్రవారం కాంట్రాక్టర్లు ఉట్కూరు వెంకట్ రెడ్డి సర్వే నంబరులో కోతకు దశకు వచ్చిన వరి పొలాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎక్కడా పనులు పూర్తికాక ముందే పంట పొలాలు ధ్వంసం చేయడం ఏంటని వారు ప్రశ్నించారు. పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని, పంట మీద ఉన్న పొలాలకు కొంత సమయం ఇచ్చి పనులు చేయాలని కోరారు.

## 1140 గ్రాముల గంజాయి పట్టివేత

ఆరుగురు నిందితుల అరెస్ట్

డిఎస్‌పి రాజశేఖర్‌రాజు వెల్లడి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీహార్ నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1140 గ్రాముల గంజాయిని, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరు పరిచి వివరాలు తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు సౌగంద్‌కుమార్ సింగ్, కరణ్‌కుమార్‌లు స్థానికంగా కూలీలుగా పనిచేస్తున్నారని, వీరు గంజాయికి అలవాటు పడి స్థానికంగా గంజాయి సేవించే గాంధీనగర్‌కు చెందిన కుక్కల వంశీ, దైద జగదీష్, తాళ్లగడ్డకు చెందిన షేక్ హైమద్, చైతన్యనగర్‌కు చెందిన జంపాల నిఖిల్‌లను కలుపుకోని ఈజీగా డబ్బులు సంపాదించేందుకు బీహార్ నుంచి తక్కువ రేటుకు గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి మరికొందరికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఈనెల 5న రాంనగర్‌బంధం శివారులోని హనుమాన్ వెంచర్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ ఎం.నాగభూషణ్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐ సైదిరెడ్డి తన సిబ్బందితో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ, ఎస్ఐలతోపాటు కానిస్టేబుళ్లు నల్లగంతుల శ్రీను, గండికోట నరసింహా, బూర వీరబాబు, నిమ్మనగోటి సంధ్య, భీమనపల్లి ప్రసాద్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని అక్రమంగా విక్రయించినా కొనుగోలు చేసినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పనులు వేగవంతం

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం భువనగిరి మండలం వడాయిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మొత్తం ఎన్ని ఉన్నాయని, అవి ఏఏ దశలో ఉన్నాయో సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎందుకు మొదలు పెట్టలేదని కలెక్టర్ అడగగా వాళ్ళకి ఆర్థిక స్థోమత సరిగా లేక మొదలు పెట్టలేదని పంచాయతీ సెక్రటరీ కలెక్టర్‌కు వివరించారు. ఇంటి ప్రారంభానికి వాళ్ల చేతిలో డబ్బులు లేకపోతే స్థానిక మహిళా సంఘాల సభ్యులకు చెప్పి సంఘం నుండి రుణాలు ఇప్పించాలని అన్నారు. ఏఈలు కూడా ఆలస్యం చేయకుండా వెంట వెంటనే ఫోటో తీసి అప్లోడ్ చేస్తే లబ్ధిదారుల అకౌంట్‌లలో వెంటనే డబ్బులు జమ అవుతాయ అన్నారు.



### వినాయక నిమజ్జనం పరిశీలించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/బీబీనగర్ :** గత తొమ్మిది రోజులుగా వివిధ రూపాలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు బీబీనగర్ పెద్ద చెరువు వద్ద ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన క్రేన్ల సహాయంతో వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా శాంతియుతంగా నిర్వహించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఏర్పాట్లను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా విగ్రహాలు తీసుకువచ్చే వారికి సహాయ, సహకారాలు అందించి నిమజ్జనాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తాసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ అధికారులు సీఐ ప్రభాకర్ రెడ్డి, ఎస్సై రమేష్, అమర్ సింగ్, ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## త్వరగా దరఖాస్తుల స్వీకరణ

కేజీబీవీ విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం తిన్న జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/చండూరు:** కుటుంబ పెద్ద చనిపోయిన పరిస్థితుల్లో కుటుంబానికి సహకారంగా జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఒకేసారి 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ పథకానికి అర్హులైన వారిని దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని కోరారు.శనివారం ఆమె చండూరు తహసీల్దార్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 59 సంవత్సరాల లోపు వయసు ఉన్న కుటుంబ పెద్ద ఒకవేళ ఏదైనా కారణం చేత మరణించి ఉంటే జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అతి పెద్ద కుటుంబం అర్హులని, ఈ పథకం కింద అవసరమైన ధ్రువపత్రాలు జతచేస్తూ దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లో వారి కుటుంబ సభ్యుల అకౌంట్లో 20 వేలు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ చండూరు మున్సిపాలిటీలో జాతీయ కు టుంబ ప్రయోజన పథకం దరఖాస్తులను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో దరఖాస్తులను స్వీకరణ వేగవంతం చేయాలని,జాతీయ కుటుం బ ప్రయోజన పథకం పై మున్సిపల్ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువమంది దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. తహసిల్దార్ కార్యాలయంలో జాతీయ కుటుంబ ప్ర యోజన పథకం పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పరిశీలించారు. చండూరు డివిజన్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసి కేజీబీవీ పరిసరాలు, కిచెన్, స్టోర్ రూ మ్, వాష్ ఏరియాను పరిశీలించారు. విద్యార్థుల తో ముఖాముఖి మాట్లాడి వారితో కలిసి మధ్యా హ్న భోజనం చేశారు. చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ మల్లేష్, ఎంపిడిఓ యాదగిరి ఉన్నారు.



# క్రీడ



## చైనాపై విజయం..

### ఆసియా కప్ ఫైనల్లో భారత్

స్వదేశంలో జరుగుతున్న హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశలో దుమ్మురేపిన టీమిండియా.. సూపర్ 4 మ్యాచ్‌లోనూ అదే జోరు చూపించి చైనాకు చెక్ పెట్టింది. శనివారం జరిగిన ఏకపక్ష పోరులో ప్రత్యర్థిని 7–0తో చిత్తుగా ఓడించింది. భారీ విజయంతో హర్మన్‌ప్రీత్ సింగ్ సేన దర్జాగా ఫైనల్లో అడుగుపెట్టింది. నాలుగో ఆసియా కప్ టైటిల్ కోసం దక్షిణకొరియాతో టీమిండియా తలపడనుంది. బిహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా జరుగుతున్న ఆసియా కప్‌లో భారత జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచుల్లో స్వల్ప తేడాతో విజయం సాధించిన టీమిండియా సూపర్ 4లో మాత్రం ఓ రేంజ్‌లో చెలరేగింది. మలేషియాపై గోల్స్ వర్షం కురిపించి 17–0తో జయభేరి మోగించిన హర్మన్‌ప్రీత్ సేన చైనాను కూడా చిత్తు చేసింది. అన్ని విభాగాల్లోనూ సమిష్టిగా రాణించిన భారత జట్టు.. ప్రత్యర్థి డిఫెన్స్‌ను కకావికలం చేసింది.

తొలి అర్థ భాగంలోనే శిలానంద్ లక్రా, దిల్‌ప్రీత్ సింగ్, మన్‌దీప్ సింగ్ తలా ఒక గోల్ చేయడంతో 3–0తో ఆధిక్యం సాధించింది. రెండో అర్థ భాగంలో రాజ్‌కుమార్ పాల్, సుఖ్‌జీత్ సింగ్ చెరొక గోల్ చేసి చైనాపై ఒత్తిడి పెంచారు. దాంతో.. ప్రత్యర్థి జట్టు సభ్యులు గోల్ చేసేందుకు సర్వశక్తులు ఒడ్డారు. కానీ.. ఆఖర్లో అభిషేక్ నైన్ రెండు గోల్స్ కొట్టి భారత్ ఆధిక్యాన్ని 7–0కు పెంచాడు. దాంతో.. హర్మన్‌ప్రీత్ సేన నాలుగో టైటిల్ వేటకు సిద్ధమైంది.

## 28న బిసిసిఐ ఎన్నికలు..

### త్వరలోనే నోటిఫికేషన్ విడుదల!

భారత క్రికెట్ నియంత్రణ మండలి ఎన్నికల తేదీ వచ్చేసింది. సెప్టెంబర్‌లోనే కొత్త కార్యవర్గంను ఎన్నుకోనున్నారు. ఈ ఏడాది జరగబోయే వార్షిక సమావేశం రోజైన సెప్టెంబర్ 28న ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నారు. ముంబైలో ఉన్న బిసిసిఐ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11:30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ మీటింగ్‌లో ఎన్నికల ప్రక్రియ గురించి చర్చించనున్నారు. సెప్టెంబర్ రెండో వారంలో నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలే బిసిసిఐ అధ్యక్షుడి స్థానం నుంచి రోజర్ బిన్నీ వైదొలగాడు. వయసు 70 ఏళ్లు దాటడంతో అతడు బాధ్యతల నుంచి తప్పుకోగా.. కార్యదర్శిగా ఉన్న రాజీవ్ శుక్లా మధ్యంతర అధ్యక్షుడిగా వ్యవహరించనున్నాడు. అయితే.. ప్రస్తుతం బోర్డులోని సభ్యుల పదవీకాలం కూడా ముగియనున్న నేపథ్యంలో సెప్టెంబర్ 18న ఎన్నికలు జరపాలని బిసిసిఐ తీర్మానించింది. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శితో పాటు కోశాధికారి ఎంపిక కోసం ఎన్నికలు జరుగనున్నాయి.

ఈ సమావేశంలో అపెక్స్ కౌన్సిల్.. ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ కోసం గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయడంపై కూడా ఈ సమావేశంలో చర్చకు రానుందని సమాచారం. అపెక్స్ కౌన్సిల్‌లో బిసిసిఐ సాధారణ కార్యవర్గంలోని సభ్యుడు ఒకరు.. భారత క్రికెట్ అసోసియేషన్ నుంచి ఇద్దరు సభ్యులుగా ఉంటారని బిసిసిఐ వర్గాలు చెబుతున్నాయి.



## మౌనం వీడిన బిసిసిఐ!




పదిహేడో సీజన్ ఆసియా కప్ ప్రారంభానికి మరో మూడు రోజులే ఉంది. టైటిల్ కోసం ఎనిమిది జట్లు పోటీ పడుతున్నా అభిమానుల దృష్టంతా భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పైనే ఉంది. సెప్టెంబర్ 14 చిరకాల ప్రత్యర్థుల మధ్య బిగ్ ఫైట్ జరుగనుంది. అయితే.. ఉగ్రవాదులను పోషిస్తున్న పాక్‌తో క్రికెట్ ఏంటీ? అని విమర్శలు వస్తున్న వేళ.. టీమిండియా బాయ్‌కాట్ చేస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. దాంతో.. ఈ హై ఓల్టేజ్ మ్యాచ్‌పై సందిగ్ధత నెలకొంది. దాయాదుల పోరు జరుగుతుందా? లేదా? అనే కథనాలకు ఎట్టకేలకు భారత క్రికెట్ నియంత్రణ మండలి చెక్ పెట్టింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆంక్షలు లేనందున కచ్చితంగా పాక్‌తో టీమిండియా తలపడుతుందని కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు. 'ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను బీసీసీఐ పాటించనుంది. ఐసీసీ, ఆసియా కప్ వంటి టోర్నీల్లో భారత జట్టు ఆడడంపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. భారత్‌కు మిత్రదేశం కాని జట్టుతో కూడా ఆడడంపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు. కాబట్టి.. పలు దేశాలు పాల్గొనే టోర్నీల్లో టీమిండియా అన్ని మ్యాచ్‌లు ఆడుతుంది. ఆసియా కప్ అనేది మల్టీ నేషనల్ టోర్నమెంట్. ఇందులో ఆసియాలోని దేశాలు పోటీపడుతాయి. భారత్‌తో శత్రుత్వం ఉన్న దేశపు టీమ్ కూడా వీటిలో ఉండచ్చు. అయినా సరే.. మా జట్టు బరిలోకి దిగుతుంది. అయితే.. ద్వైపాక్షిక సిరీస్‌ల విషయానికొస్తే మాత్రం శత్రు దేశాలతో క్రికెట్ ఆడే ప్రసక్తే లేదు' అని ఏఎన్ఐ వార్త సంస్థతో సైకియా వెల్లడించాడు.

# ఫోకస్ బిజినెస్



## కుదుటపడుతున్న స్టాక్ మార్కెట్లు!

భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా 90కిపైగా దేశాలను ప్రభావితం చేసిన అమెరికా సుంకాల పెంపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భేటీ, చైనాలో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశం వంటి పలు కారణాలతో ఇటీవల కాలంలో గందరగోళంగా మారిన స్టాక్ మార్కెట్లు ఇప్పుడు కుదుటపడుతున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపనున్న వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) కౌన్సిల్ సమావేశం ముగియడం, గతంలో అనుసరించిన వాధానంలో మార్పులు చేసి, కేవలం రెండు శ్లామ్‌ల తీరుతెన్నులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం జరిగిపోయాయి. గత కొన్ని నెలల్లో, ఇప్పుడే కొంత స్పష్టత వస్తున్నది. కాబట్టి, వచ్చే వారం స్టాక్ మార్కెట్లు కుదుటపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అయితే, స్టాక్ మార్కెట్లను ఇతరత్రా అంశాలు ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదన్న అనుమానాలు కూడా ఉన్నాయి. ఈనెల ఒకటోతేదీ, సోమవారం రోజున బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్ 79,809.65 పాయింట్లు, జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్‌ఎస్‌ఇ)లో నిఫ్టీ 24,426.85 పాయింట్ల వద్ద మొదలయ్యాయి. ఐదవ తేదీ, శుక్రవారం మిలాద్ ఉన్‌నబీ కారణంగా మార్కెట్‌కు సెలవు. దీనితో కేవలం నాలుగు రోజుల ట్రేడింగ్ మాత్రమే జరిగింది. వారాంతంలో మార్కెట్లు ఊరటనిచ్చిన నేపథ్యంలో, సెన్సెక్స్ 80,718.01 పాయింట్లు, నిఫ్టీ 24,734.30 పాయింట్లతో ముగిసింది. వచ్చే వారం పరిస్థితి మెరుగ్గా ఉండవచ్చని అంటున్నారు. కాగా, జిఎస్‌టి కొత్త శ్లాబ్ విధానంపై మదుపరులు ఏ విధంగా స్పందిస్తారన్నది ఆసక్తి రేపుతున్నది.



బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.

## బంగారం ధరలు తగ్గుముఖం!

గత రెండు నెలల నుంచి పసిడి ప్రియులకు చుక్కలు చూపించిన బంగారం ధరలు, వరుసగా రెండు రోజులు ఊరటనిచ్చాయి. శుక్రవారం 76 రూపాయలు తగ్గిన బంగారం ధర, శనివారం ఒక్క రూపాయి తగ్గింది. ఈ తీరు కొంత ఆశాజనకంగా ఉంది. అయితే, మార్కెట్లు ఎప్పుడు ఎలాంటి మలుపు తిరుగుతాయన్నది ఊహించడం కష్టం. ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న వాణిజ్య ఉద్రిక్తతలు పెట్టుబడిదారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అందుకే స్టాక్ మార్కెట్ల కంటే, బంగారంపై పెట్టుబడులు క్షేమమన్న అభిప్రాయం మదుపరుల్లో బలపడుతున్నది. ఫలితంగా బంగారం ధరలు చాలాకాలంగా పెరుగుతునే ఉన్నాయి. ఈవారాంతంలో కొంత తగ్గుముఖం పట్టాయి. శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 10 గ్రాములు బంగారం ధర రూ.1,07,630 వద్ద ట్రేడ్ అయింది. ఇక 100 గ్రాములు బంగారం ధర రూ.100 పెరిగి రూ.10,76,300గా ఉంది. జాతీయ మార్కెట్‌లో 24 క్యారట్ల గ్రాము బంగారం ధర రూపాయి పెరిగింది. ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.10,763 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 9,866, 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ. 8,073గా కొనసాగుతున్నది.

## 'పెట్రో' ఉత్పత్తులపై దాటవేత ధోరణి

పెట్రోలు, డీజిల్ వంటి పెట్రో ఉత్పత్తులను వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) పరిధిలోకి తీసుకురావలన్న డిమాండ్ చాలాకాలంగా వినిపిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. శ్లామ్స్ విధానంలో భారీ మార్పులు చేపట్టినప్పటికీ, ఈ విషయంపై దాటవేత ధోరణినే ప్రదర్శించింది. రాష్ట్రాలు అంగీకరిస్తే, ఈ ప్రతిపాదనను అంగీకరిస్తామన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన, పరిస్థితిని మళ్లీ మొదటికి తీసుకెళ్లింది. 2017లో ప్రారంభమైన జిఎస్‌టి విధానంలో అతిపెద్ద సంస్కరణలను చేపట్టిన కేంద్రం, తాజా రెండు శ్లాబ్‌ల విధానాన్ని 'జిఎస్‌టి 2.0'గా అభివర్ణించింది. అయినప్పటికీ పెట్రోలు, డీజిల్ ప్రసక్తి తీసుకురాలేదు. సెప్టెంబర్ 22 నుంచి కొత్త శ్లాబ్ విధానాలు అమల్లోకి వస్తుండగా, 'ఇండియా టుడే' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్మల పలు అంశాలను ప్రస్తావించారు. పెట్రోలు, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తెచ్చ అంశాన్ని ప్రస్తావించగా, విచిత్రమైన సమాధానం చెప్పారు. జిఎస్‌టి రేటు తగ్గింపుతో సాధారణ ప్రజలకు నేరుగా లాభం చేకూరుతుందని ఆమె స్పష్టం చేశారు. ఏదైనా





కంపెనీ లేదా వ్యాపార సంస్థ పన్ను తగ్గింపు వల్ల వచ్చిన ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించకపోతే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కూడా ఆమె హెచ్చరించారు. నిఘా యంత్రాంగం ఎక్కడా పని చేయడం లేదన్న విషయం తెలిసినప్పటికీ, తగ్గిన పన్నుల విధానాన్ని అమలు చేసే బాధ్యతను వ్యాపారులు లేదా వ్యాపార సంస్థలకే విడిచిపెట్టడంలో ఔచిత్యం ఏమిటో ప్రభుత్వానికే తెలియాలి. కాగా, పెట్రోల్‌డీజిల్ జిఎస్‌టిలో చేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందదని, అయితే, తాజా జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని అజెండాలో చేర్చలేదని వివరించారు. జిఎస్‌టి ప్రవేశపెట్టిన సమయంలోనే పెట్రోల్, డీజిల్‌లను కూడా చేర్చే ప్రయత్నం చేశామని అయితే రాష్ట్రాలు అంగీకరించలేదని ఆమె నెపాన్ని బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపైకి నెట్టారు. ఈసారి జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఆ అంశాన్ని ఎందుకు చర్చించలేదనే ప్రశ్నకు బహుశా ఆమె వద్ద సమాధానం ఉండకపోవచ్చు.



## కడవరకూ కమ్యూనిస్టు పార్టీలోనే

### నారయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివళులు అర్పించిన సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/డిండి :** సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ వడ్డెమాను నారయ్య మృతి సిపిఐ పార్టీకి ఆయన కుటుంబానికి తీరని లోటని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి , సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు అన్నారు. శనివారం నల్గొండ జిల్లా డిండి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో వడ్డెమాను నారయ్య స్వగృహంలో ఆయన పార్థివ దేహంపై ఎర్రజెండాను కప్పి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా కామ్రేడ్ నారయ్య చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ ఎర్రజెండా కప్పుకొని తనువు చాలించడం గొప్ప అదృష్టమని, కామ్రేడ్ నారయ్య కమ్యూనిస్టు పార్టీలో సామాన్య కార్యకర్త నుండి మొదలు కొని ఖానాపూర్ ఉప సర్పంచ్‌గా, టిపి.గౌరారం ఎంపిటిసిగా, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా, సిపిఐ కార్యవర్గ సభ్యులుగా పనిచేశారని ఆయన కుటుంబం ఇప్పటికి కమ్యూనిస్టు పార్టీలోనే ఉండండం గర్వకారణమన్నారు. నారయ్య కమ్యూనిస్టు పార్టీలో చురుగ్గా పాల్గొనేవారని ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పించారు, పార్టీ ఎల్లప్పుడు మీకు అండగా ఉంటుందని అన్నారు. అనంతరం నారయ్యకు నివాళులు అర్పించి, అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ అంతిమ యాత్రలో పాల్గొన్న వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి.మైనొద్దిన్, కాంగ్రెస్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర రావు, సిపిఐ మండల కార్యదర్శులు శ్రీరామదాసు కనకాచారి,దేపా సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు బొల్లె శైలేష్, తిప్పర్తి విజేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, రవీంద్ర శర్మ, వల్లమల్ల అంజనేయులు, ఎలిమినేటి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి వల్లే పెరిగిన హమాలీ రేట్లు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ :** ఎఐటియుసి ఆధ్వర్యంలో దేవరకొండలోని ఎరువుల షాపుల దిగుమతి హమాలి రేట్లు పెంచుకోవడం జరిగిందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర రెడ్డి, జిల్లా ఆధ్యక్షులు నూనె రామస్వామి తెలిపారు. శనివారం దేవరకొండ మార్కెట్ యార్డులో జరిగిన పెర్టిలైజర్స్ షాప్‌ల యాజమాన్యం ఎఐటియుసి హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో పరస్పర అంగీకారం మేరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచుకోవడం జరిగిందని దేవేందర్‌రెడ్డి తెలిపారు. రెండు సవంత్సరాలకొకసారి జరిగే అగ్రిమెంటులో గతంలో ఉన్నటువంటి రేట్లపై 15 శాతం అధనంగా పెంచుకోవడం జరిగిందన్నారు. ఎగుమతి, దిగుమతి హమాలి రేట్లతో పాటు గ్రూప్ ఇన్సూరెన్స్ సాకర్యం, సంవత్సరానికి రెండు జతల బట్టలు ఇవ్వాలని తీర్మానించారు. కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి అండగా నిలబడి నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తుందని అన్నారు. హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి భీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పోరాటాలకు సిద్దం కావాలని వారు పిలుపునిచ్చారు.



# సింగరేణి కార్మికులకు హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ వెల్లడి




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించేందుకు గుర్తింపు సంఘం ఎఐటియుసి చేసిన కృషి మేరకు హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు కు యాజమాన్యం నోటిఫికేషన్ జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో జరిగిన ఎఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి ఆస్పత్రుల నుండి అత్యవసర, మెరుగైన వైద్య సేవల కొరకు కార్మికులను, వారి కుటుంబ సభ్యులను హైదరాబాద్‌లోని ఇతర కార్పొరేట్ హాస్పిటల్స్‌కు పంపిస్తున్న క్రమంలో అక్కడి ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందక, వెళ్లిన పేషెంట్ల నుండి అదనంగా ఆస్పత్రుల యాజమాన్యాలు వివిధ చార్జీల రూపంలో డబ్బులు గుంజుతున్నారని, అదేవిధంగా కార్మికుల జీతాల నుండి మెడికల్ ఖర్చుల కింద కోత విధించడంతో కార్మికులు వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను యూనియన్ దృష్టికి తీసుకరాగా, గుర్తింపు సంఘం ఎఐటియుసి స్పందించి యాజమాన్యంతో హైద్రాబాద్‌లో జరిగిన స్ట్రక్చర్ కమిటీ మీటింగ్‌లో కార్మికులకు ఏటా రూ.500 కోట్లు ఖర్చు చేసినా కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదని అందుకుగాను సింగరేణిచే ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని హైద్రాబాద్‌లో నిర్వహించాలని చర్చల్లో డిమాండ్ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అందుకు యాజమాన్యం స్పందించి ఒక కమిటీని వేసి చర్యలు చేపట్టిందని, అందులో భాగంగానే యాజమాన్యం హైద్రాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నెలకొల్పడానికి అక్కడి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల సంస్థల నుండి ఆసుపత్రుల నిర్వహణపై వారి ఆసక్తిని తెలియచేయాలని కోరుతూ, ఈ నెల నాలుగున వివరాలకై నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన తెలిపారు. సూపర్ స్పెషాలిటీ సంస్థలు అందించిన వివరాల మేరకు ఒక ఆసుపత్రిని సెలెక్ట్ చేసి వారితో లీజు ఒప్పందం గాని, కొనుగోలు గాని చేయాలని యాజమాన్యం సంకల్పించిందని ఆయన అన్నారు. దీనివల్ల సింగరేణి కార్మికులకు వారి కుటుంబాలకు, రిటైర్డ్ కార్మికులకు మరియు అసంఘటిత కార్మికులకు త్వరలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎఐటియుసి పోరాటం వల్లనే హైదరాబాద్ లో యాజమాన్యం సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఏర్పాటు చేస్తుందని, అందుకు స్పందించి నోటిఫికేషన్ జారీ చేసిన యాజమాన్యం కు కార్మికుల పక్షాన గుర్తింపు సంఘం ఏఐటియుసి అభినందనలు తెలుపుతుందని ఆయన అన్నారు. ఇంకా ఈ సమావేశంలో గుర్తింపు సంఘం ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, నాయకులు రమణమూర్తి, వీరాస్వామి, రాజేశ్వరరావు, బండారి మల్లయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వాస్తవ చరిత్ర వక్రీకరిస్తూ బిజెపి గ్లోబల్ ప్రచారం

### సిపిఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సిహెచ్ రాజారెడ్డి పిలుపు

### సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు




**ప్రజాపక్షం / జనగామ :** ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరిస్తూ బిజెపి చేస్తున్న గ్లోబల్ ప్రచారాన్ని నేటి యువత, విద్యార్థులు ఖండించాలని జనగామ మాజీ ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సిహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం గబ్బెట గోపాల్ రెడ్డి భవన్‌లో పార్టీ జిల్లా సమితి సమావేశంలో జీడి ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిహెచ్ రాజారెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో భూమి, భుక్తి, విముక్తి, దున్నేవాడికే భూమి కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. ప్రజల్ని పీడిస్తున్న నైజాం రాచరిక దురంతాలకు వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటంలో నాలుగున్నర వేల మంది చంపబడ్డారని, 10లక్షల ఎకరాల భూమి పంచడం జరిగిందన్నారు. అనేక మంది పోరాటం, ప్రాణ త్యాగం ఫలితంగా నైజాం ప్రభుత్వం 1947 సెప్టెంబర్ 17 హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం ఏయడం జరిగిందని, ఇది కేవలం కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ద్వారా స్థాదించిన విజయమన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 13న జనగామలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు అమరజీవి నల్లా నర్సింహులు విగ్రహం వద్ద నుండి ప్రచార జాతాను ప్రారంభించడం జరుగుతుందన్నారు. నల్లా నర్సింహులు విగ్రహం నుండి బయలుదేరిన జాత విస్నూర్ రాంచంద్రారెడ్డి గుండాల చేత హత్య గావించబడిన షేక్ బందగీ స్థూపం వద్ద నివాళ్లు అర్పించి ధర్మాపురంలోని జాటోత్ మృత వీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించి పాలకుర్తిలోని వీర నారి సాకలి ఐలమ్మ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వయించడం జరుగుతుందన్నారు. అక్కడి నుండి రఘునాథపల్లి మండలంలోని గబ్బెట గ్రామంలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట గెరిల్లా దళాలకు శిక్షణ ఇచ్చిన సెంట్రల్ దళ కమాండర్ గబ్బెట తిరుమల్‌రెడ్డి, మోమన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పోరాట యోధులు స్థూపాల వద్ద బహిరంగ సభ నిర్వయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వారోత్సవాల కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావుతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, జిల్లా నాయకులు సొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, జువారి రమేష్, రావుల సదానందం, పాతూరి ప్రశాంత్, భువనగిరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పోరాట ఫలితంగానే పెరిగిన కొత్త బెనిఫిట్స్ : గన్నారపు

**ప్రజాపక్షం/ వరంగల్ :** ఎఐటియుసి పోరాటాల ఫలితంగానే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయని, ప్రభుత్వం జారీచేసిన జిఒ ప్రకారం భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదంలో మరణించిన వారికి రూ.10లక్షలు, సహజ మరణం పొందిన వారికి రూ. 2లక్షలు ఆర్థిక సహాయం అందించనున్నారని బిల్డింగ్, కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసి) తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజిఒ వల్ల మరణించిన కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని, అలాగే పెళ్లి కానుక, ప్రసవ (డెలివర్) బెనిఫిట్స్ పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని, ఇందుకు కార్మికులు ఎఐటియుసి ఆధ్వర్యంలో ఐక్యంగా ముందుకు వచ్చి ఈ డిమాండ్ కూడా సాధించుకోవాలని కోరారు. సిఎస్‌సి హెల్త్ కేర్ సెంటర్ నుండి టెస్టుల పేరుతో వెల్ఫేర్ బోర్డులోని డబ్బులను వృధా చేయడం జరుగుతుందని, ఎందుకంటే ఈ రిపోర్టుల పేరుతో ఒక్కొక్క కార్మికునికి టెస్టులు ఫ్రీ చేస్తామని చెప్పి హెల్త్ కేర్ సెంటర్‌కు ఒక కార్మికుని పైన రూ. 3500లు హెల్త్ కేర్ సెంటర్ తీసుకోవడం జరుగుతుందని, అందువల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు లేకుండా కార్మిక శాఖ నుండి డబ్బులు వృధాగా ఖర్చులు చేయడం జరుగుతుందన్నారు.ఒక్కొక్కరిపై రూ.3500 పెట్టె ఈ విధానాన్ని రద్దు చేయాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న లేబర్ కార్డుల క్రైమ్‌లను వెంటనే క్లియర్ చేసి అర్హులైన వారికి అందే విధంగా చూడాలని, పెండింగ్‌లో ఉన్న లేబర్ కార్డ్స్ కొత్తగా తీసుకునే కార్డులు అందజేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలోని అన్ని రంగాల కార్మికులతో నెలకు ఒకసారి సమావేశం నిర్వహించి వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. ప్రతి జిల్లా, మండల, పట్టణ ప్రాంతాలలో నగరాలలో గ్రామాలలో లేబర్ అడ్డాల వద్ద మూత్రశాలలు, మంచినీరు లాంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. సహజ మరణాలు, యాక్సిడెంట్ కేసులను ప్రభుత్వం కాకుండా ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పాలనే ఆలోచనను విరమించుకోవాలని, లేకుంటే రాష్ట్రంలో ఉన్న కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంఘటితంగా ఉండి పరిష్కరించుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## గణేష్ లడ్డు వేలంపాటలు



ప్రజాపక్షం/చర్లపల్లి/దమ్మాయిగూడః చర్లపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మి నగర్ కాలనీ గణేష్ ఉత్సవాల సందర్భంగా వేలం వేసిన లడ్డును నాగారం మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షులు కొండ జంగారెడ్డి సుజాత దంపతులు 82 వేలకు పాట పాడి దక్కించుకున్నారు.ఈ లడ్డును అందరి శ్రేయస్సు కోరుతూ పంచుతనాన్ని ఆయన తెలిపారు.దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని బండ్లగూడ రాయల్ యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిని గణేషుని వద్ద పల్లె బాలనర్సింహగౌడ్,సతీష్‌గౌడ్,పల్లె సాయికృష్ణగౌడ్‌లు 2లక్షల 71వేలకు సొంతం చేసుకున్నారు. ఇందులో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## దుబాయ్ నగర నిర్మాణాన్ని మార్గదర్శిగా తీసుకుంటాం

### టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం

ప్రజాపక్షం/కూకట్‌పల్లి :వ్యాపారరంగంలో పెట్టుబడులకు దుబాయ్ భూతల స్వర్గమని, ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో దుబాయ్ నగర నిర్మాణాన్ని మార్గదర్శిగా తీసుకుంటామని నారెడ్కో తెలంగాణ ఉపాధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. శనివారం హైటెక్ సిటీలోని అవాసా హోటల్‌లో అమాజా రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక దుబాయ్ ప్రాపర్టీ ఈవెంట్‌ను నారెడ్కో తెలంగాణ ఉపాధ్యక్షుడు, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం ప్రారంభించారు. ప్రసిద్ధ రాజకీయ జ్యోతిష్యశాస్త్రవేత్త, మిత్రుడు డా. వినీత్ భట్ ఆహ్వానం మేరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ నిర్మాణ రంగంలో హైదరాబాద్ వాసులు ఇప్పుడు దుబాయ్‌లో కూడా పెట్టుబడులు పెట్టొచ్చునని, నిర్మాణరంగంలో రిజిస్ట్రేషన్‌లు కూడా ప్రారంభం అయ్యాయని అన్నారు. ప్రపంచానికి నిర్మాణ రంగంలో తలమానికం దుబాయ్ ఉందని, నిర్మాణ రంగంలో హైదరాబాద్ కూడా దుబాయ్‌తో పోటీపడుతుందన్నారు. వ్యాపార, నిర్మాణ రంగంలో నూతన ఒరవడి సృష్టించడంలో దుబాయ్ ముందుందన్నారు. ఎగ్జిబిటర్లను కలుసుకొని దుబాయ్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్‌లో ఉన్న అవకాశాలు, తాజా గోల్డెన్ వీసా విధానాలు, తెలంగాణ, దుబాయ్ రియల్ ఎస్టేట్ రంగాల పరస్పర అభివృద్ధి గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అమాజా దుబాయ్ ప్రాపర్టీ షో సభ్యులు, జాయెద్ అలీ, సుల్తాన్, మహమ్మద్ అబ్దుల్లా, నౌర్సినే కెబికయే, ఆయా దెర్రాడ్జ్, అబ్దుల్ మజీద్ తెక్కట్, అబాంబ్ యూస్సేఫ్, తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాపక్షం/నాగారంః గణేషుని నిమజ్జన కార్యక్రమం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చెరువులో జోరుగా కొనసాగుతున్నాయి.నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి నిమజ్జన ఏర్పాట్లను నాయకులు,మున్సిపాలిటీ సిబ్బందితో కలసి పరిశీలించారు.నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్,ఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో మెరుగైన సేవలు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నెలకొల్పేందుకు సింగరేణి యాజమాన్యం ముందుకు రావటం వల్ల సింగరేణి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు మేలు జరుగుతుందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. అసోసియేషన్ ప్రతినిధులు దండంరాజు, రాంచందర్‌రావు,ఆళవందార్ వేణు మాధవ్, విజయబాబు, ఉమాకర్, నర్సింగరావు, బంగారు రాజయ్యలు మీడియాతో మాట్లాడుతూ దీని కోసం ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌ల కృషికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల ఆరోగ్య సేవలకు గాను ప్రయివేట్ ఆస్పత్రులకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, ప్రత్యేక ఆస్పత్రి వల్ల మెరుగైన చికిత్సలు త్వరితగతంగా లభిస్తాయన్నారు.


## ఎంపిటిసి ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

ప్రజాపక్షం/ మక్తల్ ః త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాలను శనివారం అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మక్తల్ మండలంలోని సంగం బండ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మొత్తం 4194 మందితో కూడిన ముసాయిదా ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యదర్శి శారద విడుదల చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితా పై అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇవ్వడం జరిగిందన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా స్త్రీలు, పురుషులతో కూడిన ఓటర్ల జాబితాలు అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జి. బలరాం రెడ్డి, నాయకులు చిన్నారెడ్డి, సిద్ధార్థ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సౌకర్యార్థం అంతర్రాష్ట్ర సర్వీసుల ప్రారంభం

### ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి





ప్రజాపక్షం/తాండూరుః ప్రజలు, భక్తుల సౌకార్యర్థం అంతరాష్ట్ర ఆర్టీసి బస్సును కొనసాగిస్తామని తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు ఆర్టిసి డిపో నుండి కర్నాటక రాష్ట్రంలోని గాన్గాపూర్‌కు ప్రత్యేక బస్సు సర్వీసును తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ అంతరాష్ట్ర బస్సు సర్వీసును ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాన్గాపూర్‌లోని దైవ క్షేత్రానికి తాండూరు నుండి ప్రత్యేక బస్సు సర్వీసును ప్రారంభించడం పట్ల ప్రజలు హర్శం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అంతకు ముందు బస్సు స్టాండ్‌లో బస్సుకు ఎంఎల్ఏ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి బస్సును పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి బస్సులో ఎక్కి మొదటి టికెట్ తీసుకుని కొద్ది సేపు బస్సులో ప్రయాణించారు. ఆర్టిసి సంస్థ మహిళ సంఘాలకు ఆర్టిసి బస్సులను మంజూరు చేయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణాగౌడ్, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, రావుఫ్,మాజీ డిపిసి సభ్యులు పట్లోల నర్సిములు,మాజీ కౌన్సిలర్‌లు, డిపోమేనేజర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గోన్నారు.

# బిహెచ్ఇఎల్‌లో తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి

### హైకోర్టు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంట్రాక్ట్ ప్రాతిపదికపై పారా మెడికల్ సర్వీసులో ఉన్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని బీహెచ్‌ఈఎల్‌ను ఆదేశిస్తూ హైకోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. దశాబ్దానికిపైగా పిటిషనర్ల సేవలను పొందుతూ పర్మినెంట్ చేయకపోవడాన్ని తప్పుపట్టింది. వాళ్లను తాత్కాలిక ఉద్యోగులుగానే కొనసాగించడం చెల్లదంటూ బీహెచ్‌ఈఎల్‌ను తప్పుబట్టింది. చట్టబద్ధంగా రూల్స్‌కు అనుగుణంగా కాంట్రాక్ట్ పద్ధతిన నియమితులైన వారిని క్రమబద్ధీకరించాలని తీర్పు చెప్పింది.. సుప్రీం కోర్టు ఉమాదేవి వర్సెస్ కర్ణాటక కేసులోని మార్గదర్శకాల మేరకు పర్మినెంట్ చేయాలని జస్టిస్ నగేష్ భీమపాక ఇటీవల తీర్పు చెప్పారు.

తాత్కాలిక పద్ధతిన నియమితులైనప్పటికీ వాళ్ల సర్వీసులకు మధ్యమధ్యలో గ్యాప్ ఇస్తూ కొనసాగింపు చేయడాన్ని తప్పుపట్టారు. వాళ్ల సేవలు అవసరమని తెలిసే కాంట్రాక్ట్ పద్ధతిలో చాకిరీ చేయించుకోవడం చెల్లదన్నారు. పిటిషనర్లు శాశ్వత నియామకానికి అర్హులేనని, వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. పారామెడికల్ తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా నియామకం చేపట్టకపోవడం చట్ట వ్యతిరేకమంటూ దుర్గాప్రసాద్ సహా 30 మంది వేసిన పిటిషన్‌లో తీర్పు చెప్పారు. పిటిషనర్లను తాత్కాలిక పద్ధతిన 2012–2016 మధ్య ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, క్యాంపస్ సెలెక్షన్స్ ద్వారా బీహెచ్‌సీఎల్ ఎంపిక చేసింది. మొదట ఆరు నెలలకు సర్వీసు తీసుకుని ఆ తర్వాత క్రమంగా పొడిగిస్తూ వచ్చింది. ఎప్పటికప్పుడు సర్వీసును పొడిగించడానికి అధికారులు సిఫార్సు చేశారు. ఇఎస్ఐ, ఈపీఎఫ్, బోనస్, ఎస్ఐపీ, రూ. 2లక్షల బీమా సౌకర్యం, వసతి సౌకర్యాల కల్పనకు బీహెచ్‌ఈఎల్ అంగీకరించింది. శాశ్వత నియమాకాలకు ఒప్పుకోవడం లేదు.. అని పిటిషనర్ లాయర్ చిక్కుడు ప్రభాకర్ చెప్పారు.

బీహెచ్‌ఈఎల్‌లో 150 పడకల ఆస్పత్రి ఉందని, పిటిషనర్లను తాత్కాలిక పద్ధతిపై నియామకం జరిగింది. షరతులకు లోబడే సర్వీసులో చేరారు. ఇప్పుడు పర్మినెంట్ చేయాలని కోరడం చెల్లదు అని బిహెచ్‌ఈఎల్ అడ్వొకేట్ చెప్పారు. దీనిపై హైకోర్టు, బిహెచ్‌ఈఎల్ వాదనను తోసిపుచ్చింది. పిటిషనర్లు శాశ్వత ఉద్యోగులుగా నియామానికి అర్హులని తేల్చింది.

వాళ్ల సర్వీస్‌లను పరిగణనలోకి తీసుకుని పర్మినెంట్ ఉద్యోగులుగా తీసుకోవాలి. అన్ని వేతన ప్రయోజనాలను కల్పించాలి.. అని తీర్పు వెలువరించింది.

### బిహార్‌లో జరిగే ఎన్నికల దృష్టిలో పెట్టుకుని...

## జిఎస్‌టి స్లాబులు తగ్గింపు

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:గత వారం ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ జిఎస్‌టి స్లాబులను తగ్గించడం వెనుకాల బిహార్‌లో జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేసిందే తప్ప ప్రజలపైన ప్రేమతో కాదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్‌లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. = ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక దేశం ఒక పన్ను అని ప్రగల్భాలు పలికిన మోడీ ప్రభుత్వం జిఎస్‌టి తీసకువచ్చి ప్రజలపైన భారం మోపి అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరగటానికి కారణమైందని అన్నారు. అప్పటి వరకు లేని వస్తువులపై జిఎస్‌టి తీసుకువచ్చి నేడు జిఎస్‌టి తగ్గించామని జబ్బలు చర్చుకొని ఏదో ప్రజలకి సహాయం చేశామని చెప్పడం సిగ్గుచేటుకరమని అన్నారు. అదేవిధంగా రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు కబ్జా చేశారని ప్రచారం చేస్తున్నారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు.

గత ప్రభుత్వ హయాంలో కబ్జాలు చేసిన వారు నేడు కాంగ్రెస్ నాయకులతో తిరుగుతున్నారని, ఇలాంటి సంఘటనలు కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్‌రెడ్డికి చెడ్డపేరు వస్తుందని ఇప్పటికైన సీఎం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నర్సింహారెడ్డి, ఒక్కరి మల్లేష్, శ్రీనివాస్, మహేందర్, భీమేష్, రమేష్, కనకయ్య, మహేష్ , బజ్జీ గౌరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న సరళారెడ్డి

ప్రజాపక్షం/తాండూరుఃతెలుగు రాష్ట్రాలలో సుస్థిరమైన వ్యాపారవేత్తగా గుర్తింపు పొంది ఆర్‌బిఎల్ ఎండి బుయ్యని సరళా శ్రీనివాస్‌రెడ్డికి బిజినెష్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ కన్వేన్షన్ సెంటల్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బిజినేస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమానికి కేంద్ర పర్యాక, సంస్కృతిక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట డిప్యూటి స్పీకర్ డాక్టర్ జాటోత్ రామ్‌చందర్ నాయక్, ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్‌లు హాజరైనారు. ఈ సందర్భంగా ఆర్‌బిఎల్ మేనేజింగ్ డైరక్టర్ బుయ్యని సరళా శ్రీనివాస్ రెడ్డికి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డును కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు బుయ్యని సరళ శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.



## శామీర్‌పేట పెద్ద చెరువును సందర్శించిన సిపి

### నిమజ్జనాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట పెద్ద చెరువులో వినాయక నిమజ్జనాలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని ప్రజలు, భక్తులు, యువకులు వినాయక విగ్రహాలను అత్యంత భక్తి శ్రద్దలతో ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. నగరం నుంచి అనేక వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయి. గత నెల 27న వినాయక చవితిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున మండపాలు నిర్మించి వినాయకులను ప్రతిష్టించారు. నవరాత్రుల పూజలు అందుకున్న గణనాధులు గంగమ్మ తల్లి ఒడికి చేరుకున్నారు. భజనలు, ఆటలు, పాటలతో ప్రజలు ప్రతిష్టించుకున్న వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకవచ్చి చెరువులో నిమజ్జనం చేశారు. తూంకుంట, శామీర్‌పేట, పోతాయిపల్లి, లక్ష్మాపూర్, ఉద్దెమర్రి తదితర చెరువుల వద్ద ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వసతులు చాలా బాగున్నాయని ప్రజలు చర్చించుకున్నారు.



**ఏర్పాట్లను పరిశీలించిన సిపి అవినాష్ మహంతి**

కాగా శామీర్‌పేట పెద్ద చెరువులో గణనాధుల నిమజ్జన ఏర్పాట్లను సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి శనివారం సాయంత్రం సందర్శించి పర్యవేక్షించారు. మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి, ఏసిపి బాలగంగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌ల పర్యవేక్షణలో గణనాధుల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. తెల్లవారు జాము వరకు నిమజ్జనాలు జరుగుతాయని అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్, మున్సిపల్, ఆరోగ్య శాఖ, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఇన్‌స్పెక్టర్, ఆయా పోస్టులు

ప్రజాపక్షం/మర్పల్లి ః మర్పల్లి మండల పరిధిలోని పల్లిగుండ్ల గ్రామపాథమికొన్నత పాఠశాలలో ప్రీ ప్రైమరీ సెక్షన్ కొరకు ఇన్‌స్పెక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రాథమి కోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి మోసిన్ ఒక ప్రకటనలో తెలిపారు, కనీస అర్హత ఇంటర్ లేదా సమానమైన అర్హతను కలిగి ఉండాలని తెలిపారు. ప్రైమరి టీచింగ్‌లో కోర్సు చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును అని తెలిపారు. ఆయా పోస్టులకు కనీస అర్హత ఏడవ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు.

జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఖచ్చితగా స్థానికులు కావాలని తెలిపారు. దరఖాస్తులను జిల్లా విద్యా శాఖకార్యాలయం వికారాబాద్‌లో ఈనెల 9వ తేదీ వర కు సమర్పించాలని సూచించారు. ఏదైనా సమాచారం కోసం పాఠశాల సమయంతో ప్రాధానోపాధ్యాయులను సంప్రదించాలని,దరఖాస్తు మాత్రం విద్యాశాఖ కార్యాలయంలోనే సమర్పించాలని సూచించారు.

## ఉర్దూ మీడియంలో అతిథి అధ్యాపకుల బోధనకు దరఖాస్తు ఆహ్వానం

ప్రజాపక్షం/వికారాబాద్ :వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలె ఉర్దూ మీడియంలో బొధించుట కొరకై చరిత్ర ,అర్థ శాస్రం రాజనీతిశస్రం విభాగంలో భోదించుటకు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రోఫెసార్ గీత లక్ష్మి పట్నానయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

మంగళవారం సాయంత్రం 5గంటలకు వరకు సమర్పించాలని ,పీహెచ్‌డి, నేట్ ,సౌట్ , భోదన అనుభవం గల సంబందింత పీజీ సబ్జెక్టులో 55శాతం మార్కులు కలిగి ఉండాలని , 10లతేదీన వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళశాలలో ఇంటర్వూ నిర్వమించడం జరుగుతుందని , ఒక సెట్ జిరాక్స్ కాపీ ,ఒరిజినల్ తీసుకోని హజరు కావాలని తెలిపారు. 9505974786 'సంప్రదించాలన్నారు.

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

### తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరుః పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 119మందికి సిఎంఆర్‌ఎఫ్, 96మంది క్యాళణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎంఎల్ఏ లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మానోహర్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందించడమే తమ ప్రభుత్వం ధ్యేయమన్నారు. ఆనోరోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొదిన తాండూరు నియోజకవర్గంలోని లబ్దిదారులకు చెక్కులను అందజేశామన్నారు. పేదలకు మెరుగైన వేద్య సేవలు అందించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆరోగ్యశ్రీకి రూ.10లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వమంటనే ప్రజలకు సేవ చేయడమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ వద్దే శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్,మహిళ నాయకురాలు మాధవి, పట్టణ పార్టీ అధ్యక్షులు హబీబ్‌లాల,సీనియర్ నాయకులు రావుఫ్, మాజీ కౌన్సిలర్‌లు, అయా మండల పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గోన్నారు.



## రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరించినందుకు కృతజ్ఞతలు తెలిపిన విజయేందర్

ప్రజాపక్షం/వికారాబాద్ :తెలంగాణ రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిన్న గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్దరించి వికారాబాద్ జిల్లాలో 137 మంది గ్రామ పాలనధికారులను నియమించి వారికి నియమక పత్రానలు ఇచ్చినందుకు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా తరపున ప్రభుత్వనికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పాలన వ్యవస్థ పునరుద్దరణతో పాటు రెవన్యూ వ్యవస్థ పునరుద్దరణ తో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కావడం తో పాటు సాదారణ ప్రజలకు రైతులకు మేలు కలగడం తో పాటు సత్వర సేవలు అంది ప్రభుత్వ పథకాలు గ్నామీణ ప్రజలకు మరిత సమర్థవంతంగా అందించడానికి అవకాశం లభిస్తుంది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి,రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు, పరిగి,తండూర్ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు





## మహిళలు నైపుణ్యాన్ని పెంచుకొని ఆర్థికంగా ఎదగాలి

### స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రజాపక్షం/వికారాబాద్:మహిళలే తమకు నచ్చిన రంగాల్లో తమ నైపుణ్యాన్ని పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన సభాపతి మహిళను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం మహిళా సాధికారత నిమిత్తం వివిధ రంగాల్లో మహిళల ఆర్థికఅభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రలో 35మంది మహిళలకు 90రోజుల పాటు కుట్టుమిషన్ లో శిక్షణ ఇచి సర్టిఫకేట్ లు అందజేశారు. శిక్షణ పొందిన మహిళలు తమ కుటుంబాలకు ఆర్థిక తోడ్పడుక ఎంతగానో దోహద పడుతుదన్నారు. చదువుతో పాటు మహిళల్లో ఉపాధి కల్పనకు ఉచిత నైపుణ శిక్షణలను ఇవ్వడం జరుగుతుందిఅని తెలిపారు. ఈ శిక్షణలో గ్రామిణ ప్రాంత యువత ను కూడా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామిణ ప్రాంతాల కుటుంబాలే ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా మరిన్ని ఉచిత శిక్షణ కేంద్రాలను నిర్వహించేందుకు తన వంతు సహకరం అందాస్తామనని స్పీకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎ,సుధీర్, జఫర్, స్పూర్తి గ్రామీణ అభివృద్ది సంస్థ ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.



## యోగా వెల్నెస్ అకాడమీని ప్రాంభించిన రమ్య చక్రవర్తి

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ ః యోగా వెల్నెస్ అకాడమీ ని పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ సాయి నగర్ కాలనీలో యూరో కిడ్స్ స్కూల్ ప్రక్కన వన్ మంత్ర యోగా సెంటర్‌ను యోగా గురువు రమ్య చక్రవర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డిచే ప్రాంభించారు.ఈ సందర్భంగా రమ్య చక్రవర్తి మాట్లాడుతూ గత 18 సంవత్సరాలనుండి యోగా సెంటర్‌ను అభ్యాసన చేయడం జరుగుతుందని యోగా ఎంత అనుభవం ఉన్నా నిరంతర విద్యార్థిగానే ఎప్పుడు నేర్చుకుంటూనే ఉండడం జరుగుతుందని అన్నారు. యోగా నేర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వం,వశ్యత పెరుగుతాయని, ఒత్తిడి తగ్గి మానసిక స్పష్టత ఏకాగ్రత మెరుగుపడతుందని రోగనిరోధక శక్తితో పాటు గుండె ఆరోగ్యం బరువు నియంత్రణలో కూడా యోగా సహాయపడుతుందని రమ్య చక్రవర్తి అన్నారు. ఇప్పటివరకు తన వద్ద 300 మంది టీచర్లతో అన్ని గ్రూపులలో మూడు వేల మంది ట్రైనీలు పనిచేస్తున్నారని తను ఇన్ని రోజులు ప్రపంచం మొత్తంమీద అంతర్జాలం ద్వారా ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్ ఆత్రం,తిరుమలరావు,యోగా విద్యార్థులు పాల్గొన్నారు.



## పెంఛన్‌లు పెంచాలంటూ కలెక్టర్ వినతి

ప్రజాపక్షం/కోట్‌పల్లి ః సెప్టెంబర్ 8 న వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో పెంఛన్‌లు పెంచాలంటూ సిఎం రేవంత్ రెడ్డి ని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందిందుకు దివ్యాంగుల, వితంతువులు, వృద్దులు, ఒంటరి మహిళలు తరలిరావలంటూ కోట్‌పల్లి మండల ఇంచార్జి భరత్ కూ మార్ మాదిగ శనివారం అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం చేయుత పెంఛన్ పెంచుతామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని పూర్తి గా మరచి పోయి హామీని నేరవేర్చడంలో ప్రభుత్వం విపలమయ్యిందన్నారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, పింఛన్‌లు 2 వేల రూ.ల నుంచి 4 వేలు దివ్యాంగుల 4 వేల నుంచి 6 వేల వరకు మరియు పూర్తి ఆంగ వైకల్యం కల్గిన వారికి 15 వేల రూ.లు ఇవ్వాలంటూ సెప్టెంబర్ 8 న వికారాబాద్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించేంకు ప్రతి ఒక్కరు రావాలన్నారు. ఎంఆర్‌పిఎస్ జాతీయ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద క్రిష్ణ మాదిగ పిలుపు మేరకు దివ్యాంగుల, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పేర్కొన్నారు.




## అభ్యసనా సామర్థ్యాలు ఆధారంగానే బోధన

### మండల విద్యాధికారి వేంకటేశ్వరావు

ప్రజాపక్షం/బంట్వారం ః బంట్వారం మండల కేంద్రంలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ మేళా ఘనంగా నిర్వహించడం జరిగింది. అభ్యసన సామార్థ్యతలతో బోధనలో బాగంగా ,ఉపాధ్యాయుల ప్రదర్శన ఎంతగానో ఆకటుకున్నాయి. అభ్యాసన సమార్థ్యాల ఆధారంగా విద్యార్థుల కు బోధన జరగాలని , బోధర అభ్యసన పక్రియలో మార్పులు తీసుకురావాలని విద్యాశాఖ ఆలోచిస్తూన్నట్లూ మండల విద్యాధికారి వేంకటేశ్వరావు అన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఉత్తమ ప్రదర్శనలను జిల్లా పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. అదే విధంగా విజేతలుగా నిలచిన ఉపాద్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లేక్స్ ప్రధానోపాద్యాయులు సుధకార్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బ్యాలా , కెజిబీవి ఎస్ ఓ శైలజ, ప్రధానోపాద్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాద్యాయులు తదితరులు ఉన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్
GREATER HYDERABAD

## ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సచివాలయ నగర్ కార్పెంటర్స్ అసోసియేషన్, సచివాలయ నగర్ గాయత్రి భవన్, ఎపిఆర్ క్రిస్టల్ విల్లాస్, మారుతి నగర్‌లో నెలకొల్పిన గణనాథుడిని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు దామోదర్‌రెడ్డి, శంకరయ్య గౌడ్, శశికాంత్, నందకిషోర్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఏడాదిన్నరలోనే 7.5లక్షల రేషన్ కార్డులు

**• అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వాలన్న కాంగ్రెస్ లక్ష్యం • స్థానిక సంస్థల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్‌కే ఇవ్వాలి • మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

**ప్రజాపక్షం/షాద్‌నగర్/కొత్తూరు :** ఏడాదిన్నరలోనే 7.5లక్షల లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందించామని, అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర రెవిన్యూ, సమాచార, పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం అప్పారెడ్డి గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు ప్రారంభించారు. గ్రామంలో కాంగ్రెస్ ప్రచార రథంపై పెద్ద ఎత్తున ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతి పథకంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తుందని వివరించారు. ఇప్పటికే అనేక పథకాలను మహిళల పేర్లపై తీసుకువచ్చామని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతోనే కార్పొరేట్ తరహాలో పరిశ్రమలు స్థాపించేందుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మహిళలు ఆర్‌టిసి బస్సులు, పెంట్రోల్ బంక్‌లు, సోలార్ విద్యుత్ వంటి యూనిట్లను మహిళలు నడిపిస్తున్నారని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్లను కాంట్రాక్టర్లకు ఇచ్చి నిర్మించేందుకు పెద్ద పనికాదు.. కానీ లబ్ధిదారులకే నేరుగా డబ్బులు ఇచ్చి నిర్మిస్తే బాగుంటుందనే ఉద్దేశంతోనే ఈ పథకానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మధ్యవర్తులు లేకుండానే నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే డబ్బులను జమచేయడం జరుగుతుందని, పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ళు నిర్మించి ఒక్క పేదవాడికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రజాధనం దుర్వినియోగం చేసేందుకే డబుల్‌బెడ్‌రూం ఇళ్ళు కట్టించారే తప్పా ఏ ఒక్క పేదవాడికి ఇవ్వలేదని మండిపడ్డారు. వేలకోట్ల నిధులు ఖర్చు చేసి ఒక్కపేదవాడికి ఇవ్వకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.



### ఆర్థికంగా రాష్ట్రం లేకపోయిన ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం : మంత్రి జూపల్లి

తెలంగాణ రాష్ట్ర ఆర్థికంగా బాగాలేకపోయినా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 64ఏళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రులు చేసిన అప్పులకంటే పదేళ్ళు పరిపాలించిన ముఖ్యమంత్రి పదింతలు అప్పులు చేశారని, వాటికి వడ్డీలు చెల్లించలేక అవస్థలు పడుతున్నామని వివరించారు. బిఆర్‌ఎస్ అవినీతిపై కెసిఆర్ సొంత కూతురే బయటపెట్టిందని, కెసిఆర్ చేసిన అప్పులకు సిఎం రేవంత్‌రెడ్డి నెలకు 6500కోట్లు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామాన్ని పాతర వేసి అవినీతిని ఆకాశానికి తీసుకువెళ్ళిన ఘనత కెసిఆర్‌కే దక్కిందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం ముఖ్యమంత్రి వద్దకు వెళ్ళి నిధులు ఇవ్వాలని పట్టుదలతో ప్రయత్నిస్తారని వివరించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అడిగిన వెంటనే పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని మంత్రి గుర్తు చేశారు. వచ్చే బడ్జెట్‌లో షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద పీఠ వేస్తారని, పట్టుదలతో అనుకున్నది సాధించే వరకు నిద్రపోయే ఎమ్మెల్యే కాదని అన్నారు. మిగతా నియోజకవర్గాల కంటే ఈ నియోజకవర్గానికే అధిక నిధులు ఇస్తారని, ఎందుకంటే నల్లమల్ల ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడు వీర్లపల్లి అని పేర్కొన్నారు. గత పాలకులు చేసిన అప్పులను రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టులకు పూర్తిగా గాలికోదిలేశారు : మంత్రి వాకిటి శ్రీహరి

గత పాలకులు రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టులకు పూర్తిగా గాలికి వదిలేశారని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మండిపడ్డారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించకుండా మరోప్రాంతానికి తీసుకువెళ్లి ఈ జిల్లాను ఎడారిగా చేశారని వాపోయారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ళు కట్టిస్తామని మాయమాటలు చెప్పి నిండా ముంచారని పేర్కొన్నారు. ఆశల పల్లకిలో కూర్చోబెట్టి అధికారంలోకి వచ్చి ఇష్టారాజ్యంగా ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రాజెక్టులు కడితే కమీషన్లు ఎక్కువగా వస్తాయని ఆశించే కాళేశ్వరం కట్టి లక్షకోట్లపై కమీషన్ దండుకున్నారని వివరించారు. కమీషన్లతోనే ప్రజాధనం గోదావరి నది జలాల పాలైందని పేర్కొన్నారు. షాద్‌నగర్ ప్రాంతంలో లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయన్‌ను నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు వస్తారని వివరించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి అన్నదాతలకు సాగునీరు, తాగునీరు అంధించడం జరుగుతుందని గుర్తు చేశారు. ఇచ్చిన మాటలను ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసిలు శ్యాంసుందర్‌రెడ్డి, విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ ఎంపిపి ప్రియాంక శివశంకర్ గౌడ్, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, రఘునాయక్, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కొత్తూరు :** తెలంగాణ రాష్ట్ర మంత్రులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు స్వాగతం ఫలికారు. శనివారం నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గేటు వద్ద రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు ఘనంగా స్వాగతం ఫలికి శాలువాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, సమాచార, పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరిలు హాజరై అప్పారెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అతి తక్కువ కాలంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో అద్భుతంగా నిర్మించారంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌శ్రేణులు పాల్గొన్నారు.

## ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఓటర్ల ముసాయిదాపై అభ్యంతరాలు 8 వరకు స్వీకరణ



**ప్రజాపక్షం/షాబాద్:** ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఓటర్ల ముసాయిదాపై ఈ నెల 8 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు ఎంపిడివొ అపర్ణ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండల ఓటర్ల ముసాయిదాను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షాబాద్ మండలంలోని 41 గ్రామ పంచాయతీలకు వార్డుల వారిగా ఓటర్ లీస్టును గ్రామ పంచాయతీలో అతికించామని చెప్పారు. ఓటర్ లీస్టులో ఏమైన తప్పులు ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శులకు పిర్యాదు రాసి ఇవ్వాలన్నారు. మండలంలో మొత్తం ఓటర్ల సంఖ్య 48318 మంది, పురుషులు సంఖ్య 24208 మంది, మహిళల సంఖ్య 24109 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఈ నెల 8 వరకు తీసుకున్న పిర్యాదులను 9వ తేదిన పిర్యాదులను పరిశీలించి ఓటర్ లీస్టును సరి చేస్తామన్నారు. గ్రామంలోని ప్రతి ఓటర్లు తమ ఓటర్ల ముసాయిదాలను పరిశీలించాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో సమయంలో ఎలాంటి సమస్యలు రాకుండ ముందస్తు చర్యలుగా ఎన్నికల కమిషన్ తీసుకుంటుదని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/గండిపేట :** ప్రతి ఒక్కరూ దైవభక్తి తో ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మణికొండ మున్సిపల్‌లోని వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి అన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ వెంకటేశ్వర కాలనీ స్థానికులతో కలిసి వినాయక నిమజ్జనానికి ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గణనాథుడి ఆశీస్సులు కాలనీ ప్రజల అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కాలనీ వాసులు, స్థానికులకు తీర్థ ప్రసాదాలను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాల ప్రత్యేక పూజలు నిర్వహించారు, , మాజీ కౌన్సిలర్స్ పద్మారావు, నవీన్, , పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు తదితరులు నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షుడికి ఎమ్మెల్యే సన్మానం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పి.వెంకట్‌రాంరెడ్డిని స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ సన్మానించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పి.వెంకట్‌రాంరెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమానికి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లా పదవులే కాకుండా ఉన్నతమైన పదవులు పొందేందుకు కృషి చేయాలని, ఉద్యమకారుల అభ్యున్నతికి కోసం నిరంతరం పాటుపడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మాజీ చైర్మెన్ విశ్వం, నేతలు తదితరులు ఉన్నారు.

## మన్సూరాబాద్ పెద్ద చెరువులో అన్నదానం


**ప్రజాపక్షం/హయత్ నగర్ :** మన్సూరాబాద్ పెద్ద చెరువులో శ్రీ వినాయక నిమజ్జన సందర్భంగా అన్నదాన ప్రసాద పంపిణికి ముఖ్య అతిధిగా డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి.విచ్చేసి కార్యక్రమంని ప్రారంభించినారు కార్పొరేటర్ నర్సింహా రెడ్డి మాట్లాడుతు మన్సూరాబాద్ డివిజన్ పెద్ద చెరువులో గత నాలుగు సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రము వినాయక నిమజ్జన మహోత్సవాని నిర్వహిస్తున్నాము అని తెలిపారు ఈ సంవత్సరం కూడా వేలాదిగా భక్తులు, కాలనీవాసులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా సీఐ జలంధర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి . పెద్ద చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నాంపల్లి రామేశ్వర్, శేఖర్, కాశప్ప,యూత్ శేఖర్,సంతోష్ కుమార్, రాజేశ్వర్ రెడ్డి, కవితరెడ్డి,శ్రీధర్ గౌడ్,సాయిరాం గౌడ్,జయతేజ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు మరియు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



## సిరిసిల్ల జెఎన్‌టియు విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిరిసిల్లలోని జెఎన్‌టియు ఇంజనీరింగ్ విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తమ హయాంలో ప్రారంభించిన జెఎన్‌టియు సిరిసిల్ల ఇంజనీరింగ్ కాలేజీకి అవసరమైన శాశ్వత భవనాల నిర్మాణానిన చేపట్టే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేములవాడలోని డిగ్రీ కాలేజీ విద్యార్థుల సమస్యల విషయమై కెటిఆర్ జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్, సాంకేతిక విద్యా కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడినట్టు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని, త్వరగా శాశ్వత భవనాలకు అనుమతులు ఇచ్చి, పనులు ప్రారంభించాలని సూచించారు.



*పూణే సదరన్ కమాండ్‌కు చెందిన కమాండింగ్-ఇన్-చీఫ్, జనరల్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ బృందంతో పాటు దక్షిణ భారత్ ఏరియా జిఒసి మేజర్ జనరల్ ఆర్ఎస్ శ్రీనివాస్, ఉభయ తెలుగు రాష్ట్రాల మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా హైదరాబాద్‌లో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.*

## రాజ్యాంగ విలువలు రక్షించే సుదర్శన్‌రెడ్డినే గెలిపించాలి

ప్రొఫెసర్ హరగోపాల్




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రాజ్యాంగ విలువలు రక్షించే జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని భారత ఉప రాష్ట్రపతిగా గెలిపించేందుకు కృషి చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. శనివారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో జర్నలిస్టు మిద్దెల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకే జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఈ పదవికి పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని వివరించారు. రాజ్యాంగ విలువలు తుంగలో తొక్కేందుకు కేంద్ర ప్రభుత్వ వ్యవహరిస్తుందని, ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా తుంగలో తొక్కారని వాపోయారు. దేశ ప్రధాని నరేంద్రమోడి ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీ, కార్పోరేట్ శక్తులకు దాసోహామై తాకట్టు పెట్టారని మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా సర్వనాశనం చేశారని, గ్రామీణ స్థాయిలో పేదరికం పూర్తిగా అక్కడే ఉందని అన్నారు. అన్యాయంపై ప్రభుత్వాలను ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్లుగా ముద్రలు వేస్తున్నారని వివరించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి న్యాయపరంగానే సమస్యలపై తీర్పులు ఇచ్చారే తప్పా అన్యాయాన్ని ఏనాడు సహించలేదని అన్నారు. రాజ్యాంగాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి ధీటుగానే ఉండాలని ఇండియా కుటమీ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి పోటీలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉన్నారని వివరించారు. మనకు ఓటు హక్కు లేకపోయినా స్థానిక పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్యలను వివరించేందుకు కృషి చేద్దామని తెలిపారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విరుద్దమని, ఒక రాజ్యాంగ బద్దమైన పదవీలో ఉంటూ నక్సలైట్లకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని తప్పుడు ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. దేశంలో అసమానతలు, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని, దీన్ని నియంత్రించడంలో కేంద్ర పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అమిత్ షా వ్యవహరిస్తున్న నియంతృత్వ పోకడలకు పౌర సమాజం పూర్తిగా వ్యతిరేకిస్తుందని అన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎంపిలు ఓటు వేసి భారత ఉప రాష్ట్రపతిగా గెలిపించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ వనమాల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర నాయకుడు బుద్ధుల జంగయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్, ఈశ్వర్‌నాయక్, టిజి శ్రీనివాస్, కరుణాకర్, నర్సింలు గౌడ్, అర్జునప్ప, రవీంద్రనాథ్, జనార్థన్, రామారావు, నక్కా బాల్‌రాజ్, సురేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్సయ్య, సుశీల, శ్యాంసుందర్, రంగరాజన్, జర్నలిస్టులు బూర్గుల ఫణీంద్ర, బాస్కర్, ధన్నారం రమేష్‌లు పాల్గొన్నారు.

## యూనిఫాం హెచ్‌ఆర్ పాలసీ అమలుపై యథాతథస్థితి : హైకోర్టు

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్)ల్లోని ఉద్యోగులకు యూనిఫాం హెచ్‌ఆర్, ట్రాన్స్‌ఫర్ పాలసీని తీసుకువస్తూ గత నెల 22న జారీ చేసిన సర్క్యులర్ అమలుపై యథాతథస్థితి కొనసాగించాలంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సర్క్యుల్కు కౌంటర్లు దాఖలుచేయాలంటూ తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ చైర్మన్, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్, పిఎసిఎస్ హెడ్లతోపాటు జిల్లా కమిటీల కన్వీనర్లకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను అక్టోబరు 7వ తేదీకి వాయిదా వేసింది. జిల్లా స్థాయి ఎంపవర్డ్ కమిటీల కన్వీనర్ గత నెల 22న జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌తో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది బి.ఎస్.ప్రసాద్ వాదనలు వినిపిస్తూ యూనిఫామ్ హెచ్‌ఆర్, ట్రాన్స్‌ఫర్ పాలసీ అమలుకు సర్క్యులర్ జారీ చేసే ముందు కనీసం అభ్యంతరాలను కూడా స్వీకరించకపోవడం చట్టవిరుద్ధమన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి సర్క్యుల్ప యథాతథస్థితిని కొనసాగించాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

## న్యాయశాఖ కార్యదర్శిగా పాపిరెడ్డి బాధ్యతలు

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా బి.పాపిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్నగర్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జిగా పనిచేస్తున్న బి.పాపిరెడ్డిని న్యాయశాఖ కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం గత వారం ఉత్తర్వులిచ్చింది, మేడ్చల్ జిల్లా దబిల్పూర్కు చెందిన పాపిరెడ్డి 2012లో జిల్లా జడ్జిగా ఎంపికై నెల్లూరు, కృష్ణా, విశాఖ, హైదరాబాద్, మెదక్, నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా చేశారు. మహబూబ్నగర్ జిల్లా జడ్జిగా చేస్తూ లా సెక్రటరీగా నియమితులయ్యారు.

## గణపతి నిమజ్జనంలో మధుయాష్కిగౌడ్



**ప్రజాపక్షం/హయత్ నగర్:** మన్సూరాబాద్ డివిజన్ మధురనగర్‌లో జరిగిన వినాయక నిమజ్జనం లో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడతు ఈ వారం రోజులు ఎంతో భక్తి శ్రద్ధ లో తో పూజలు చేసినందుకు ప్రజల అందరికి ధన్యవాదములు తెలిపారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బుడ్డా సత్యనారాయణ కాలనీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి కాలనీ సంక్షేమ సంఘము సభ్యులు పాల్గొన్నారు.

## శంషాబాద్ వెంకటేశ్వర కాలనీలో వినాయక లడ్డూ వేలం పాట సందడి

**ప్రజాపక్షం/శంషాబాద్ :** శంషాబాద్ వెంకటేశ్వరా కాలనీ బంగారు మైసమ్మ దేవాలయంలో మైసమ్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక లడ్డు వేలం పాట ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అన్నెపు ప్రభు ముదిరాజ్ రూ. 31,000 రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు.కార్యక్రమానికి ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పనుగంటి పర్వతాలు, మండల కార్యదర్శి నర్రా గిరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.మైసమ్మ యూత్ అసోసియేషన్ సభ్యులు కిరణ్ కుమార్, శ్రీనివాస్ చారీ, శంకర్ రెడ్డి, నరసింహ చారీ, శేఖర్ యాదవ్, రవీందర్, కుర్మయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## విమర్శలు చేయడం మానుకొని అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించండి

రంగారెడ్డి జిల్లా జెడ్‌పి మాజీ వైస్ చైర్మెన్ ఈట గణేష్




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పరస్పర విమర్శలు చేసుకోవడం మాని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించేందుకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్ సూచించారు. శనివారం పట్టణంలోని బిఆర్‌ఎస్ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బగా ఈట గణేష్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా అంజయ్య యాదవ్ పని చేసినప్పుడు అభివృద్ధిపై దృష్టి పెట్టారే తప్పా ఏనాడు ప్రతిపక్ష పార్టీ నేతలను విమర్శించలేదన్నారు. కానీ నేడు అధికార పార్టీ ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ శ్రేణులు ప్రతిపక్షంలో ఉన్న బిఆర్‌ఎస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని వాపోయారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి నీ ఆస్తులపై విచారణ, నా ఆస్తులపై విచారణ చేద్దాం అం టూ విమర్శలు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు.అధికారంలోకి వచ్చి 21నెలలు గడుస్తున్నా అభివృద్ధిపై మాట్లాడకుండా ఎక్కడికి పోయినా మాజీ ఎమ్మెల్యే, వారి కుమారులు అంటూ విమర్శలు చేయడం పనిగా పెట్టుకోవడం సరి కాదని సూచించారు. అన్నదమ్ముల మద్య వంద ఎకరాల భూమి ఉంటే సిలింగ్ కిందకు ఎలా వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో 4600 కోట్ల వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని, మీకు ఏమాత్రం దమ్ము ఉంటే వారిలా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, వ్యక్తిగత విమర్శలు చేయడం సంస్కారం కాదని అన్నారు. ఈ సమావేశంలో ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, మాజీ కౌన్సిలర్ బచ్చలి నర్సింలు, రవి యాదవ్, శ్రీనులు పాల్గొన్నారు.

## తాగునీటి అవసరాలు తీర్చడానికి త్వరలో మహానగరానికి గోదావరి జలాలు

7,360 కోట్ల వ్యయంతో మెట్రో వాటర్ వర్క్స్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్
శంకుస్థాపనకు రానున్న సిఎం రేవంత్ రెడ్డి
పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**ప్రజాపక్షం/శంషాబాద్ :** మహానగర వాసుల తాగునీటి సమస్యలు,పరిష్కారమవుతున్నాయి. గోదావరి జలాలను హైదరాబాద్‌కు తీసుకురావడానికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. సుమారు 7,360 కోట్ల అంచనా వ్యయంతో మెట్రో వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో గోదావరి తాగునీటి సరఫరా పథకం (ఫేజ్1 2), ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్ల నింపడం, అలాగే మూసీ నది పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో రానున్నారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ శనివారం రోజు సంబంధిత విభాగాల అధికారులతో కలిసి ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు.ఇక హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో నియో పోలీస్ లేఅవుట్ వద్ద ఓఆర్ఆర్ ఎగ్జిట్ 1ఏ వద్ద ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్ నిర్మాణం కూడా ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్టుకు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ శంకుస్థాపన సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పరిశీలించి అధికారులు, ఇంజనీర్లతో సమీక్షించారు.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, "మహానగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడం, మూసీ పునరుద్ధరణ, ట్రాఫిక్ సమస్యలు తగ్గించడమే ఈ ప్రాజెక్టుల ముఖ్యోద్దేశ్యం. ఈ పనులు పూర్తయ్యాక హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయి" అని తెలిపారు.



# రీల్



## 'జాతస్య మరణం ధ్రువం' టీజర్ విడుదల

జెడి చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'జాతస్య మరణం ధ్రువం'. శ్రవణ్ జొన్నాడ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని త్రిష ప్రెజెంటర్‌గా సుర్కెక్ట్ బ్యానర్‌పై మల్యాపురం శివ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ప్రీతి జంఘియానీ రీఎంట్రీ ఇస్తోంది. తాజాగా మేకర్స్ టీజర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా జె.డి చక్రవర్ మాట్లాడుతూ 'జాతస్య మరణం ధ్రువం' పోస్ట్ ప్రొడక్షన్ ముంబైలో ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా చేస్తున్నారు. సీరత్ మంచి డాన్సర్, కొరియోగ్రాఫర్, సింగర్. తనకి సినిమా అంటే పిచ్చి. ఈ సినిమాలో తన పెర్ఫార్మెన్స్ అందరికీ నచ్చుతుంది. నరేష్‌కి నాకు చాలా పోలికలు ఉన్నాయి. తనకి చాలా మోహమాటం. డైరెక్టర్ శ్రవణ్ సినిమాని చాలా అద్భుతంగా తీశాడు. 'జాతస్య మరణం ధ్రువం' టైటిల్ సజెస్ట్ చేసింది నేనే. టైటిల్ క్రెడిట్ నాకే వస్తుంది(నవ్వుతూ) మలయాళం నుంచి వచ్చే సినిమాలు బావుంటాయంటాం. 'జాతస్య మరణం ధ్రువం' ఆ కోవకి చెందిన సినిమా. తప్పకుండా అందరికీ నచ్చుతుంది అని అన్నారు.



## నరేష్@65




వారసుల జనరేషన్‌లో అతి వేగంగా సినిమాలు చేస్తున్న హీరో అల్లరి నరేష్. దివంగత ప్రముఖ దర్శకుడు ఇవి సత్యనారాయణ వారసుడిగా అల్లరి అనే సినిమాతో తెరంగ్రేటం చేసిన నరేష్‌ను అల్లరి నరేష్‌గా ముద్ర పడింది. రాజేంద్ర ప్రసాద్ తరువాత పూర్తి స్థాయిలో కామెడీ ప్రధానంగా నరేష్ సినిమాలు చేసి మెప్పించారు. అయితే ఈ మధ్య కాలంలో యాక్షన్ ఓరియంటెడ్ సినిమాలు కూడా చేసి మెప్పిస్తున్న నరేష్ ఏకంగా తన కెరీర్‌లో 65వ సినిమాకు చేరుకున్నారు. ఒక్కో హీరో ఒక్కో సినిమాకు మూడేళ్ళ సమయం తీసుకుంటున్న తరుణంలో నరేష్ అతి త్వరలోనే వంద సినిమాలు పూర్తి చేస్తారని ఫిలిం ఇండస్ట్రీ చర్చించుకుంటోంది. ఆదివారం నరేష్ హీరోగా 65వ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అన్నపూర్ణ స్టూడియోలో జరిగిన ఈ సినిమా ప్రారంభోత్సవంలో హీరో నాగ చైతన్య క్లాప్ కొట్టారు. డైరెక్టర్ బాబీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు ఆనంద్ దర్శకత్వం వహించారు. వసిష్ఠ, రామ్ అబ్బరాజు, విజయ్ స్క్రిప్ట్‌ను అందజేశారు. హరీష్ శంకర్, సుప్రియ యార్లగడ్డ, జెమిని కిరణ్ అతిథులుగా హాజరైయ్యారు. అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు నిర్మాతలు రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి చంద్ర మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు.



## 'లిటిల్ హార్ట్స్' సక్సెస్ మీట్

మౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన 'లిటిల్ హార్ట్స్' సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. ఆదిత్య హాసన్ నిర్మాతగా వ్యవహరించారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌పై థియేటర్లలో రిలీజ్ చేశారు. 'లిటిల్ హార్ట్స్' సినిమా అన్నివర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతున్న నేపథ్యంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్' సినిమాకు మంచి టాక్ వస్తోంది. ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. టికెట్ బుకింగ్స్ భారీగా జరుగుతున్నాయి. సినిమా జెన్యూన్‌గా సక్సెస్ అయితేనే మేము ఈటీవీ విన్ నుంచి సక్సెస్ మీట్స్ పెడతాం అని అన్నారు. డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్ బన్నీ వాస్ మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్' లాంటి చిన్న సినిమాకు ప్రేక్షకుల ఆదరణ ఎలా ఉంటుందో అనే సందేహంతోనే చిన్న ఉదయం 11 గంటలకు 3 షోస్‌తో ప్రీమియర్స్ స్టార్ట్ చేశాం. సాయంత్రం 7 గంటలకు 29 షోస్ పడ్డాయి. ఈ షోస్ అన్నీ దాదాపు 90 పర్సెంట్ ఫిల్ అయ్యాయి. ఇప్పుడు మల్టీప్లెక్స్‌లో ఒక్క టికెట్ కూడా లేదు. మొత్తం సేల్ అయ్యాయి. ఒక చిన్న చిత్రానికి ప్రేక్షకులు అసాధారణ విజయాన్ని అందించడం గొప్ప విషయం అని చెప్పారు.




## 'విద్రోహి' పాట విడుదల

రవి ప్రకాష్, శివకుమార్, చరిష్మా శ్రీఖర్, సాయికి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'విద్రోహి'. విఎస్‌వి దర్శకత్వంలో సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని విజ్జన వెంకట సుబ్రహ్మణ్యం నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు వివి వినాయక్ చేతుల మీదుగా ఈ సినిమా తొలి పాటను ఆవిష్కరించారు. ఇటీవల ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ని హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. సాంగ్ విడుదల అనంతరం వి వి వినాయక్ మాట్లాడుతూ.. 'విద్రోహి' ఫస్ట్ లుక్ చూశాను. అలాగే ఈ కథ గురించి కూడా విన్నాను. చాలా మంచి కథ. ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని అనుకుంటున్నాను. నేను విడుదల చేసిన సాంగ్ కూడా చాలా బాగుంది. దర్శక నిర్మాతలకు ఆల్ ది బెస్ట్. ఇందులో పోలీస్ ఆఫీసర్‌గా చేసిన రవి ప్రకాష్ నాకు ఎప్పటి నుంచో తెలుసు. మంచి ఆర్టిస్ట్. ఈ సినిమా, టీమ్ అందరికీ మంచి సక్సెస్‌ని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.

## 'నీది నాది ఓ చిరులోకం' పాట విడుదల





బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా కౌశిక్ పెగాళ్ళపాటి దర్శకత్వంలో నిర్మించిన కిష్కిందాపురి సినిమాలోని 'నీది నాది ఓ చిరులోకం' పాటను విడుదల చేశారు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా సస్పెన్స్, థ్రిల్లర్‌గా తెరకెక్కించారు. సాహు గారపాటి, సందీప్ తోలేటి ఈ సినిమాకు నిర్మాతలు. ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. ఈ సినిమాకు చేతన్ భరద్వాజ్ సంగీతం అందించారు. చిన్మయి సలస్కర్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేశారు. ఇంతవరకు సాయి శ్రీనివాస్ చేసిన పాత్రలకు ఇది పూర్తిగా భిన్నంగా ఉంటుందని దర్శకుడు కౌశిక్ తెలిపారు. సినిమాకు సంబధించిన అన్ని పనులు పూర్తయ్యాయని అన్నారు. ఈ నెల 12న సినిమాను విడుదల చేస్తున్నామని చెప్పారు.



## బీస్ట్ మోడ్‌లో నేచురల్ స్టార్

నేచురల్ స్టార్ నాని అద్భుతమైన సినీప్రయాణం 17 ఏళ్ళు పూర్తయింది. ఈ సందర్భంగా నాని తాజాగా చేస్తున్న 'ది ప్యారడైజ్' నుంచి పవర్ ఫుల్ స్టిల్‌ను రిలీజ్ చేశారు. ఈ స్టిల్‌లో నాని కంప్లీట్ బీస్ట్ మోడ్‌లో కనిపిస్తూ, ఇప్పటివరకు ఎన్నడూ చూడని ఫెరోషియస్ అవాతర్‌లో ఆకట్టుకున్నారు. ప్యారడైజ్‌లో నాని నెవర్ బిఫోర్ జడల్ క్యారెక్టర్‌లో కనిపిస్తున్నారు. ఈ క్యారెక్టర్ కోసం జిమ్‌లో ఇంటెన్స్‌గా వర్క్ అవుట్ చేస్తున్నారని ఈ స్టిల్ చూస్తే అర్థమవుతుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, రా స్టేట్మెంట్, గ్లింప్స్ వీడియోలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమా టాకీ పార్ట్ షూటింగు హైదరాబాదులో వేసిన సెట్స్‌లో జరుగుతోంది. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## 'భద్రకాళి'లో జిల్ జిల్ పాట విడుదల



విజయ్ ఆంటోనీ హీరోగా అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. తాజాగా జిల్ జిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. విజయ్ ఆంటోని పవర్ ఫుల్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. భోలే షావలి స్వయంగా రాసి పాడిన ఈ సాంగ్ హై ఎనర్జీతో ఆకట్టుకుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తుంది. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సహకారం అందిస్తోంది. ఈ సినిమాలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృష్ణపాని, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్, రినీ బాట్, రియా జితు, మాస్టర్ కేశవ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## 'గణపతి బప్పా మోరియా..'

### భక్తులతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి నినాదాలు..

హుస్సేన్ సాగర్ వద్ద నిమజ్జనాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు.. భక్తులు, సందర్శకులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ట్యాంక్ బండ వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఆకస్మికంగా పరిశీలించిన సిఎం రేవంత్ రెడ్డి ఎలాంటి భద్రత లేకుండా నలుగురైదుగురు వ్యక్తిగత సిబ్బందితో ట్యాంక్ బండ్ వద్దకు వచ్చి నిమజ్జన ఏర్పాట్లను సిఎం పరిశీలించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్న సిఎం భాగ్య నగర్ ఉత్సవ సమితి వేదికపై నుంచి భక్తులకు అభివాదం చేశారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులతో కలిసి నినాదాలు చేశారు. క్రేన్ నెంబర్ 4 వద్ద నిమజ్జనాలను పరిశీలించారు. నిమజ్జనం ఏర్పాట్లను కలెక్టర్ హరిచందన సిఎం రేవంత్‌కు వివరించారు. ఈ సందర్భంగా విధుల్లో పాల్గొన్న అన్ని విభాగాల సిబ్బందిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ముందస్తు సమాచారం లేకుండా సాదాసీదాగా సిఎం రేవంత్ రెడ్డి హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యక్షం కావడంతో భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా హుస్సేన్ సాగర్ వద్దకు సిఎం రేవంత్ రెడ్డి వచ్చి ఏర్పాట్లను పరిశీలించడం పట్ల భాగ్య నగర్ ఉత్సవ్ సమితి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## గణేశ్ నిమజ్జనోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్నాయి. మహా నిమజ్జనం సాఫీగా సాగేందుకు జిహెచ్ఎంసి పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు నిమజ్జన కార్యక్రమాన్ని నిమిషం నిమిషం పర్యవేక్షించారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో మొత్తం ప్రక్రియను పర్యవేక్షించారు.

**భక్తి ఉత్సాహాల మధ్య నిమజ్జనం..** నగరంలోని ప్రతి వీధిలో గణనాథుడి నినాదాలు, డిజెలు, బ్యాండ్, కోలాటం, డప్పు చప్పుళ్లతో శోభాయాత్రలు ముందుకు కదిలాయి. యువత, పిల్లలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఒక ఆసక్తికరమైన సన్నివేశంలో, పోలీసు అధికారులు కూడా భక్తులతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేసి అందరిలో జోష్ నింపారు.

**పకడ్బందీ ఏర్పాటు..** నిమజ్జనం సజావుగా సాగేందుకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. వేగవంతమైన నిమజ్జనం కోసం 134 స్థిర క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడానికి 20 ప్రధాన సరస్సులతో పాటు 72ప్రత్యేక కృత్రిమ కొలనులను జిహెచ్ఎంసి ఏర్పాటు చేసింది. హుస్సేన్ సాగర్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 9బోట్లు, డిఆర్‌ఎఫ్ బృందాలు, 200 మం ది గజ ఈతగాళ్లు అందుబాటులో ఉన్నారు. 303 కిలోమీటర్ల ప్రధాన ఊరేగింపు మార్గంలో రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేసి శోభాయాత్రకు అనువుగా మార్చారు. మూడు షిఫ్టులలో 15,000మంది పారిశుధ్య కార్మికులు పనిచేసి, నిమజ్జన ప్రాంతాలను శుభ్రం చేశారు. రాత్రిపూట భక్తుల సౌలభ్యం కోసం 56,187 తాత్కాలిక లైటింగ్‌ల ను, అత్యవసర వైద్య సేవలకు 7 వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో 5,000 మందికి ఉచిత భోజనాలు అందించారు.

**మెట్రో, ఎంఎంటిఎస్ సేవలు..** నిమజ్జనం సందర్భంగా భక్తుల సౌలభ్యం కోసం మెట్రో రైళ్లు రాత్రి ఒంటిగంట వరకు నడిచాయి. ఎంఎంటిఎస్ సర్వీసులు కూడా అదనపు గంటలు నడిపారు.

**జిహెచ్ఎంసి ఉచిత భోజన సౌకర్యం..** జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో 5000వేల మందికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. పీపుల్స్ ప్లాజా, ప్రసాద్ ఐమాక్స్ వద్ద ఉచిత భోజనాలు ఏర్పాటు చేయగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

**నిమజ్జన ఏర్పాట్లు, భద్రత..** నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రభుత్వం 303 కిలోమీటర్ల మేర శోభాయాత్రల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జిహెచ్ఎంసీ 13 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి 15 వేల మంది సిబ్బందిని, 30 వేల మంది పోలీసులను విధులు నిర్వహించేందుకు నియమించింది. 160 యాక్షన్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారు. నిమజ్జనం కోసం 20 ప్రధాన చెరువులు, 74 కృత్రిమ కొలనులు, 134 క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లను ఏర్పాటు చేశారు. హుస్సేన్‌సాగర్‌లో 9 బోట్లు, 200 మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నీరు, వైద్య సిబ్బంది, ఫైర్ ఇంజన్‌లను అందుబాటులో ఉంచారు.





## మంత్రి పొన్నం ఏరియల్ సర్వే

హుస్సేన్‌సాగర్‌లో జరుగుతున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని అధికారులతో పాటు హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. గణనాథుల నిమజ్జనాలను పరిశీలించేందుకు మంత్రిపొన్నం ప్రభాకర్, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిజిపి డాక్టర్ జితేందర్, పోలీసు కమిషనర్ సివి ఆనంద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, కలెక్టర్ హరిచందన హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరుగుతోందని తెలిపారు. ఇందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు, మున్సిపాలిటీ సిబ్బంది కలిసి నిమజ్జనాన్ని విజయవంతం చేస్తున్నారని తెలిపారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల్లోగా నిమజ్జనాలు పూర్తవుతాయని అంచనా వేసినట్లు తెలిపారు. గతంలో నిమజ్జనాలకు 3 రోజుల సమయం పట్టేదని, ఇప్పుడు ఒకరోజులో పూర్తయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. మరోవైపు బాలాపూర్ గణనాథుడి శోభాయాత్ర తెలుగుతల్లి ఫ్లై ఓవర్ మీదుగా చేరుకుని క్రేన్ నంబర్ 4 వద్ద నిమజ్జనం జరిగిందన్నారు.

## రూ.35 లక్షలు పలికిన బాలాపూర్ లడ్డూ

### వేలంలో లడ్డును దక్కించుకున్న లింగాల దశరథ్ గౌడ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** దేశవ్యాప్తంగా ఎంతో ప్రత్యేకత కలిగి హైదరాబాద్ బాలాపూర్ గణేష్ లడ్డూ మరోసారి రికార్డు ధర పలికింది. హైదరాబాద్ కర్మాన్ ఘాట్ కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ 35 లక్షల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈసారి సుమారు రూ.5 లక్షలు ఎక్కువగా లడ్డూకు ధర పలకడం విశేషం. వేలం అనంతరం లింగాల దశరథ్ గౌడ్ బాలాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు డబ్బులను అందజేశారు.ముందు గా రూ.1,116తో వేలం ప్రారంభం కాగా పోటాపోటీగా సాగిన వేలంలో లింగాల దశరథ్ గౌడ్ లడ్డూను దక్కించుకున్నారు. ఈసారి వేలంలో మొత్తం 38 మంది పాల్గొన్నారు. గతంలో లడ్డూ దక్కించుకున్న 31 మందితో పాటుగా కొత్తగా మరో ఏడుగురు లడ్డూ వేలంలో పోటీపడ్డారు.గత ఏడాది లడ్డూ ధర రూ.30,01,000తో పాటు రూ.5000 వేలు నాన్ రిఫండబుల్ అమౌంట్ ఉత్సవ కమిటీకి డిపాజిట్ చేశారు. గతేడాది బాలాపూర్ కు చెందిన కొలను శంకర్ రెడ్డి అనే వ్యక్తి 30 లక్షల 1000 రూపాయలకు లడ్డూను వేలంలో సొంతం చేసుకున్నాడు. కాగా బాలాపూర్ లడ్డూ కోసం గత ఆరు సంవత్సరాలుగా వేలంలో పాల్గొంటున్న లింగాల దశరథ్ గౌడ్ దేవుడి కృపతో ఈసారి సొంతం చేసుకున్నట్లు చెప్పారు. ఈసారి వేలంలో లడ్డూ దక్కించుకోవటం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

## ఊరుకునేది లేదు (మొదటి పేజీ తరువాయి)

హాజరుకావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. అఫిడవిట్ దాఖలు చేయకపోతే వ్యక్తిగతంగా హాజరుకావాల్సిందేనని, ఈసారి ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెబుతూ విచారణను 10వ తేదీకి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లిలో 475 చదరపు గజాల స్థలం రిజిస్ట్రేషన్‌కు సబ్రిజిస్ట్రార్ డాక్యుమెంట్లను స్వీకరించకపోవడాన్ని సవాలు చేస్తూ గుప్త రియాల్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతోపాటు ఇలా రిజిస్ట్రేషన్లను నిరాకరించడాన్ని సవాలు చేస్తూ మరికొందరు పిఇషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై న్యాయమూర్తి జస్టిస్ అనిల్కుమార్ జూకంటి విచారణ చేపట్టారు. నిషేధిత జాబితాలోని భూముల వివరాలు 9 వారాల్లో సబ్రిజిస్ట్రార్లకు అందేలా చర్యలు తీసుకోవాలని, దీనికి సంబంధించి ఆయా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడంతోపాటు చేపట్టిన ప్రక్రియపై 10 రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని లేదంటే హాజరు కావాలంటూ గత ఆదేశాల అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి ఇలాంటిది ఊహించలేదని, ఇది ఆయన కార్యాలయం ప్రతిష్ఠను తగ్గించేలా ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ న్యాయవాది కాట్రం మురళీధర్‌రెడ్డి వివరణ ఇస్తూ హైకోర్టు ఉత్తర్వుల అమల్లో భాగంగా వివరాల సేకరణలో ప్రభుత్వం ఉందన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లతోపాటు దేవాదాయశాఖ, వక్ఫ్‌బోర్డుల నుంచి భూముల వివరాలను సేకరించడానికి ప్రభుత్వం ఈనెల 1న మెమో జారీ చేసిందంటూ ఆ కాపీని అందజేశారు. అన్ని వివరాలు సేకరించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని దీనికి కొంత గడువు కావాలని కోరారు.

## మహా గణపతికి ఘన వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

చేర్చారు. దారిపొడవున ఎక్కడ చూసినా 'గణపతి బప్ప మోరియా' అంటూ చిన్నాపెద్దా అంతా వారి భక్తిని చాటుకున్నారు. అడుగడుగున మహాగణపతికి నీరాజనం పలికారు. మహాగణపతిని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ట్యాంక్ బాండ్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. విజయవాడ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన వాహనంలో 70 టన్నుల భారీ గణనాథుడి శోభాయాత్ర నిర్వహించారు. భక్తుల కోలాహలం నడుమ ఎన్‌టిఆర్ మార్గ్‌లోని నాలుగో క్రేన్ వద్దకు చేరిన లంబోధరుడికి ఖైరతాబాద్ ఉత్సవ సమితి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ క్రేన్ సహాయంతో హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేశారు.

**ఆద్యంతం కనుల పండువగా సాగిన ఖైరతాబాద్ గణేశుడి శోభయాత్ర..** పూజల అనంతరం సంప్రదాయ మేళతాళాలతో ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర నిర్వహించారు. మహాగణపతి శోభాయాత్ర ఆద్యంతం కనుల పండువగా సాగింది. జైబోలో గణేశ్ మహారాజ్ కీ జై! అంటూ జయజయధ్వానాలు మార్మోగాయి. అశేష భక్తజనావళి చూస్తుండగానే కనురెప్పపాటు కాలంలో ఆ పార్వతీ తనయుడు గంగ ఒడిలోకి చేరాడు. శుక్రవారం అర్ధరాత్రి చివరిసారిగా కలశపూజ నిర్వహించారు. శనివారం వేకువజామున 69 అడుగుల ఎత్తు, 50 టన్నులున్న గణనాథుడిని ప్రత్యేక వాహనంపైకి చేర్చారు. భక్తుల కోలాహలం మధ్య సంప్రదాయ మేళతాళాలతో ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర గంగమ్మ దిశగా సాగింది. భక్తులు గణనాథుడిపైకి పూలు చల్లుతూ, డోలు వాయిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. దారి పొడవునా నీరాజనాలు పలికారు. శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ పక్క నుంచి సచివాలయం మీదుగా సాగర తీరానికి చేరుకున్నాడు. ఖైరతాబాద్ గణేశ్ హుస్సేన్‌సాగర్ తీరానికి చేరగానే కోలాహలం అంబరాన్నంటింది. లక్షలాది మంది భక్తులు వినాయక నామ స్మరణతో సాగర తీరం మారు మోగింది. గణేశ్ మహరాజ్‌కి జై అంటూ భక్తులు హోరెత్తించారు. హుస్సేన్‌సాగర్‌లో ఏర్పాటు చేసిన నాలుగో క్రేన్ (బాహుబలి క్రేన్) వద్ద నిమజ్జనానికి సంబంధించిన ప్రక్రి య పూర్తి చేశారు. భారీ క్రేన్ సాయంతో మహగణపతిని గంగమ్మ ఒడికి చేర్చారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com